ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-6-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 128 పేజీలు: 10+4 వెల: 6.50

టిఎఫ్‌సిసి అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా

నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు హరీష్

2

# కొత్తగా ముగ్గురు

## మంత్రులుగా ప్రమాణం చేసిన వివేక్, లక్ష్మణ్, శ్రీహరి



ఆదివారం రాజ్‌భవన్‌లో వివేక్, లక్ష్మణ్, శ్రీహరి చేత మంత్రులుగా ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ. చిత్రంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్8:** తెలంగాణ క్యాబినెట్ విస్తరణ జరిగింది. సంగతి తెలిసిందే. నూతన మంత్రులుగా వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి అవకాశం దక్కించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12.20 నిమిషాలకు రాజ్‌భవన్‌లో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆ ముగ్గురి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన మంత్రులకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులతో పాటు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,అధికారులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం ముగిసిన అనంతరం రాజ్‌భవన్ ఆవరణలోనే పాత మంత్రులు,కొత్త మంత్రులతో కలిసి సిఎం,గవర్నర్ గ్రూప్‌ఫోటో దిగారు. అదేవిధంగా,శాసనసభ ఉపసభాపతి (డిప్యూటీ స్పీకర్)గా రామచంద్రు నాయక్ నియమితులయ్యారు. ప్రమాణ స్వీకారినికి ముందు ఉదయం దీనిపై రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. "నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరించబోతున్న వివేక్ వెంకట స్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరికి నా అభినందనలు. శాసనసభలో ఉప సభాపతి బాధ్యతలు స్వీకరించబోతున్న రామచంద్రు నాయక్‌కు నా అభినందనలు..." అని పేర్కొన్నారు. కాగా, మంత్రివర్గంలో చాన్స్ దక్కించుకున్న ఈ ముగ్గురు కూడా తొలిసారి ఎమ్మెల్యేలు కావడం విశేషం. వివేక్ వెంకటస్వామి గతంలో ఎంపీగా >>2

మంత్రి వర్గాన్ని విస్తరించిన సిఎం రేవంత్

డిప్యూటీ స్పీకర్‌గా రామ చంద్రునాయక్

కేబినెట్‌లో
ఒసిలు - 7,
బిసిలు -3,
ఎస్సీలు -4,
ఎస్టీలు-1,
ఖాళీలు -3

మొత్తం 15కు చేరిన మంత్రివర్గ సభ్యులు

ప్రమాణ స్వీకారానికి హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

# అటు అసంతృప్తులు.. ఇటు బుజ్జగింపులు

## రంగంలోకి మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్

### ఇంకా ప్రాతినిధ్యం దక్కని ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్

### ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న సుదర్శన్ రెడ్డి

### త్వరలో మరో ముగ్గురికి అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్8:** కేబినెట్ విస్తరణ తెలంగాణ కాంగ్రెస్‌కు మరో తలనొప్పి తెచ్చింది. కొత్తగా ముగ్గురు ప్రమాణ స్వీకారం చేయడంతో పాతవారితో కలిపి ఇప్పటి వరకు తెలంగాణ మంత్రివర్గం 15కు చేరింది. దీంతో మంత్రివర్గంలో మరో మూడు ఖాళీలు ఉన్నాయి. కాగా, ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు >>2



ఆదివారం మల్‌రెడ్డి రంగారెడ్డితో భేటీ అయిన మంత్రి పొన్నం, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ తదితరులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో మంత్రి పొన్నం, మహేష్ గౌడ్ చర్చలు 6

## రాజీవ్ యువ వికాసం

# మరింత ఆలస్యం!

### అయోమయంలో దరఖాస్తుదారులు

### ఇంకా విడుదల కాని తుది జాబితా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్8:** రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఉద్దేశించిన రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు మరింత సమయం పట్టేలా ఉంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముగిసినా తుది జాబితాలను ఇంకా విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో దీని పై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువకులు నిరాశకు లోనవుతున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు రుణ పత్రాలు అందజేస్తామని ప్రభుత్వం ముందుగా ప్రకటించింది. కానీ చివరి నిమిషంలో దానిని వాయిదా వేసింది. అయితే ఈ నెల 5వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ పథకం గురించి ఏ నిర్ణయం తీసుకోలేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ పథకానికి 1,03,567 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలకు ఇచ్చిన లక్ష్యాల ప్రకారం రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణాలను అందజేస్తామని సర్కార్ ముందుగా ప్రకటించింది. జాబితా విడుదల వాయిదా వేయడంతో దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు. రాజీవ యువ వికాసం పథకానికి సంబంధించి కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో దరఖాస్తులు భారీగా రావడంతో అనర్హులను పక్కన పెట్టారు. బ్యాంకు పూచీకత్తు తర్వాత జిల్లా, మండలస్థాయి కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అనంతరం తుది జాబితాలనూ సిద్ధం చేశారు. ఈ పథకంలో రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్ల కోసం దరఖాస్తులు భారీగా వచ్చాయి. అయితే చివరి నిమిషంలో లబ్ధిదారుల ఎంపికను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో మరింత లోతుగా విచారణ చేసిన తర్వాతే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అంటే మొన్నటి వరకు నిర్వహించిన మండల, జిల్లా స్థాయి కమిటీలు ఎంపికలను సక్రమంగా చేపట్టాయా, లేదా? లేదంటే మరోసారి చేపడతారా అనే విషయంలో స్పష్టత లేదు. ఎంపికల్లో ఏమైనా అక్రమాలు చోటు చేసుకున్నాయా అనే విషయం తెలియాల్సి ఉంది. యువ వికాసంలో మారిన నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులు యూనిట్లను ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో మార్చుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం గత నెల 29వ తేదీన ఎడిట్ ఐచ్ఛికం కూడా అందుబాటులోకి >>2



## హైదరాబాద్ చేరిన ప్రభాకర్ రావు

### నేడు సిట్ ఎదుట హాజరు

### కీలక దశకు ఫోన్ ట్యాపింగ్ కేసు

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక దశకుచేరుకుంది. ఈ కేసులో మొదటి ముద్దాయిగా వున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ బాస్ డాక్టర్ ప్రభాకర్ రావు 15 నెలల అజ్ఞాతం తరువాత ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఫోన్ ట్యా పింగ్‌పై గత ఏడాది మార్చి 10వ తేదీన పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవడం తెలిసిందే. అంతకు నెల రోజుల ముందుగానే ప్రభాకర్‌రావు అమెరికాకు పారిపోయారు. వాస్తవానికి ఈ కేసు ఫిబ్రవరి నెలాఖరున వెలుగు చూడగా అంతకు ముందే ప్రభాకర్ రావు ఉడాయించారు. ఈ కేసులో ఇప్పటి వరకు ముగ్గురు పోలీసు అధికారులు, మరో మాజీ పోలీసు అధికారి అరెస్టయి పది నెలల పాటు చంచల్‌గూడ జైల్లో వుండి బెయిలుపై విడుదలవడం >>2

# రోడ్డు ప్రమాద బాధితులకు లక్షన్నర దాకా ఉచిత వైద్యం



### క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే వారికి ప్రోత్సాహం

### కేంద్ర పథకం రాష్ట్రంలో అమలుకు పోలీసు, రవాణా శాఖల సన్నాహాలు

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలలో గాయపడ్డ వారికి భారీ ఊరటనిచ్చే అంశం. ఇకముందు లక్షా 50 వేల రూపాయల వరకు ఇకముందు ఉచిత వైద్యం అందనుంది. ఇదే సమయంలో క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే వారిపై ఎలాంటి కేసులుండక పోగా వారికి నగదు పురస్కారాలు అందు తాయి. కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన ఈ పథకం రాష్ట్రంలో పక్కాగా అమలు చేసేందుకు పోలీసు, రవాణా శాఖ సన్నాహాలు చేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ఏటా లక్ష 25 వేల మందికి పైగా రోడ్డు ప్రమాదాలలో మరణిస్తుండగా నాలుగు లక్షల మందికి పైగా గాయపడుతుండడం, క్షతగా త్రులు సుధీర్ఘకాలం పాటు వైద్యం తీసుకోవాల్సి న పరిస్థితులు వుండడంతో కేంద్రం ఈ కొత్త పథకాన్ని అందుబాటులోకి తేగా రాష్ట్రంలో దీని అమలు ప్రారంభమైందని పోలీసు అధికారు లు చెబుతున్నారు. దేశంలో రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్న వారు ప్రతీయేటా పెరుగుతుండడం, మృతుల్లో యువకులు, కుటుంబ భారాన్ని మోస్తున్న వారే ఎక్కువగా వుండడం, క్షతగాత్రులకు గంటలోపు వైద్యం అందక పోవడం వల్లే మరణాలు ఎక్కువగా వున్నాయని నివేదికలు చెబుతుండడంతో దీని నివారణకు కేంద్రం కొత్త పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీం 2025 పేరిట నెల రోజుల క్రితం అందుబాటులోకి వచ్చిన ఈ పథకం రోడ్డు ప్రమాదాల బాధితులకు ఒక వరంగా చెప్పాలి. రోడ్డు ప్రమాదాల బాధితులకు వైద్యం అందడం కోసం చర్యలు తీసుకోవాలన్న సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్రం కొత్త పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. వారం రోజుల వరకు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ పథకం అందుబాటులో వుంటుంది. రోడ్డు ప్రమాద బా ధితుల్లో 90 శాతం బీద, మధ్య తరగతి వారే వుండడం, మెజా రిటీ ఘటనల్లో బాధితుల వద్ద డబ్బులు వుండక పోవడం తెలిసిందే. ఇలాంటి వారికి కొత్త పథ కం భారీ ఊరటగా చెప్పాలి. మోటారు వాహనం కారణంగా ఏ రహదారిలో ప్రమాదం జరిగినా ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకాన్ని అమలు చేయబోమని ఏ ఆసుపత్రి కూడా నిరాక రించేందుకు వీల్లేదు. ఒకవేళ ఏదైనా ఆసుపత్రి ఉచిత వైద్యం అందించేందుకు నిరాకరిస్తే వెంటనే పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయ వచ్చు. ట్రామా, పాలీ ట్రామా సేవలు అందించ గల సామర్థ్యం వున్న ఆసుపత్రులకు ఈ పథకాన్ని వర్తింప చేశారు. అయితే ఈ సామర్థ్యం లేని ఆసుపత్రులు క్షతగాత్రులను వెంటనే పెద్ద >>2

## ఆరువేలు దాటిన కరోనా కేసులు

### దేశవ్యాప్తంగా 65 మందిమృతి 2



## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూత

### అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

### నివాళులర్పించిన సిఎం రేవంత్, మాజీ సిఎం కెసిఆర్



హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం చేపప్రసాదం కోసం భారీగా తరలివచ్చిన ప్రజలు

# చేపప్రసాదం కోసం వేలాది మంది రాక



చేప ప్రసాదం స్వీకరిస్తున్న మంత్రి పొన్నం

### ప్రారంభించిన మంత్రి పొన్నం, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

### క్యూలో నిలబడిన వృద్ధుడు గుండెపోటుతో మృతి


**హైదరాబాద్ (గోషామహల్), జూన్ 8 ప్రభాతవార్త:** మృగశిర కార్తెను పురస్కరించుకుని యేటా మాదిరిగానే ఈ ఏడు కూడా మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన చేప ప్రసాదాన్ని రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, >>2

# పార్టీలకతీతం దత్తాత్రేయ

### నా స్కూల్ బిజెపిలో, కాలేజ్ టిడిపిలో, ఉద్యోగం రాహుల్‌గాంధీ వద్ద: సిఎం రేవంత్‌రెడ్డి

### అలయ్ బలయ్ పేరుతో అందరిని ఏకతాటిపైకి: ఎపి సిఎం చంద్రబాబు

### బండారు దత్తాత్రేయ 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణకు హాజరైన మాజీ రాష్ట్రపతి, మాజీ ఉపరాష్ట్రపతి, పలువురు గవర్నర్లు, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు



హైదరాబాద్‌లో ఆదివారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణకు హాజరైన సిఎం రేవంత్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్8:** హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయది పేరుకు హిందుత్వం..మతం భారతీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలయ్ బలయ్ అంటే జ్ఞాపకం వచ్చేది దత్తాత్రేయ అనిఅభివర్ణించారు. దత్తాత్రేయ కోరుకున్నది జనహితం, ఆయనది లౌకికవాదమని కొనియాడారు. లేఖలు రాయడంలో దత్తాత్రేయ అంబాసిడర్‌గా నిలిచారని సీఎం ప్రశంసించారు. ఆదివారం శిల్పకళా వేదికలో హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో దత్తాత్రేయ పుస్తకం రచించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు(ఏపీ), ఎ.రేవంత్‌రెడ్డి (తెలంగాణ), మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, ఏపీ గవర్నర్ నజీర్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, >>2

ఇక ఓపెన్ మార్కెట్‌లో తెలంగాణ బ్రాండ్‌బియ్యం

రాష్ట్రంలో పత్తి విత్తనాలకు తీవ్ర కొరత 6



ఆదివారం హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి పొన్నం తదితరులు

# కొత్తగా ముగ్గురు

>> పనిచేసిన సంగతి తెలిసిందే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక వాకిటి శ్రీహరి మక్తల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందగా, అడ్లూరి లక్ష్మణ్ ధర్మపురి సెగ్మెంట్లో విజేతగా నిలిచారు. కరీంనగర్ జిల్లాలో మూడో మంత్రి పదవి కోసం మాదిగ సామాజిక వర్గానికి చెందిన కవ్వంపల్లి సత్యనారాయణ, కాపు సామాజిక వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ పోటీపడినా, మంత్రి శ్రీధర్ బాబు అండదండలతో అడ్లూరికి చోటు దక్కింది. కవ్వంపల్లికి మంత్రి పదవి అడ్డుకోవడంలో పొన్నం ప్రభాకర్ పావులు కదిపినట్లు తెలుస్తోంది. మొత్తం 18 మంత్రి పదవుల్లో మొదట 12 పదవులను భర్తీ చేయగా, ఇప్పుడు విస్తరణలో మరో 3 పదవులను భర్తీ చేశారు. ఇంకా మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఏడాదిన్నర ఖాళీగా ఉన్న అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవిని ఇప్పుడు భర్తీ చేశారు. ఎస్టీ బంజారా వర్గానికి డిప్యూటీ స్పీకర్ పదవిని రామచంద్రు నాయక్‌కు ఇచ్చారు.

**తెలంగాణ మంత్రులు-కులాలు**

**ఓసీ:** రేవంత్‌రెడ్డి (సిఎం, రెడ్డి), ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (రెడ్డి), పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (రెడ్డి), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (రెడ్డి), తుమ్మల నాగేశ్వరరావు (కమ్మ), జూపల్లి కృష్ణారావు (వెలమ), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు (బ్రాహ్మణ). **బీసీ:** పొన్నం ప్రభాకర్ (గౌడ్), కొండా సురేఖ (పద్మశాలి), వాకిటి శ్రీహరి (ముదిరాజ్). **ఎస్సీ:** భట్టి విక్రమార్క (డిప్యూటీ సిఎం,మాల), గడ్డం వివేక్ (మాల), దామోదర రాజనర్సింహ (మాదిగ), అడ్లూరి లక్ష్మణ్ (మాదిగ). **ఎస్టీ:** సీతక్క

**కొత్త మంత్రులకు అప్పగించే శాఖలు ఇవేనా?**

రాజ్‌భవన్‌లో ముగ్గురు కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత వారికి ఇచ్చే శాఖలు ఏంటీ అని చర్చ జరుగుతోంది. సిఎం వద్ద ఉన్న శాఖలే వీరికి కేటాయించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం సిఎందగ్గర హోం,మున్సిపల్,విద్య,సంక్షేమ శాఖలు ఉన్నాయి. ఇందులో నుంచే శాఖలు వారికి ఇవ్వవచ్చునని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల వద్ద నుంచి శాఖలు మార్చకపోవచ్చునని అంటున్నారు.

## నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు హరీష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్8:** మాజీ నీటిపారుదల శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సోమవారం నాడు కాళేశ్వరం కమిషన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ముందు హాజరై వాగ్మూలం ఇవ్వనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిల నిర్మాణాలపై కమిషన్ గత ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన ఈటల రాజేందర్, హరీష్ రావులతో పాటు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈనెల 5వ తేదీన మాజీ సిఎం కెసిఆర్ హాజరుకావాల్సి ఉండగా, వాయిదాను కోరుతూ తాను ఈనెల 11వ తేదీన కమిషన్ ముందు హాజరవుతారని కమిషన్‌కు తెలియజేశారు. మాజీ ఆర్థిక శాఖ మంత్రి, ప్రస్తుత బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ ఈనెల 6వ తేదీన కమిషన్ ముందు హాజరయ్యారు. ఈనెల 11న బుధవారం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జస్టిస్ పిసి ఘోష్ విచారణకు హాజరుకానున్నారు.

## టిఎఫ్‌సిసి అధ్యక్ష పదవికి నిర్మాత సునీల్ నారంగ్ రాజీనామా



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్8:** తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టిఎఫ్‌సిసి) అధ్యక్ష పదవికి నిర్మాత సునీల్ నారంగ్ రాజీనామా చేశారు. మూడోసారి అధ్యక్షుడిగా ఎంపికైన ఆయన, పదవి చేపట్టిన కేవలం 24 గంటల వ్యవధిలోనే పగ్గాలు వదిలేయడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు ఆయన ఓ లేఖ విడుదల చేశారు. తన అనుమతి లేకుండా కొంతమంది వ్యక్తులు మీడియా ముందుకొచ్చి అనవసర వ్యాఖ్యలు చేయడంతో తనకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఆ ప్రకటనలతో తానకు సంబంధం లేనప్పటికీ, తనను దానికి బాధ్యుడిగా చూపించడం తగదని అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో తన పాత్రను నిబద్ధతతో నిర్వర్తించడం అసాధ్యమని భావించిన సునీల్ నారంగ్, తాను ఇకపై పదవిలో కొనసాగలేనని స్పష్టం చేశారు. అందుకే తక్షణమే తన రాజీనామాను సమర్పిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

## కెసిఆర్‌ను రక్షించాల్సిన అవసరం నాకు లేదు: ఈటల

**హైదరాబాద్, జూన్ 8 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను రక్షించాల్సిన అవసరం నాకు లేదంటూ బిజెపి ఎంపి ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరు అయ్యానని ఆనాటి ఆర్థికశాఖ మంత్రిగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, అందులో తన పాత్రను కమిషన్ ఎదుట వివరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ మంత్రులు కావాలనే ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఈటల రాజేందర్ మండిపడ్డారు. కమిషన్ ముందుకు రాజకీయ ప్రకటన చేయడానికి వెళ్లలేదని అన్నారు. మంత్రివర్గ ఉప సంఘం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టే లేదని తెలిపారు. కాళేశ్వరంలోని అనేక ప్రాజెక్టుల రీడిజైనింగులు కేబినెట్ సబ్ కమిటీ సూచించిందని అన్నారు.. త్వరలోనే అన్ని జిఒలు, సబ్ కమిటీ నిర్ణయాలు, సూచనలు బయటపెడతా అని కీలక ప్రకటన చేశారు. కేబినెట్‌లో చర్చించకుండా నిర్ణయం తీసుకోకుండా ఏదీ జరుగదని, అలాంటిది కేబినెట్ చర్చించలేదని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఏ నిర్ణయాన్ని కెసిఆర్ సొంతంగా అమలు చేయలేదు. అందరి చేతా కెసిఆర్ సంతకాలు తీసుకున్నారు అన్నారు.

ఈ విషయం అప్పటి మంత్రులు తుమ్మల, జూపల్లి, కడియం శ్రీహరిలకు కూడా తెలుసని అన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే పిసి ఘోష్ రిపోర్ట్ బయటపెట్టి చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. లేదంటే కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

## ఆరువేలు దాటిన కరోనా కేసులు

### దేశవ్యాప్తంగా 65 మందిమృతి

**న్యూఢిల్లీ,జూన్ 8:** దేశంలో కరోనా కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 6000 మార్కును దాటేసింది. గడచిన 48 గంటల్లోనే 769 కొత్త కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 65 మంది మరణించినట్లు ఆదివారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆరోగ్య శాఖ విడదల చేసిన తాజా డేటా ప్రకారం, కేరళలోనే అత్యధికంగా కొవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ఆ తర్వాత గుజరాత్, బెంగాల్, ఢిల్లీలో కేసులు ఎక్కువగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా యాక్టివ్ కొవిడ్ కేసుల సంఖ్య 6,133లకు చేరింది. గత 24 గంటల్లోనే కొవిడ్ కారణంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచించింది. ప్రస్తుతం కేరళలో అత్యధికంగా 1950, గుజరాత్ 822, బంగాల్ 693, ఢిల్లీ 686, మహారాష్ట్ర 595 కేసులు నమోదయ్యాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 81, తెలంగాణలో 10 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలోనే అన్ని రాష్ట్రాల్లో వైద్య సౌకర్యాల తనిఖీ కోసం మాక్ డ్రిల్ నిర్వహించాలని అన్ని రాష్ట్రాలకు సూచించినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా ఆక్సిజన్, ఐసోలేషన్ వార్డులు, వెంటిలేటర్లు, అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులోఉండేలా చూసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై అంచనా వేసేందుకు ఇటీవలూ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సునీతా శర్మ అధ్యక్షతన సమీక్షసమావేశాన్ని నిర్వహించారు.

## రాజీవ్ యువ వికాసం మరింత ఆలస్యం!

>> తీసుకువచ్చారు. ప్రస్తుతం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణపత్రాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. రూ.2 నుంచి4 లక్షల వరకు యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు రుణం వస్తుందో, రాదో అనే సందేహం ఉంటే, వారి యూనిట్లను రూ.50 వేల నుంచి రూ.లక్షకు మార్చించుకునే వీలుంది. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ అవకాశాన్ని చాలా తక్కువ మంది సద్వినియోగం చేసుకుంటున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 09-06-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
త్రయోదశి ఉ.9.35
విశాఖ మ.3.29
వర్జ్యం రా.7.54-9.40
దు.మ.1) మ.12.34-1.26, 2) మ.3.11-4.03
శుభ సమయం : ఉ.5.30-6.15
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** కాంట్రాక్టులు పొందుతారు. సాహిత్యాలపై ఆసక్తిచూపుతారు. సంతానం నూతన ప్రయత్నాలు పొందుతారు.

**వృషభం :** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి పట్టింది బంగారంగా వుంటుంది.

**మిథునం:** కోర్టుకేసుల నుండి బయటపడతారు. ఇంటి నిర్మాణ ఆలోచనలు ముమ్మరంచేస్తారు.

**కర్కాటకం :** ఇతరుల విషయంలో జోక్యం తగదు. విద్యార్థులు అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**సింహం:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. సోదరుల నుండి కీలక సమాచారం.

**కన్య :** రాజకీయ, పారిశ్రామిక, సినిమా రంగాలలోని వారు అనూహ్య మైన అవకాశాలు పొందుతారు.

**తుల :** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఎంతోకాలంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి.

**వృశ్చికం:** సంఘంలో గౌరవమర్యాదలు పొందుతారు. విలువైన వస్తు, ఆభరణాలు కొనుగోలుచేస్తారు.

**ధనుస్సు:** చిరకాల సమస్యల నుండి బయటపడతారు. ఆరోగ్య, వాహనాల విషయాలలో చాలా జాగ్రత్త అవసరం.

**మకరం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. సోదరుల నుండి ధన లాభం పొందుతారు.

**కుంభం:** ఉద్యోగాలలో చికాకులు ఎదురైనా అధికమిస్తారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మీనం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# చేపప్రసాదం కోసం వేలాది మంది రాక

>> రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ పిష్‌కమిటి చైర్మన్ మెట్టు సాయికుమార్,బత్తిని సోదరులతో కలిసి చేపమందు ప్రసాదాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 170 ఏళ్లుగా చేప ప్రసాదాన్ని బత్తిని కుటుంబ ఉబ్బసం రోగులకు అందించడం గర్వించదగ్గ విషయమ న్నారు. ఎంతో నమ్మకంతో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కాకుండా విదేశాల నుంచి కూడా చేప ప్రసాదాన్ని స్వీకరించేందుకు వస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం తరపున బత్తిని కుటుంబానికి పద్మశ్రీ అవార్డు కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయనున్నట్లు తెలిపారు.రానున్న రాజ్యసభ సమావేశాలలో ఈ విషయాన్ని లేవనెత్తుతానని చెప్పారు. చేప ప్రసాదంపై కొంత మంది వైద్యులు దుష్ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.170 ఏళ్లుగా బత్తిని సోదరులు చేపమందు ప్రసాదం ఎంతో ఆదరణ పొందుతున్నట్లు చెప్పారు.ఈ చేప మందు ప్రసాదంలో ఎన్నో ఔషద గుణాలు ఉన్నాయన్నారు.తాను 1995 నుంచి చేప మందు ప్రసాదాన్ని స్వీకరిస్తున్నానని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌గౌడ్ తెలిపారు. ప్రభుత్వం పరంగా చేప మందు ప్రసాదం స్వీకరించే వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.ముఖ్యంగా వేలాది మంది వచ్చే ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు వెంట వచ్చే వారి కోసం పలు స్వచ్ఛంద సంస్థలు ఆల్పహారం,అన్నదానం చేయడం పట్ల స్వచ్ఛంద సంస్థలను వారు అభినందించారు. చేప ప్రసాదానికి భారీ ఎతు_న్న ఉబ్బసం వ్యాధి గ్రస్థులు చేప ప్రసాదం వేసుకునేందుకు తరలి వచ్చారు.బత్తిని సోదరులు తయారు చేసిన చేప ప్రసాదం వేసు కునేందుకుగాను క్యూలో నిల్చున్నారు. గత ఏడాది కన్న ఈ యేడాది ఉబ్బ సం వ్యాధి గ్రస్తుల స ంఖ్య పెరిగే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగర ఇన్‌చార్జ్,మంత్రి పొన్నం ప్రభాకర్ రంగంలోకి దిగి చేపప్రసాదం ఏర్పాట్లపై గ్రేటర్ హైదరాబాద్‌లో వివిధ విభాగాలకు చెందిన అధికారులతో తరుచుగా సమావేశాలు ఏర్పాటు చేసి వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చే రోగులతో పాటు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సూచనలు,సలహాలు ఇచ్చారు.పోలీసు విభాగం, రెవెన్యూ అధికారులతో పాటు ఆయా విభాగాల అధికారులు విధులను నిర్వహించారు.నగర పోలీసు కమీషనర్ సి.వి.ఆనంద్ పర్యవేక్షణలో ట్రాఫిక్ డిసిపి,అదనపు డిసిపి, టాస్క్‌ఫోర్స్ డిసిపిలు, ఎసిపిలు, సిఐలు, ఎస్ఐలు అదనపు పోలీసు బలగాలతో బందో బస్తును ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌కో, ఆరోగ్యశాఖ, అగ్నిమాపక దళం, రెవెన్యూ, ఆర్‌టిసి సమన్వయంతో వ్యవహరించారు.

**అధికంగా ఉత్తరాదివాసులే...**

చేప ప్రసాదం కోసం ఉత్తర భారతీయులు,అధికసంఖ్యలో తరలివచ్చారు.కాగా చేప ప్రసాదం కోసం నగర ప్రజలు ఉదయం నుంచి చేపప్రసాదం కోసం తరలిరావడం కనిపించింది.అస్తమా వ్యాధిగ్రస్థులు చేప ప్రసాదం పొందేందుకు గతంలో కంటే అధికంగా వ్యాధిగ్రస్తులు తరలిరావడం కనిపించింది. కాగా చేపప్రసాదం కోసం వేలాది మంది తరలివచ్చే ఎగ్జిబిషన్ మైదానంలో భారీ పోలీసు బలగాలను ఏర్పాట్లు చేశారు. కాగా బత్తిని హరినాథ్‌గౌడ్ సోదరులు దూద్‌బౌలిలో తమ నివాసంలో పూర్వీకుల ఆచారం ప్రకారం ప్రత్యేక పూజలు చేసి చేప ప్రసాదాన్ని భారీ పోలీసు బందోబస్తు మధ్య నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానానికి తీసుకుని వచ్చారు.బత్తిని సోదరులు ఉచితంగా చేప ప్రసాదం ఆస్తమా రోగులకు అందిస్తున్నారు.ఆర్‌టిసి రైల్వేస్టేషన్లు,బస్‌స్టాండ్‌లతో పాటు విమానాశ్రయం తదితర ప్రాంతాల నుంచి స్పెషల్ బస్సులు నడిపారు.

**32 కేంద్రాల ద్వారా ప్రసాదం టోకెన్‌ల పంపిణి...**

ఎగ్జిబిషన్ గ్రౌండ్ అజంతా గేట్ వద్ద ఏర్పాటు చేసిన 32 భారీ కేడ్‌లలోవెళ్లే ఆస్తమా రోగులు అరకిలో మీటర్ తరువాత గాంధీదర్శన్ ముందు 32 కేంద్రాల ద్వారా ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన చేప ప్రసాద టోకెన్‌లను కౌంటర్‌లలో తీసుకున్నారు.ఈ ప్రాంతంలో ఎలాంటి తొక్కి సలాటకు తావులేకుండా అన్ని విభాగాల అధికారులు ఏర్పాట్లు చేశారు.40 రూపాయలు చెల్లించి టోకెన్ తీసుకున్న తరువాత నేరుగా భారీ కేడ్‌ల వెంబడి మరో అరకిలో మీటర్ వెళ్లి ఆస్తమా రోగులు కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో చేప పిల్లలను తీసుకుని చేపప్రసాదాన్ని తీసుకోవడం కనిపించింది.బత్తిని సోదరులు ఉచితంగా కార్తె ప్రసాదాన్ని అందచేశారు.

**క్యూలో నిలబడిన వృద్ధుడు గుండెపోటుతో మృతి**

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అందచేస్తున్న చేప మందు ప్రసాదం కోసం వచ్చిన మెదక్ జిల్లాకు చెందిన సత్యనారాయణ(77) ప్రసాదం కోసం పంపిణి కోసం క్యూలైన్‌లో నిల్చున్నాడు.అకస్మాత్తుగా కూప్పకూలిపోయాడు.అక్కడ ఉన్న పోలీసులు ఉన్న 108 అంబులెన్స్‌ను రప్పించి వైద్య నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రికి తరలించే సరికి అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించినట్లు చెప్పారు.కాగా అతనికి గుండె పోటు వచ్చి ఉంటుందని ప్రసాదంలో విధులను నిర్వహిస్తున్న అధికారులు తెలిపారు.ఎండలు విపరీతంగా ఉండటం మూలంగా జనం తాకిడికి ఉక్కపోత అధికంగా ఉండటం మూలంగా ప్రజలు కూడా కొంత ఇబ్బందుల పాలయ్యారు.

# ఇటు బుజ్జగింపులు

>> ప్రాతినిధ్యం దక్కలేదు. మైనారిటీలకు మంత్రివర్గంలో చాన్స్ దక్కలేదు. అయితే త్వరలో మరోసారి మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని సమాచారం. మంత్రి పదవి దక్కిన వాళ్లు ఆనందం వ్యక్తం చేస్తుండగా.. పదవి ఆశించి భంగపడ్డ నేతలు అలకపూనారు. దీంతో వారిని బుజ్జగించేందుకు హైకమాండ్ సిద్ధమైంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌లు తమకు తప్పకుండా మంత్రి పదవి వస్తుందని ఆశించారు. మొదట్నుంచి వచ్చిన ఊహాగానాల్లోనూ వీరి పేర్లే ప్రముఖంగా వినిపించాయి. కానీ చివరకు అనూహ్యంగా కాంగ్రెస్ అధిష్టానం వారికి మొండి చేయి చూపింది. దీంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ క్రమంలో వారిని బుజ్జగించేందుకు హైకమాండ్ సిద్ధమైంది. మంత్రివర్గంలో తనకు స్థానం లభించకపోవడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆయన నివాసానికి ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ యాదవ్ వెళ్లారు. ఆయనతో సంప్రదింపులు జరిపారు. సుదర్శన్ రెడ్డితో చర్చల అనంతరం ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావుతో మాట్లాడేందుకు వాళ్ల ఇళ్లకు వెళ్లాని కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించుకున్నారు. అయితే వారిద్దరిలో ప్రేమ్‌సాగర్‌రావుతో సమావేశమైనట్లు సమాచారం. రాజగోపాల్‌రెడ్డితో ఎఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్,మంత్రి వివేక్ సమావేశమయ్యారరని సమాచారం. ఇదిలా ఉంటే, మంత్రి పదవి ఆశించి భంగపడ్డ మల్‌రెడ్డి రంగారెడ్డి సాయంత్రం ప్రెస్‌మీట్ పెడుతున్నట్లు చెప్పడంతో ఆయనను బుజ్జగించేందుకు ఎఐసిసి ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ బృందం రంగంలోకి దిగింది. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షులు,ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రంగారెడ్డి నివాసానికి వెళ్లి బుజ్జగించినట్లు సమాచారం.

**త్వరలో మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం: మహేశ్‌కుమార్‌గౌడ్**

రాబోయే రోజుల్లో మంత్రివర్గంలో అగ్ర వర్ణాలకు అవకాశాలు కల్పించనున్నట్లు టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు.ఇంకా 3 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని, సామాజికి న్యాయం అమలు చేస్తూ మంత్రివర్గం కూర్పు జరుగుతోందని అన్నారు. త్వరలో మరో ముగ్గురికి మంత్రులగా అవకాశం కల్పిస్తామని తెలిపారు.

**రంగారెడ్డి జిల్లాకు తగిన న్యాయం చేసేందు ప్రయత్నం చేస్తా**

వచ్చే రోజుల్లో రంగారెడ్డి జిల్లాకి తగిన న్యాయం చేసే విధంగా ప్రయత్నిస్తానని టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ కేబినెట్ విస్తరణలో కుల సమతుల్యతకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. రెండు మంత్రి పదవులు ఎస్సీలకు, ఒకటి బిసి వర్గానికి కేటాయించడం జరిగిందని అన్నారు. కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ అంశాల దృష్ట్యా ఈ కేటాయింపులు అమలయ్యాయని, ఇంకా మూడు కేబినెట్ బెర్తులు కేటాయించాల్సి ఉందని అన్నారు. మంత్రి పదవి ఆశించిన సీనియర్ నాయకులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆవేదనను అర్థం చేసుకున్నాం అన్నారు. ఈ విషయాన్ని ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్ రెడ్డి, ఏఐసిసి పెద్దలకు వివరించడం జరిగిందని అన్నారు.



హైదరాబాద్‌లో ఆదివారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణకు హాజరైన మాజీ రాష్ట్రపతి కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎపి సిఎం చంద్రబాబు

# పార్టీలకతీతం దత్తాత్రేయ

>> ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ చైర్మన్ గడ్డం ప్రసాద్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర మంత్రులు డి.శ్రీధర్‌బాబు,కోమటిరెడ్డి వెంకటర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఏపీ మంత్రి సత్యకుమార్, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, రఘునందన్‌రావు తదితరులతో పాటు పలు ఇతర ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... జెంటిల్‌మెన్‌కు ప్రతిరూపం దత్తాత్రేయ అని అన్నారు. దత్తాత్రేయను దత్తన్న అని అభిమానంగా పిలుచుకుంటారన్నారు. సాధారణ కార్యకర్త నుంచి జాతీయ నేతగా ఎదిగారని కొనియాడారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, సంఘర్షణలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. "దత్తాత్రేయ కోరుకుంది జనహితం.. ఆయనదిలౌకిక వాదం.ఆయన పాటించేది మతసామరస్యం. 'అలయ్ బలయ్' పేరుతో అన్ని వర్గాలను ఏకతాటిపైకి తెచ్చారు. అందరినీ కలిపేందుకు వేదిక రూపొందించారు. ఆయనకు విరోధులు ఎవరూ ఉండరు. ఆయనకు ఏ రాజకీయ పార్టీ అనే వ్యత్యాసం ఉండదు. దత్తాత్రేయది ఆదర్శరాజకీయ జీవితం. ప్రజాసమస్యలపై ప్రభుత్వాలు, సీఎంలకు లేఖలు రాశారు. లేఖలు రాయడంలో అంబాసిడర్‌గా నిలిచారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం అనునిత్యం పనిచేశారు. ఉత్తర, దక్షిణ భారత్ ప్రజలతో ఆయన మమేకమయ్యారు అని చంద్రబాబు తెలిపారు. ప్రపంచంలో భారత్ నంబర్ వన్ గా అయ్యే రోజులు తొందర్లోనే ఉన్నాయని జోస్యం చెప్పారు. తెలుగుజాతి అగ్రస్థానంలో ఉండేందుకు దీక్ష తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

పదవి ఉన్నా లేకున్నా బండారు దత్తాత్రేయపై ఉన్న గౌరవం ఏ మాత్రం తగ్గదని, పార్టీలకు అతీతంగా అందరూ ఆయన్ను గౌరవిస్తారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.రాజకీయాల్లో ఎన్నో ఒడిదొడుకులు చూసినప్పటికీ దత్తాత్రేయ ఎప్పుడూ వెనకడుగు వేయలేదన్నారు. గౌలిగూడ గల్లి నుంచి హరియాణా గవర్నర్ వరకు ఎదిగారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.సాధారణ ప్రజలతో ఆయనకు మంచి అనుబంధం ఉందని అన్నారు.పేదలు చేసుకునే చిన్న చిన్న వేడుకల్లో ఆయన భాగం అయ్యేవారని గుర్తుచేశారు. దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి కుటుంబాలతో తనకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయని వివరించారు. ఇటీవల తాను ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరయ్యానని,ఈ సందర్భంగా ఆయనతో కలిసి మధ్యాహ్న భోజనం చేశానని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మోదీ... చంద్రబాబు గారిని చూపించి మీ సన్నిహితుడు కూడా ఇక్కడే ఉన్నారు అని చెప్పారు. అప్పుడు నేను... స్కూల్ మీ (బీజేపీ) వద్ద చదువుకున్నాను... కాలేజి ఆయన (చంద్రబాబు) వద్ద చదువుకున్నాను... ఇప్పుడు రాహుల్ గాంధీ వద్ద ఉద్యోగం చేస్తున్నాను అని చెప్పాను. దాంతో అందరూ నవ్వేశారని రేవంత్ రెడ్డి వివరించారు. తనకు ఉన్న సన్నిహిత సంబంధాలను ఎప్పుడు దాచుకోలేదన్నారు. మంత్రివర్గ విస్తరణ ఉన్నప్పటికీ ఆ కార్యక్రమం అవ్వగానే దత్తాత్రేయ కోసం ఇక్కడికి వచ్చానన్నారు. ఆయన అజాత శత్రువు అని కొనియాడారు. జాతీయ రాజకీయాల్లో వాజ్‌పేయికి ఉన్న గౌరవం రాష్ట్రస్థాయిలో దత్తాత్రేయకు ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమం తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అని అభివర్ణించారు. ఆయన శైలి, విధానాల నుంచి కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారు నేర్చుకోవాలని సూచించారు. జంటనగరాల్లో కష్టం వస్తే ప్రజలకు గుర్తుకు వచ్చే నాయకులు పీజేఆర్, దత్తాత్రేయ అని రేవంత్ రెడ్డి అన్నారు. తిరుపతి దర్శనాలు, రైల్వే రిజర్వేషన్ కోసం తమకు సిఫార్సు లేఖలు ఇచ్చేవారన్నారు. తమ నిర్ణయాల్లో వారి స్ఫూర్తి ఉంటుందని అన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, తెలంగాణ మంత్రులు పాల్గొన్నారు. దీంతో కార్యక్రమానికి హాజరైన అతిథులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛలోక్తి విసిరారు. ఈ వేదిక గవర్నర్‌ల పరేడ్‌లా ఉందన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న మంత్రివర్గం మొత్తం ఈ వేదికపైనే ఉందని, తాను మంత్రివర్గ సమావేశం ఇక్కడే పెట్టుకోవచ్చని సీఎం సరదాగా వ్యాఖ్యానించారు.

**రాజకీయాల్లో నీతి, నిజాయితీ.. సిద్ధాంతాలు ముఖ్యం: వెంకయ్య**

రాజకీయాల్లో నీతి, నిజాయితీ.. సిద్ధాంతాలు ముఖ్యమని వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సూచించారు. రాజకీయ విమర్శలు సంస్కారవంతంగా ఉండాలని చెప్పారు. అసభ్యంగా మాట్లాడే వారికి ఎన్నికల్లో సరైన జవాబివ్వాలని వెంకయ్యనాయుడు తెలిపారు.

## హైదరాబాద్ చేరిన ప్రభాకర్ రావు

>> విదితమే. కాగా ఇదే కేసులో ఏ7గా వున్న మీడియా అధినేత శ్రవణ్ రావు సైతం 14 నెలల పాటు అమెరికాలో తలదాచుకుని అరెస్టు నుంచి సుప్రీం కోర్టులో మధ్యంతర మినహాయి ంపు పొందాక భారత్‌కు వచ్చారు. ఆయనను పోలీసులు మూడుసార్లు విచారించారు. అయితే శ్రవణ్ రావును తన వ్యాపార భాగస్వామిని మోసం చేసినందుకు సిసిఎస్‌లో నమోదైన చీటింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ప్రభాకర్ రావు కూడా సుప్రీం కోర్టు నుంచి పోలీసులు అరెస్టు చేయకుండా మధ్య ంతర ఉత్తర్వులు పొందిన తరువాతే భారత్‌కు రావడం గమనార్హం. అయితే సుప్రీం కోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు లభించే సమయానికే ప్రభాకర్ రావు పాస్‌పోర్టును విదేశాంగ శాఖ రద్దు చేయగా ఆయన భారత్‌కు వచ్చి ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరయ్యేందుకు వీలుగా తాత్కాలిక పాస్‌పోర్టును మం జూరు చేశారు. దీనికి సంబంధించిన ప్రక్రియ అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో కొంత ఆలస్యం కావడంతో ఈ నెల ఐదవ తేదీన రావాలసిన ప్రభాకర్ రావు ఆదివారం రాత్రి హైదరాబాద్ వచ్చారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన ప్రభాకర్ రావు వద్ద వున్న పత్రాలను ఇమిగ్రేషన్ అధి కారులు పరిశీలించిన తరువాత అనుమతించారు. అనంతరం ఆయన నేరుగా ఇబ్రహీంబాగ్‌లో గల తన ఇంటికి వెళ్లిపోయారు. కాగా సోమవారం ఉదయం పది గంటల సమయంలో ప్రభాకర్ రావు బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కోసం ఏర్పాటు చేసిన సిట్ కార్యాలయానికి విచారణకు హా జరుకానున్నారు. దీనిపై ఆయన ఇప్పటికే పోలీసులకు సమాచారం అందించారు. ఈ విచారణ పశ్చిమ మండల డిసిపి విజయ్ కుమార్ నేతృత్వంలో జరగనుంది.

## రోడ్డు ప్రమాద బాధితులకు లక్షన్నర దాకా ఉచిత వైద్యం

>> ఆసుపత్రులకు తమ అంబులెన్స్‌లో తరలించాల్సి వుంటుంది. ఇక కొత్త పథకం కింద క్షతగాత్రులకు వైద్య సేవలు అందించిన ఆసు పత్రులు తమకు అందవలసిన బిల్లుల గురించి కేంద్ర రహదారుల శాఖ పోర్టల్‌లో అన్ని వివరాలతో అప్ లోడ్ చేయాల్సి వుంటుంది.

**ప్రపంచ వాహనాలలో భారత్ వాటా 1%.. ప్రమాదాలు 11 శాతం**


ఇదిలావుండగా ప్రపంచవ్యాప్తంగా వున్న కోట్లాది వాహనాలలో భారత్ వాటా కేవలం ఒక శాతం మాత్రమేనని కేంద్ర రహదారుల శాఖ గణాంకాలు చెబుతు న్నాయి. అయితే రోడ్డు ప్రమాదాల వాటా మాత్రం 11 శాతంగా వుండడం గమనార్హం. దేశంలో ఏటా ఐదు లక్షలకు పైగా ప్రమాదాలు జరుగుతుండగా లక్షా 25 వేల మందికి పైగా మరణిస్తున్నారు. మృతుల్లో అత్యధికం 28 ఏళ్ల వయస్సు వారే వున్నారని గణాంకాలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఏటా రోడ్డు ప్రమాదాలలో 14 వేల మంది వరకు మరణిస్తున్నారు. తెలంగాణలో సగటున రోజుకు 20కి పైగా ప్రమాదాలు జరుగుతుండగా ఎపిలో 25 వరకు జరుగుతు న్నాయి. భారత్‌లో రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా వుంటున్నారు. హెల్మెట్లు ధరించక పోవడం ఇందుకు ఒక కారణంగా తేలింది.

**క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించిన వారికి నగదు**

మరోవైపు రోడ్డు ప్రమాదాల బాధితులను వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించే వారికి గుడ్ సమరిటన్ పథకం కింద ఐదు వేల రూపాయల నగదు పురస్కా రం ఇస్తారు. ఎక్కువ మందిని కాపాడిన పది మందికి లక్ష రూపాయల వరకు రివార్డు ఇస్తారు. గుడ్ సమరిటన్ పేరిట వున్న ఈ పథకం 2026 మార్చి నెలాఖ రు వరకు వుంటుంది.

# డిఆర్ఆర్ దాన్ 75 వరి వంగడాలకు డిమాండ్

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** డిఆర్ఆర్ దాన్ 75 కొత్తరకం వరి వంగడాలకు డిమాండ్ ఏర్పడింది. ఈ విత్తనాల కోసం పెద్ద సంఖ్యలో రైతులు ఎగబడుతున్నారు. ఈ విత్తనం సీడ్ అగ్గి తెగులు, ఎండాకు తెగులను తట్టుకునేలా రూపొందించారు. బీపీటీల క్వాలిటీ మెయింటెన్ చేసేలా వంగడాన్ని రూపొందించారు. ఈ వరి రకం వంగడం ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుండటంతో రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ విత్తనాలను భారతీయ వరి పరిశోధన సంస్థ బీపీటీ విత్తనం నుంచి డెవలప్ చేశారు. బీపీటీ రకంలో ఒక వరి కంకికి 150 నుంచి 200 గింజలు ఉండగా డీఆర్ఆర్ దాన్ 75 రకంలో 350 నుంచి 450 వరకు గింజలు ఉంటాయి. అగ్గితెగులు తట్టుకునేలా జీన్ ఎడిట్ చేశారు. వెయ్యి గింజల బరువు 16 గ్రాముల కంటే ఎక్కువ ఉంటుంది. బీపీటీలో అయితే 12 నుంచి 13 గ్రాముల బరువు ఉంటుంది. గింజల శాతం ఎక్కువ ఉండటంతో దిగుబడి ఎక్కువగా వస్తుంది. నేల రకాన్ని బట్టి పూర్తి జాగ్రత్తలు తీసుకుని సాగు చేస్తే 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా బ్రీడ్ ను డెవలప్ చేసినట్లు వరి పరిశోధన శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఖరీఫ్ సీజన్ లో 135 రోజులు, రబీలో 125 రోజుల్లో పంట కోతకు వస్తుంది. 100 రోజుల్లో ఫ్లోరింగ్ వస్తుంది. ఆ తర్వాత 30 రోజుల్లో హార్వెస్టింగ్ కు వస్తుంది. భారీ తుఫాన్ లాంటి వర్షాలు మినహాయిస్తే సాధారణ వర్షాలను నెలకు ఒరిగిపోకుండా కాండం కూడా బలిష్టంగా ఉంటుంది. ధాన్యం తూకం వేసే సమయంలో తేమ శాతం కూడా బాగుంటుందని, దీంతో రైతులు ఎక్కడ అమ్మకాలు చేసిన ఆశించిన స్థాయిలో ధర వస్తుంది. కల్లాలో తడిసి ముద్దయిన ఒక రోజులో ఎండుతుందని అంటున్నారు. సాంబామసూరి మాదిరిగానే దీనిని కూడా సాగు చేస్తే సరిపోతుందని, ప్రత్యేకంగా ఎరువులు, మందులు వేయాల్సిన పనిలేదని చెబుతున్నారు. అన్ని పంటల మాదిరిగానే కాండం తొలుచు పురుగులను అదుపు చేయగలిగితే రైతులు ఎక్కువ దిగుబడి పొందవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు.



# వచ్చేవారం దేశమంతా భారీ వర్షాలే!

### నాలుగు రాష్ట్రాలకు హీట్‌వేవ్స్!

### వాతావరణ శాఖ సూచనలు

**న్యూఢిల్లీ, జూన్ 8:** దేశవ్యాప్తంగా మళ్లీ వాతావరణం మారబోతుంది. భారత వాతావరణ విభాగం (ఐఎండి) విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం, వచ్చే వారం మొత్తం వర్షాలు కురవనున్నాయి. ఈశాన్య భారతదేశంలో ప్రస్తుతం రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ఈ క్రమంలో జూన్ 11 నుంచి 14 వరకూ అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనావేసింది. దీంతోపాటు నాగాలాండ్, మణిపూర్, మిజోరాం ప్రాంతాల్లో జూన్ 10 నుంచి 13 వరకూ వర్షాలు కురిసే ఛాన్సుంది. కానీ త్రిపురలో ప్రత్యేకంగా జూన్ 8 నుంచి 12 మధ్య తీవ్రగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఈ క్రమంలో ఈ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మరోవైపు కేరళ, మాహే, తీర ప్రాంతాలైన కర్ణాటక, లక్షద్వీప్ లలో ఈ వారం మొత్తం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. జూన్ 10 నుంచి 14 మధ్య తమిళనాడు, పుదుచ్చేరి, రాయలసీమ, తూర్పు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. జూన్ 13, 14న కేరళ, కర్ణాటక, లక్షద్వీప్ ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండీ హెచ్చరించింది. జూన్ 12న కర్ణాటకలో 70 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని ఐఎండీ తెలిపింది. మధ్య భారత్, తూర్పు ప్రాంతాల్లో బీహార్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, గంగా తీర ప్రాంత బెంగాల్ లలో ఈదురు గాలులు, మెరుపులతో కూడిన వాతావరణం ఉండొచ్చు.

బీహార్, విదర్భలో జూన్ 11, 12 తేదీలలో గంటకు 70 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని అంచనా. జూన్ 9న అండమాన్, నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరించింది. ఇక రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ ప్రాంతాల్లో జూన్ 8 నుంచి 11 వరకు వేడి గాలులు వీస్తాయని అంచనా. పశ్చిమ రాజస్థాన్‌లో జూన్ 9న వేడి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. పంజాబ్, హర్యానా, ఢిల్లీలకు జూన్ 9, 10 తేదీలలో హాట్ నైట్స్ అంటే రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గకపోవచ్చని ఐఎండి వెల్లడించింది.

కానీ జూన్ 11 నుంచి 14 వరకు ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో తేలికపాటి వర్షాలు పడొచ్చని అంచనా. కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా ప్రాంతాల్లో జూన్ 8 నుంచి 14 వరకు వర్షాలు కొనసాగుతాయి. జూన్ 12 నుంచి 14 వరకు కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అలాగే మధ్య, వాయవ్య భారతదేశంలో ఉష్ణోగ్రతలు వచ్చే 3 రోజుల్లో 23 డిగ్రీలవరకు పెరిగే అవకాశం ఉంది. దీని వల్ల వేడిగాలుల తీవ్రత మరింత పెరగనుంది.

# సర్పంచ్ నుంచి మంత్రిగా ఎదిగిన వాకిటి

### గడ్డం వివేక్‌కు ఎట్టకేలకు మంత్రి పదవి..16 యేళ్ల రాజకీయ చరిత్రలో తొలిసారి

### అలుపెరుగని ప్రయత్నం.. అడ్లూరి లక్ష్మణ్‌కు విజయం దాసోహం



వాకిటి శ్రీహరి | గడ్డం వివేక్ | అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 8:** గ్రామ సర్పంచ్ నుంచి మొదలై అంచెలంచెలుగా ఎదిగిన వాకిటి శ్రీహరి(మక్తల్ ఎమ్మెల్యే)ని తాజాగా మంత్రి పదవి వరించింది. రాజకీయాల్లో చేరినప్పటి నుంచి ఎన్ఎస్ యూఐ, యూత్ కాంగ్రెస్ సహా పార్టీకి వివిధ హోదాల్లో సేవలందించారు. పార్టీకి విధేయుడిగా ఉంటూ, పని చేసుకుంటున్న వాకిటి శ్రీహరికి సామాజిక సమీకరణాల్లో భాగంగా మంత్రి పదవి వరించింది. వాకిటి శ్రీహరికి మంత్రి పదవితో రాష్ట్రంలోనే అత్యంత ఎక్కువ జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి తాజాగా చోటు కల్పించినట్లైంది. దీంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు మరో మంత్రి పదవి దక్కినట్లయింది. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జూపల్లి కృష్ణారావు పర్యాటక,ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా వాకిటి శ్రీహరి రెండో మంత్రి అయ్యారు.

2001లో మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో మక్తల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టారు. అదే సమయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగానూ పని చేశారు. 2014లో జడ్పీటీసీగా, మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గానూ సేవలందించారు. కృష్ణా జలాల పరిరక్షణ సమితి సభ్యుడిగానూ వ్యవహరించారు. 2022 నుంచి 2024 వరకూ నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీ ఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిపై శ్రీహరి 17,000 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. శాసన సభ్యునిగా ఎన్నికైన మొదటిసారే శ్రీహరికి మంత్రి పదవి దక్కడం విశేషం. యూత్ కాంగ్రెస్‌లో చేరిన ప్పటి నుంచి మొదలు వాకిటి శ్రీహరి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. సుదీర్ఘకాలంగా పార్టీకి విధేయునిగా కొనసాగుతూ వస్తున్నారు. మంత్రివర్గంలో బీసీలకు, అందులోనూ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారికి చోటు కల్పించాలన్న డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి వాకిటి శ్రీహరి పేరు వెలుగులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన ఎమ్మెల్యేలలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే శ్రీహరి ఒక్కరే. సామాజిక సమీకరణాలు, విధేయతను పరిగణలోకి తీసుకుని మంత్రివర్గాన్ని విస్తరిస్తే శ్రీహరికి మంత్రి పదవి తప్పకుండా దక్కుతుందనే ఊహాగానాలు మొదట్నుంచి చక్కర్లు కొట్టాయి. తాజాగా మంత్రి పదవి ఖరారుతో ఉత్కంఠకు తెరపడింది. బీఏ వరకు చదువుకున్న శ్రీహరి తండ్రి నర్సింహులు కాంట్రాక్టర్ కాగా తల్లి రాములమ్మ స్టాఫ్ నర్సుగా పదవీ విరమణ చేశారు. వాకిటి శ్రీహరి భార్య, తమ్ముడు, మరదలు సైతం ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజాసేవలోనే ఉన్నారు.

చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు ఎట్టకేలకు మంత్రి పదవి వచ్చింది. స్థానిక కాంగ్రెస్ నేతలతో సయోధ్య లేదని వార్తలు వచ్చినప్పటికీ వివేక్‌కు మంత్రి పదవి వరించింది. వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన గడ్డం వివేక్, 2009 లో కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎంపీగా ఎన్నికయ్యారు. తర్వాత పరిణా మాల్లో భాగంగా బీఆర్ఎస్, బీజేపీలలోకి మారారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లోకి చేరి ఎమ్మెల్యేగా గెలిచారు.

తాజాగా మంత్రి బెర్తును ఖరారు చేసుకున్నారు. వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన వివేక్ వెంకట స్వామి, సుదీర్ఘ కాలంగా ప్రజా జీవితంలోనే ఉన్నారు. 2009లో కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి పార్లమెంట్ సభ్యునిగా పోటీ చేసి ఎన్నికయ్యారు. తెలం గాణ ఉద్యమ సమయంలో 2013 జూన్‌లో అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. సరిగ్గా ఎన్నికల సమయంలో 2014లో టీఆర్ఎస్ నుంచి మళ్లీ కాంగ్రెస్‌లో చేరి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత మళ్లీ 2016లో తిరిగి గులాబీ గూటికి చేరారు. టీఆర్ఎస్‌లో చురుగ్గా కొనసాగిన వివేక్ 2019లో పెద్దపల్లి ఎంపీ టికెట్ ఆశించగా, దక్కకపోవడంతో ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2019 ఎన్నికల తర్వాత భారతీయ జనతా పార్టీలో చేరిన గడ్డం వివేక్, క్రియాశీలక నేతగా గుర్తింపు పొందారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, శాసనసభ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన బాధ్యతలు నిర్వర్తించారు. పెద్దపల్లి నుంచి వివేక్ బీజేపీ తరఫున పోటీ చేస్తారని భావించినప్పటికీ 2023లో హఠాత్తుగా మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వివేక్‌ను ప్రభుత్వం తాజాగా మంత్రివర్గంలోకి తీసుకుంది. మంత్రి శ్రీధర్‌బాబు సహా పలువురు కాంగ్రెస్ నేతలకు, వివేక్‌కు మధ్య సయోధ్య లేదని ఇటీవల వార్తలు వచ్చాయి. సరస్వతీ పుష్కరాల ప్రారంభోత్సవంలోనూ స్థానిక ఎంపీ గడ్డం వంశీని పిలవకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అనూహ్యంగా కేబినెట్‌లో వివేక్ బెర్త్ ఖరారవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

వరుస పరాజయాలు ఎదురైనా లెక్క చేయకుండా దాదాపు రెండు దశాబ్దాల పాటు అడ్లూరి లక్ష్మణ్ పోరు సాగించారు. ఆ పోరాట ఫలితంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటిసారే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి వరించింది. కాంగ్రెస్ పార్టీ సైనికుడిగా విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ సహా జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా వివిధ పదవులు చేపట్టారు. సామాజిక సమీకరణాల కసరత్తులో భాగంగా అడ్లూరికి మంత్రి పదవికి దక్కడంతో అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అడ్లూరి 1968లో జన్మించారు. ఆ కాలంలోనే ఐటీఐతో పాటు ఇంటర్ పూర్తి చేశారు. విద్యాభ్యాసం నుంచే పాలిటిక్స్ మీద ఆసక్తి ఉన్న అడ్లూరి, ఎన్ఎస్‌యూఐతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1982 నుంచి 1985 వరకు గోదావరిఖని జూనియర్ కళాశాల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పని చేశారు.

1986 నుంచి 1994 వరకు కరీంనగర్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1996 నుంచి 2001 వరకు ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2004లో నందిమేడారం నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. 2006లో ధర్మారం ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన ధర్మపురి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినా, విజయం వరించలేదు. అయితే 2010 నుంచి 2012 వరకు కరీంనగర్ జడ్పీ ఛైర్మన్‌గా పని చేశారు. 2010లో మరోసారి ధర్మపురి నియోజకవర్గానికి ఉప ఎన్నికలు రాగా, మళ్లీ అదృష్టాన్ని పరీక్షించుకున్నప్పటికీ నిరాశే ఎదురైంది. 2013 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014, 2018లో ధర్మపురి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. 2018 నుంచి జగిత్యాల జిల్లా పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీకి సేవలందిస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 22 వేల ఓట్ల మెజారిటీతో గెలిచి, తొలిసారిగా అసెంబ్లీకి వచ్చారు. 2023 డిసెంబర్ 15న అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను రాష్ట్రప్రభుత్వం విప్‌గా నియమించింది. ప్రస్తుతం సామాజిక సమీకరణాల నేపథ్యంలో మాదిగ సామాజికవర్గ కోటాలో ఆయనకు కేబినెట్ బెర్త్ ఖరారయ్యింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మూడో మంత్రి పదవి రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# సజావుగా తొలి రోజు తెలంగాణ ఐసెట్ పరీక్ష

### 90.98 శాతం హాజరు

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** ఎంబిఎ, ఎంసిఎ అడ్మిషన్ల కొరకు నిర్వహించే తెలంగాణ ఐసెట్-2025 తొలి రోజు రెండు విడతల పరీక్షను సజావుగా నిర్వహించారు. మొదటి విడత ప్రశ్న పత్రాల సెట్‌ను తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య బాలకృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ ఆచార్య ఇటికాల పురుషోత్తం, ఆచార్య మహమూద్, సెక్రటరీ ఆచార్య శ్రీరామ్ వెంకటేష్, టిజి ఐసెట్ ఛైర్మన్ ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కన్వీనర్ ఆచార్య అల్వాల రవిలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ఆచార్య బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనతి కాలంలోనే రాష్ట్ర స్థాయి కామన్ ఎంట్రన్స్‌లను నిర్వహించే శక్తి సామర్థ్యాలను ఎంజియు ప్రోది చేసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్న విధానం మిగతా విశ్వవిద్యాలయాలకు ఆదర్శప్రాయం అని అన్నారు. అభ్యర్థులకు, యాజమాన్యం రీత్యా అత్యంత సారదర్శకంగా, సులువుగా నిర్వహించేందుకు అధునాతన సాంకేతికతను ఉపయోగించడం హర్షించదగ్గ విషయం అన్నారు. మొత్తం మూడు విడతల్లో నిర్వహించ తలపెట్టిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలను ఉదయం 10.00 నుండి 12.30 వరకు 93 పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం రెండున్నర నుండి 5 గంటల వరకు 91 పరీక్ష కేంద్రాల్లో రెండు విడతలుగా నిర్వహించారు. మొదటి 24330 మంది అభ్యర్థులకు గాను 21897 (90శాతం ) అభ్యర్థులు హాజరుకాగా, మధ్యాహ్నం 24330 అభ్యర్థులకు గాను, 22136, (90.98శాతం) శాతం హాజరైనట్టు కన్వీనర్ ఆచార్య అల్వాల రవి తెలిపారు. రెండవ విడత పరీక్షల్లో దివ్యాంగ అభ్యర్థులు మరియు ఉర్దూ మీడియం అభ్యర్థులకు వారు కోరుకున్న ఐచ్ఛిక కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. మధ్యాహ్నం ప్రశ్నపత్రాల సెట్‌ను ఆచార్య ఇటికాల పురుషోత్తం, ఆచార్య వెంకటేష్ మరియు ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్, ఆచార్య అల్వాల రవి విడుదల చేశారు. తెలంగాణ ఉన్న విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య బాలకృష్ణారెడ్డి హైదరాబాదులోని వివిధ పరీక్షా కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. నిర్వాహకులతో పరీక్ష నిర్వహణ క్రమాన్ని సమీక్షి ంచారు. సెట్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లు వివిధ పరీక్షా కేంద్రాలను స్వయంగా సందర్శించి పరీక్షల నిర్వహణ సరళిని సమీక్షి ంచారు. ఎంజియూలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి ఆచార్య అలువాలా రవి 93 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ సరళిని సమీక్షి ంచి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డా.మిరియాల రమేష్, టిసిఎస్ సాంకేతిక నిపుణులు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# మేడిగడ్డలో గల్లంతైన ఆరుగురు బాలుర మృతదేహాలు లభ్యం

### ఆరు గంటల గాలింపు చర్యలతోనే వెలికితీత

**ప్రభాతవార్త, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజ్‌లో శనివారం ఆరుగురు బాలురు గల్లంతైన విషయం విధితమే. కాగా రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఎస్‌డిఆర్‌ఎఫ్ తెలంగాణ 5వ బెటాలియన్ చల్వాయి, ఎన్‌డిఆర్‌ఎఫ్, సింగరేణి రిస్క్యూ వారి నేతృత్వంలో 36మందితో ఆదివారం ఉదయం నుండే గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మొదటి బాడీ ఉదయం 7గంటలకు లభ్యం అయినట్లు అదేవిధంగా చివరి బాడీ మధ్యాహ్నం 12:55కి రికవరీ చేసినట్లు తెలిపారు. అంబట్‌పల్లికి చెందిన తొగరి రక్షిత్(13), స్థంభంపల్లి(పిపి) గ్రామానికి చెందిన పసుల రాహుల్(19), అంబట్‌పల్లికి చెందిన కర్ణాల సాగర్(17), పట్టి మధుసూదన్(20), కొర్లకుంటకు చెందిన బెల్లంకొండ రాంచరణ్ అలియాస్ పండు(18), అంబట్‌పల్లికి చెందిన పట్టి శివ మనోజ్(16)ల మృతదేహాలు లభ్యం కాగా గుర్తించి వెలికి తీసినట్లు తెలిపారు. సుమారు ఆరు గంటల పాటు సుదీర్ఘ గాలింపు చర్యలు చేపడితేనే ఆరుగురు బాలుర మృతదేహాలను వెలికితీసినట్లు వారు వెల్లడించారు. కాగా గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, కాటారం డిఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి, మహదేవపూర్, కాటారం సిఐలు రాంచందర్ రావు, నాగార్జునరావుతో పాటు స్థానిక ఎస్సై కె.పవన్‌కుమార్ మరియు ఇతర అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడూ సలహాలు, సూచనలు చేశారు. తద్వారా 36మంది సహాయక చర్యల్లో గాలింపులో భాగంగా గల్లంతైన ఆరు గురు బాలుర మృతదేహాలను వెలికితీసి అప్పగించారు.బాలుర మృత దేహాలను పోస్ట్‌మార్టంనిమిత్తం మహదేవపూర్ సామాజికఆసుపత్రికి తరలించారు.

# బీహార్ ఫస్ట్.. బీహారీ ఫస్ట్!

### బీహార్ అన్ని నియోజకవర్గాల్లో ఎల్జేపి పోటీ

### ఇదే మా ఎన్నికల నినాదం: పార్టీ అధినేత చిరాగ్‌పాశ్వాన్

**పాట్నా, జూన్ 8:** బీహార్‌లో త్వరలో జరిగే అసెంబ్లీఎన్నికల్లో లోక్‌జనశక్తిపార్టీ పోటీచేస్తుందని, తానుసైతం ఎన్నికల్లో పోటీచేస్తానని ఎల్జేపీ పాశ్వాన్ పార్టీ అధినేత చిరాగ్‌పాశ్వాన్ ఆదివారం ప్రకటించారు. ఏనియోజకవర్గంనుంచి పోటీ చేయాలన్నది తాను చెప్పబోనని, బీహార్‌ప్రజలే నిర్ణయిస్తారని ఆయనఅన్నారు. బోజ్‌పూరక్ జిల్లాలోజరిగిన నవ సంకల్ప్‌సభలో మాట్లాడిన చిరాగ్ తాను ఎన్నికల్లో పోటీచేస్తానని, 243స్థానాల్లోకూడా తన పార్టీ అభ్యర్థులు పోటీచేస్తారని, బీహార్‌ప్రజలే తాను ఏస్థానంనుంచి




పోటీచేయాలన్నదినిర్ణయిస్తారన్నారు. తన తండ్రి కన్నుమూసిన తర్వాత నా సొంత వాళ్లు తన ఇంటినుంచే తనను గెంటివేసారని ఇపుడు బీహార్‌ప్రజలే నా కుటుంబం అని ఆయన అన్నారు. ఆరానుంచే ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తన తండ్రి నిరంతరం బీహార్‌ఫస్ట్ నినాదంతో కొనసాగారని తానుసైతం అదే నినాదంతో ముందుకువెళతానన్నారు. బీహార్ ఫస్ట్, బీహారీ ఫస్ట్ నినాదం మా మేనిఫెస్టోగా ఉంటుందని ఆయన అన్నారు. అభివృద్ధిచెందిన రాష్ట్రంగా బీహార్ మారేంతవరకూ తాను నిద్రపోనన్నారు. ఆర్జేడి 15 ఏళ్ల పాలనలో ఆటవిక రాజ్యం కొనసాగిందని, కాంగ్రెస్ పదేళ్లపాలనలో కూడా అదేస్థితి కొనసాగిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఆర్జేడి హయాంలోకూడా అనేక అరాచకాలు రాష్ట్రంలో జరిగాయన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వ హయాంలో బీహార్ అద్వితీయ ప్రగతిని సాధించిందన్నారు. తాను ముఖ్యమంత్రి పదవికోసం పాకులాడటంలేదని, అన్‌రిజర్వు స్థానం నుంచి పోటీచేయాలన్న తన ఆసక్తి సీఎం అయ్యేందుకు కానేకాదన్నారు. సిఎంపోస్టుకు ప్రస్తుతం ఖాళీలు లేవన్నారు. ఎక్కువకాలం కేంద్రరాజకీయాల్లో కొనసాగాలని తాను అనుకోడం లేదని, తాను రాజకీయాల్లోకి వచ్చిందే బీహార్ కోసం, బీహార్ ప్రజల కోసమని అన్నారు. బీహార్ ఫస్ట్, బిహారీఫస్ట్ అనే విజన్‌తో ముందుకు వెళతానని ఆయన నొక్కిచెప్పారు

# డ్యాన్స్ విషయంలో గొడవపడి పెళ్లికొడుకును కొట్టిచంపేశారు..!

**లక్నో, జూన్ 8:** తాగిన మైకంలో కొంతమంది యువకులు దారుణానికి ఒడిగట్టారు. కొత్త పెళ్లికొడుకును కొట్టి చంపేశారు. ఈ సంఘటన ఉత్తరప్రదేశ్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్, సెవ్‌రాయ్ తెహసిల్ ఏరియాలోని త్రిలోక్‌పూర్ గ్రామానికి చెందిన రాకేశ్‌కుమార్ అనే యువకుడికి జగదీశ్‌పూర్ గ్రామానికి చెందిన యువతితో బుధవారం పెళ్లయింది. గురువారం పెళ్లికూతురు ఇంటి దగ్గర రిసెప్షన్ ఏర్పాటు చేశారు. పెళ్లికొడుకు బంధువులు అందరూ గురువారం సాయంత్రం పెళ్లికూతురు ఇంటికి చేరుకున్నారు.పెళ్లికొడుకు తరఫు వాళ్లను స్వాగతించటం కోసం పెళ్లికూతురు వాళ్లు డిజె ఏర్పాటు చేశారు. పెళ్లికొడుకు తరఫు వాళ్లు అక్కడికి వచ్చే సమయానికి కొంతమంది యువకులు డిజెకు డ్యాన్స్ చేస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలోనే పెళ్లికొడుకు బంధువులకు, ఆ యువకులకు మధ్య గొడవ మొదలైంది. ఆ గొడవ చినికిచినికి గాలివానలా మారింది. గొడవను ఆపడానికి పెళ్లి కొడుకు తండ్రి వెళ్లాడు. తాగిన మైకంలో ఉన్న ఆ యువకులు ఆయనపై కర్రలతో దాడి చేయడం మొదలెట్టారు. తండ్రిని కొట్టడం చూసిన పెళ్లికొడుకు వెంటనే అక్కడికి పరిగెత్తాడు.ఆ యువకులు పెళ్లికొడుకుపై కూడా దాడి చేశారు. తీవ్రంగా గాయపరిచారు. అంతటితో ఆగకుండా ఓ యువకుడు తుపాకితో పెళ్లికొడుకు తలపై గట్టిగా కొట్టాడు. తీవ్రగాయాలపాలైన పెళ్లికొడుకు స్పృహతప్పిపడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి అతడు చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకుఇ విచారిస్తున్నారు.

# ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్లతో తెలంగాణ పోలీసులు అప్రమత్తం

### మరణించిన, తప్పించుకున్న నక్సల్స్ వివరాలు సేకరిస్తున్న నిఘా వర్గాలు



**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేతకు కేంద్రంతో పాటు రాష్ట్ర పోలీసు విభాగం చేపట్టిన భారీ ఆపరేషన్ దరిమిలా తెలంగాణ పోలీసు శాఖ అప్రమత్తమయింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కర్రిగుట్టలో నక్సల్స్ ఏరివేత తరువాత నేషనల్ పార్క్‌లో కొనసాగుతున్న కూంబింగ్‌లో వారంరోజులుగా నిత్యం ఎన్‌కౌంటర్లు జరుగుతుండడం, మావోయిస్టు అగ్రనేతలు మరణిస్తుండడంతో తెలంగాణ నిఘా విభాగం అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తోంది. ఎన్‌కౌంటర్లలో మరణించిన వారితోపాటు తప్పించుకున్న నక్సల్స్‌కు సంబంధించిన వివరాలను నిఘా వర్గాలు సేక రిస్తూ సరిహద్దు జిల్లాల పోలీసు యంత్రాంగాలను అప్రమత్తం చేయసాగాయి. నిఘా వర్గాల వద్ద వున్న సమా చారం ప్రకారం ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, నేషనల్ పార్క్‌లో 20 నుంచి 25 మంది మావోయిస్టులు వుండి ఉంటా రని తెలి సింది. ఇందులో కొందరు లొంగుబాటు కోసం ప్రయత్నిస్తున్నారని నిఘా వర్గాలకు సమాచారం వుంది.

వచ్చే యేడాది మార్చి నాటి మా వోయిస్టు రహిత భారత్ చేస్తామని కేంద్రం ప్రకటించి ఆ దిశగా ఆపరేషన్ కగార్ కొనసా గిస్తుండడం తెలిసిందే. ఆపరేషన్ కగార్‌లో మావో యిస్టులకు మే 21న అతిపెద్ద దెబ్బ తగిలింది, ఆ పార్టీ చీఫ్ నంబాల కేశవరావు మరణించడం మావోయిస్టు పార్టీకి తీరని లోటుగా చెప్పాలి. దీని తరువాత తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు పార్టీని బలోపేతం చేయడంలో కీలక భూమిక వహించిన మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్ కూడా ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. దీంతో పాటు పలువురు కేంద్ర కమిటీ నాయకులు, రాష్ట్ర స్థాయి నాయకులు ఎదురుకాల్పుల్లో మరణించడం మావోయిస్టు పార్టీని బాగా కుంగదీసింది. ఈ తరుణంలోనే పోలీసులు ఎక్కడికక్కడ బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని దట్టమైన అడవుల్లో దూసుకుపోతున్నారు. భద్రతా బలగాలకు హెలికాప్టర్ల ద్వారా ఆహారంతో పాటు వైద్యసహాయం అందుతుండగా నక్సలైట్లు వనరుల లేమితో పాటు అనారోగ్య సమస్యల కారణంగా ఎదురు దెబ్బలు తింటున్నారు.

మావోయిస్టు అగ్రనేతలు నిజంగానే నేషనల్ పార్క్‌లో వున్నారా? లేదా ముందుగానే మేల్కొని సమీపంలోని గిరిజన గ్రామాల లో వెళ్లి అక్కడి జనంతో కలిసిపోయారా? అనేది భద్రతా బలగాలకు ఎదురవుతున్న ప్రశ్న. ఆపరేషన్ కగార్‌లో భాగంగా నేషనల్ పార్క్‌ను చుట్టుముట్టిన భద్రతా బలగాలు మావోయిస్టు అగ్రనేత పార్టీ మాజీ అధిపతి ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి కోసం గాలింపు చేస్తూనే ఉన్నాయి. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు. ఆయన తరువాత తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, ఊరఫ్ సంజీవ్ కూడా వున్నారు. వీరితో పాటు హిడ్మా, మిషిర్ బెస్రా, కంది సత్యనారాయణ అలియాస్ కోసా, పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చందన్న, మోడెం బాలకృష్ణ అలియాస్ బాలన్న, గణేష్ ఉయకే అలియాస్ రాజేష్, అనల్ అలియాస్ తు ఫాన్, గజరాల రవి అలియాస్ ఉదయ్, సవ్యసాచి గోస్వామి అలియాస్ అజయ్, రాజ్‌చంద్రా రెడ్డి అలియాస్ కట్టా రామచంద్ర, సుజాత అలియాస్ కల్పన తది తరుల కోసం కూడా భద్రతా బలగాలు నేషన ల్ పార్క్‌ను జల్లెడ పడుతున్నాయి. ముఖ్యమైన నక్సలైట్ల ఫొటోలతో పాటు వివరాలు ఛత్తీస్‌గఢ్ పోలీసుల వద్ద లేక పోవడంతో వారు తెలంగాణ నిఘా వర్గాలు అందించిన సమాచారం ఆధారంగా ముందుకు వెళుతున్నారు. మొత్తం మీద గడచిన 17 నెలల్లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎదురు కాల్పుల్లో 400 మందికిపైగా నక్సలైట్లు మరణించగా 900 మంది లొంగిపోయారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ ఏరివేతలో భద్రతా బలగాలు గ్రామ రక్షణ కమిటీలు, అటవీ సహకార సంస్థల సభ్యులు సహకరించారని బస్తర్ రేంజి ఐజి సుందర్ రాజ్ మీడియాకు చెప్పారు. దీంతో పాటు టెక్నాలజీని వాడి ఫలితాలను రాబట్టామని ఆయన తెలిపారు.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E PROCUREMENT TENDER NOTICE**

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 1 | 34/MAU61/736/ 2025-LEG-MAU61, Dt: 06/06/2025 | Request for Qualification for Empanelment of Legal Firms for APCRDA for a contract period of two years. |
| 2 | 40/MAU61-EE0ED (OTH)/5/2025-DP, Dt:06/06/2025 | **Expression of Interest** from Reputed Firms involved in Co-working Industry including developers, operators, investors, and technology partners. |
| 3 | 41/MAU61-EE0ED (OTH)/4/2025-DP, Dt:06/06/2025 | **Expression of Interest** from Reputed Firms involved in Media-related activities such as Film and TV production companies, Digital Media Innovators, Academic Institutions for Media for establishing their business in Amaravati Capital City, Andhra Pradesh. |
| 4 | 42/MAU61-EE0ED (OTH)/4/2025-DP, Dt:06/06/2025 | **Expression of Interest** from Reputed Firms involved in Health-related activities such as Integrated Healthcare Providers, Medical Colleges, Biotech Companies, and Wellness Centers etc. for establishing their business in Amaravati Capital City, Andhra Pradesh. |

The bid can be downloaded on AP e-procurement portal from **09.06.2025 to 24.06.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **24.06.2025 up to 15.00 Hrs**, Technical bid opening **24.06.2025 @ 16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

వార్త

గొప్పవారి గొప్పతనం వారు తమకంటే తక్కువ వారితో వ్యవహరించే తీరును బట్టి ఉంటుంది.

న-కార్లయల్

# ఎవరిదీ పాపం?

భారతావనికి తొక్కిసలాటలు, తోపులాటలు, రద్దీలలో అపశ్రుతులు కొత్తేమీ కాదు. అవన్నీ సకల సాకల్యంగా జరిగే విషయాలూ కాదు. ఎక్కడిదక్కడే, ఎప్పటిదప్పుడే అన్నట్లు దులపరించుకుపోవడమే దీనికంతకూ కారణం. ప్రమాదాలు వాటి పర్యవసానాలపై అధ్యయనం చేస్తే కొంతలో కొంత వాటిని నివారించగలమేమో! కానీ ఎవరూ అంత హోమ్ వర్క్ చేయడానికి ముందుకు రాకపోవడం వల్లనే మరో ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్నట్లయింది. అక్కడ ముందు ప్రణాళికలు లేకనో సరైన భద్రతా ఏర్పాట్లు చేసుకోలేకపోవడం వల్లనో చివరికి మానవ తప్పిదాలుగా తేల్చేస్తున్నాము. ఒక విషాదాంతం మరో విషాదానికి తెర తీయకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నాం. తాజాగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్సీబీ జట్టు విజయోత్సవ వేడుకల సందర్భంగా అపశ్రుతి చోటు చేసుకుంది. ఆ రోజున స్టేడియంలో ఏం జరిగింది? పర్యవసానం ఏమిటి? బలైంది ఎవరు, బాధ్యులు ఎవరు? అన్న ప్రశ్నలు జనాన్ని ముఖ్యంగా క్రీడాభిమానుల్ని వేధిస్తున్నాయి. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం తొలిసారి ఐపిఎల్ టైటిల్ నెగ్గిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు విజయోత్సవాలకు నిర్వహిస్తున్న బెంగుళూరు చిన్నస్వామి స్టేడియంలో అసంఖ్యాక క్రీడాభిమానులతో కిక్కిరిసిపోయింది. పరిస్థితి అదుపు తప్పి జరిగిన భారీ తొక్కిసలాటలో 11 మంది మృతి చెందారు. 56 మందికి పైగా గాయపడ్డారు. అదే సమయంలో వర్షం కురవడంతో తొక్కిసలాట మొదలై పలువురు మృత్యువాత పడినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల కాలంలో దక్షిణాదిన జరిగిన పెద్ద విషాదాంతాల్లో ఒకటి. సన్నాహాలకు కనీస సమయం లేకుండా ఆదరా బాదరాగా నిర్వాహకులు సోషల్ మీడియాలో పోస్ట్‌చేసి పిలిచినా అత్యుత్సాహంతో కేవలం 35 వేల మంది పట్టే సామర్థ్యమే ఉండగా రెండున్నర లక్షల మంది చిన్న స్వామి స్టేడియంకు చేరుకున్నారు. ఇక్కడ వ్యవధి లేకుండా చిన్న పిలుపుకే ఇంతమంది వచ్చారంటే, మరింత విస్తృత ప్రచారంతో పిలిస్తే ఇంకెంత మంది వచ్చేవారో. ఎప్పుడైనా ఇదే సమస్య వచ్చేది. గెలుపుతో వచ్చే ఆనందోత్సవాలు అటువంటివి. ఎప్పుడైనా వెల్లువలా వచ్చే జనాన్ని అదుపు చేయడం కష్టమే మరి. ఇందులో పావులయ్యేది పోలీస్ యంత్రాంగమే. ఇలాంటప్పుడు బాధ్యులను గుర్తించే విషయంలో సంయమనము అవసరమే. సాధారణ దృష్టితో పలు అంశాలను పరిశీలనలోకి తీసుకోవాలి. ఇవన్నీ మామూలే అని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పెదవి విరచడం హర్షించలేం. కుంభమేళా తొక్కిసలాట ప్రస్తావన తీసుకొచ్చారు. భద్రత ఏర్పాట్ల కోసం 1000 సిబ్బంది ఉన్నారే తప్ప ఎంతమంది ఈ వేడుకలకు వస్తారనే అంచనా కానీ, ఎంతమంది భద్రతా సిబ్బంది అవసరమోతారు? అన్న అంశాలపై ప్రభుత్వం వద్ద ప్రణాళిక ఏమీ ఉన్నట్లు లేదు. ఈ సత్కార సభలో నిర్వహణలో కొన్ని లోపాలు ఉన్నాయని అందులో నుండి గుణపాఠాలు నేర్చుకోవాలని బిసిసి కార్యదర్శి దేవజిత్ సైకియా అభిప్రాయపడ్డారు. ఎవరైతే క్రీడా సక్తితో ఉత్సవాలకు వచ్చారో వారే ఈ విషాదంలో బలయ్యారు. మృతులందరిలో 13 నుంచి 34 ఏళ్ళు వారు ఉన్నారు. అందరూ యువకులే వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. ఆర్సీబీ యాజమాన్యంతో పాటు ఈవెంట్ మేనేజ్మెంట్ కంపెనీ డీఎన్ఏ ఎంటర్టైన్మెంట్స్, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌లపై ప్రభుత్వం కేసు నమోదు చేసింది. దీని విషయంలో హైకోర్టు కూడా జోక్యం చేసుకుంది. తొక్కిసలాట ఘటనపై సుమోటో కేసు నమోదు చేయాలని బెంగళూరు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తాజాగా బెంగళూరు పోలీస్ కమిషనర్ తదితర పోలీసు అధికారులను సస్పెండ్ చేసిన మరుసటి రోజునే ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి బదలీ చేసింది. బాధ్యులను నిర్ణయించడంలో ప్రభుత్వం చాకచక్యంగా నిర్ణయించక పోవడం ఇందులో చెప్పుకోవాలి. పోలీస్ కమిషనర్ బి.దయానంద అనుమతి నిరాకరించారు. కాగా రెండు ప్రదేశాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి గోవిందరాజ్ కమిషనర్‌పై ఒత్తిడి తేవడం ఇందులో విశేషంగా చెప్పుకోవాల్సిన విషయం. ఇలాంటి రాజకీయ ఒత్తిడి వలన కూడా అధికారులు ఆలోచించలేని పరిస్థితి ఉందని అర్థం చేసుకోవచ్చు. ఇంటెలిజెన్స్ చీఫ్ హేమంత్ నింబాల్కర్, మరి కొందరు పోలీస్ అధికారులపై కూడా బదలీ వేటు పడింది. నలుగురిని అరెస్ట్ చేసారు. ఎవరికి వారే తమకేమీ బాధ్యత లేదంటున్నారు. ఇక్కడ బాధ్యులను గుర్తించడమే పెద్ద సమస్య. బాధ్యులెవరో నిర్ణయించే క్రమంలో పాటించాల్సిన పరిమితులను, బాధ్యులను కేంద్రమే నిర్ణయించాలి. లేకుంటే అమాయకులు బలి అవుతారు. ఈ ప్రమాదానికి కర్ణాటక ప్రభుత్వం వైఫల్యమే కారణమంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీ రైల్వేస్టేషన్లో, కుంభమేళాలో, బెంగళూరులో తొక్కిసలాట.. ఈ ఘటనలో డజన్ల కొద్దీ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కానీ, ఇంతవరకూ ఎవరూ బాధ్యత తీసుకోలేదు. రాజీనామాలు చేయలేదు. పాఠాలు నేర్చుకోలేదు. అభిమాన పారవశ్యంలో తన్మయులైన జనం తండోపతండాలుగా రావడం అంచనాలకు మించి వస్తున్న జన సమూహాలను అదుపు చేయలేక నోరు వెళ్ళబెట్టే పాలకమన్యులున్నంత వరకు తొక్కిసలాటల పర్యవసానం విషాద గీతమే! ●

గత చరిత్రను స్మరించడం అంటే ప్రస్తుతపు చరిత్రను మరువకుండా ఉండటానికే.



అంబేద్కర్

జాతీయ ప్రగతి అంటే వ్యక్తుల శ్రమ, శక్తి, నిజాయితీ. జాతీయ పతనం అంటే వ్యక్తుల సోమరితనం, స్వార్థం, దుర్గుణం.



జార్జి బెర్నార్డ్ షా

# లడక్ డిమాండ్లను కేంద్రం పరిష్కరించాలి

**లడక్ వాసులు నిరంతరం చేస్తున్న ఉద్యమాల వల్ల కేంద్రప్రభుత్వం 2023లో హైపవర్ కమిటీని నిత్యానంద్‌రాయి నాయకత్వంలో (మినిష్టర్ ఆఫ్ స్టేట్) డిమాండ్ల పరిష్కారం కోసం నియమించింది కూడా. లడక్ ప్రజల డిమాండ్లను సానుకూల ధోరణిలో పరిష్కరించాల్సిన అవసరం ప్రస్తుతం భారత దేశానికి ఉన్నదని చెప్పక తప్పదు. స్ట్రాటజిక్‌గా లడక్ భారత సరిహద్దు దేశాల మధ్య ఉన్నది. చైనా ఇప్పటికే లడక్‌లోని కొంతభాగం మీద కన్నేసి కలుపుకోటానికి వేచి ఉందని అంతర్జాతీయ నిపుణులు భారత్‌ను హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్ విషయంలో భారత్ ప్రధాన మంత్రి మోడీ వ్యక్తపర్చిన దృఢవైఖరి గమనంలో తీసుకున్నప్పుడు లడక్ ప్రత్యేకతను భౌగోళికంగా గర్తించటమే కాకుండా అక్కడి ప్రజల మనోభావాలకు అనుగుణంగా సరైన నిర్ణయాలు సత్వరం తీసుకోవాలి. లడక్‌ను యూనియన్ టెరిటరీగా ప్రకటించటం ఒక్కటే సరిపోదు. లడక్ వాసులు మానసికంగా, భౌగోళికంగా భారత్ పౌరులుగా కలిసి మెలిసి మనగల్గుతేనే మరో అద్భుత సీమ మనదీ అని గర్వంగా చెప్పుకోగలం.**



రావులపాటి సీతారాంరావు

భారతేశంలో భూభాగమైన లడక్, పాకిస్థాన్, చైనా సరిహద్దులలో కీలకమైన జంక్షన్‌గా ఉన్నది లడక్ జనాభా 2.74 లక్షలు (2011సెన్సస్ ప్రకారం). అయితే లడక్ వాసులు చాలా సమస్యలు కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కారం కోరుతున్నారు. భాష, సంస్కృతి, భూభాగం మనదేశ ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే భిన్నంగా ఉండటం చేత కొన్ని ప్రత్యేక వెసులుబాట్లు లడక్ ప్రజలు ముఖ్యంగా 2019 సంవత్సరం నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్లు ఆర్టికల్ 370 ప్రకారం స్పెషల్ స్టేటస్ జమ్మూకాశ్మీర్‌కు తొలిగించి యూనియన్ టెరిటరీస్‌గా భావించబడిన తర్వాత బాగా వెలుగులోకి వస్తున్నాయి. మొదట్లో లడక్, ఇండియన్ యూనియన్‌లో కలిసిన తర్వాత జమ్మూకాశ్మీర్‌లో ఒక భాగంగా పరిపాలించబడింది. 1979లో లడక్ జిల్లా రెండుగా విభజింపబడి (లేహ్, కార్గిల్‌గా)న తర్వాత చాలా సంవత్సరాలకు అంటే 2019లో ఈ రెండు జిల్లాలను బేస్‌చేసుకొని లడక్ యూనియన్ టెరిటరీగా ఏర్పడిందన్న విషయం చాలా మందికి తెలిసి ఉన్నా లడక్ ప్రస్తావన వచ్చింది కాబట్టి ఈ విషయం మళ్లీ జ్ఞప్తి చేయటంలో తప్పులేదు. జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్ట నిబంధనల ప్రకారం లడక్ శాసన సభ లేదా ఎన్నికైన ప్రభుత్వం లేకుండా కేంద్రపాలిత ప్రాంతంగా నిర్వహించబడుతున్నది. భారత రాష్ట్రపతి నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్, ప్రభుత్వ అధిపతిగా ఉంటారు. ఆయనకు భారత పాలనా సేవకు చెందిన పౌరసేవకులు సహాయం చేస్తారు. లడక్ వ్యూహాత్మకంగా ముఖ్యమైనది కాబట్టి భారత సైన్యం ఈ ప్రాంతంలో బలమైన ఉనికిని కొనసాగిస్తున్నది. భారత్ ప్రభుత్వ కొత్త రిజర్వేషన్ పాలసీ ప్రకారం లడక్ భాష డొమసైల్, హిల్ కౌన్సిల్స్ ఏర్పాటు కంపోజిషన్ యూనియన్ టెరిటరీలో 85 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాంతం వారికే చెందుతాయి. నిబంధనలు ఏర్పరిచినప్పుడు నార్త్ ఈస్ట్‌లోని రాష్ట్రాలకు మరింత క్లారిటీ రిజర్వేషన్ నియామకాల్లో రావచ్చు అని అనుకుంటున్నారు. మిజోరాంలో 92 శాతం, అరుణచల్ ప్రదేశ్‌లో 80 శాతం



జాబ్ రిజర్వేషన్లు ఉన్నాయి. అయితే కొన్ని విషయాలలో లడక్ ప్రజలకు అసంతృప్తి ఉన్న మాట వాస్తవం. లడక్‌లో డొమసైల్‌గా పరిగణించబడటానికి ఒక పౌరుడు 15 సంవత్సరాలు గాప్ లేకుండా 2019 నుండి అక్కడ ఉండాలి. 2019లో లడక్ స్పెషల్ స్టేటస్ కోల్పోయిన తర్వాత డొమసైల్‌గా ఈ నిబంధన ప్రకారం 2034లోనే పరిగణించబడుతాడు. జమ్మూ, కాశ్మీర్ విషయంలో మాత్రం 15 సంవత్సరాలు రిజిష్టర్డ్ మైగ్రెంట్‌గా వుంటే డొమసైల్ అర్హత ఉన్నట్లుగానే పరిగణించటం జరుగుతుంది. ఈ భేదం లడక్ వాసులకు ఇబ్బందిగా మారుతున్నది. హిల్ కౌన్సిల్స్‌లో మహిళలకు 1/3 సీట్లు రిజర్వేషన్ నియమానుసారం పొందుతారు. ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, భోటి, పుర్గీ, అఫిషియల్ భాషలుగా ఉన్నాయి. లడక్‌వాసులకు ఈ నిబంధనలు సంతృప్తి కలిగించడం లేదు. వాళ్ల డిమాండ్లు పూర్తిగా నెరవేరటం లేదని వారి వాదనగా ఉంది. లడక్ సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్లు కొన్ని డిమాండ్లతో ముందుకు వస్తున్నాయి. పూర్తి రాష్ట్ర హోదాతోపాటు రాజ్యాంగం ఆరవ షెడ్యూల్డ్‌లో కలపటం (దానివల్ల ప్రత్యేక రక్షణ ఇతర రాష్ట్రా లలోని గిరిజన వాసులకు లభ్యపడుతుంది) మరొక లోక్‌సభసీట్‌తో పాటు ప్రత్యేక పబ్లిక్‌సర్వీసు కమిషన్ లడక్‌కుకోరుతున్నారు. ముందే చెప్పినట్లు 2.74 లక్షల జనాభా ఉన్న లడక్‌వాసుల ప్రత్యేక గుర్తింపు వారి సంస్కృతికి, ఉద్యోగాల కల్పన కోసం రాజ్యాంగ రక్షణ ప్రత్యేకంగా ఈ అయిదు సంవత్సరాల నుంచి ప్రొటెస్టులు కొనసాగిస్తూ డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ ప్రత్యేకంగా పార్లమెంటరీ ప్యానెల్‌కు లడక్‌లో ఉన్న 1,275 గెజెటెడ్ ఉద్యోగాలను ఈ సంవత్సరంనే కాదు 2019లో కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పడినప్పుడు నుంచి భర్తీ చేయలేదనితెల్పటం విశేషం. లడక్ వాసులు నిరంతరం చేస్తున్న ఉద్యమాల వల్ల కేంద్రప్రభుత్వం 2023లో హైపవర్ కమిటీని నిత్యానంద్‌రాయి నాయకత్వంలో (మినిష్టర్ ఆఫ్ స్టేట్) డిమాండ్ల పరిష్కారం కోసం నియమించింది కూడా. లడక్ ప్రజల డిమాండ్లను సానుకూల ధోరణిలో పరిష్కరించాల్సిన అవసరం ప్రస్తుతం భారత దేశానికి ఉన్నదని చెప్పక తప్పదు. స్ట్రాటజిక్‌గా లడక్ భారత సరిహద్దు దేశాల మధ్య ఉన్నది. చైనా ఇప్పటికే లడక్‌లోని కొంతభాగం మీద కన్నేసి కలుపుకోటానికి వేచి ఉందని అంతర్జాతీయ నిపుణులు భారత్‌ను హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్ విషయంలో భారత్ ప్రధాన మంత్రి మోడీ వ్యక్తపర్చిన దృఢవైఖరి గమనంలో తీసుకున్నప్పుడు లడక్ ప్రత్యేకతను భౌగోళికంగా గర్తించటమే కాకుండా అక్కడి ప్రజల మనోభావాలకు అనుగుణంగా సరైన నిర్ణయాలు సత్వరం తీసుకోవాలి. లడక్‌ను యూనియన్ టెరిటరీగా ప్రకటించటం ఒక్కటే సరిపోదు. లడక్ వాసులు మానసికంగా, భౌగోళికంగా భారత్ పౌరులుగా కలిసి మెలిసి మనగల్గుతేనే మరో అద్భుత సీమ మనదీ అని గర్వంగా చెప్పుకోగలం. ●

# కుమ్ములాటలతో కుదేలవుతున్న పార్టీలు


భాస్కర్ యలకంటి

తెలంగాణ రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు అసమ్మతి స్వరాలతో, అసంతృప్తి జ్వాలలతో, అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్నాయి. ఉద్యమ పార్టీగా ప్రత్యేకతను సంతరించుకుని సుమారు పది సంవత్సరాలు అధికారాన్ని చెలాయించిన బిఆర్ఎస్, ప్రస్తుతం తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో గత పది సంవత్సరాలుగా అధికార పీఠాన్ని కైవసం చేసుకుని తిరిగి ఎర్రకోటపై కాషాయ జెండానెగరేసి మూడోసారి ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకున్న బిజెపిలు తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు అంతర్గత కుమ్ములాటలతో అతలాకుతలమవుతున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం కాస్త ఎక్కువేనని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీలో ఇలాంటివి సహజమే అయిననూ క్రమశిక్షణకు మారుపేరుగా భావించే బిజెపి, ఏకఛత్రాధిపత్యం కింద నడిచే ప్రాంతీయ పార్టీ అయిన బిఆర్ఎస్‌లో కూడా రాజకీయ రచ్చ కొనసాగుతుండడం విమర్శకులను సైతం విస్మయపరుస్తున్నది. ఢిల్లీ కేంద్రంగా రాజకీయాలు నడిచే ప్రధాన జాతీయ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్‌లలో ఆశావహుల సంఖ్య కాస్త ఎక్కువే కావడం వల్ల వారంతా రాజకీయ పదవుల కొరకు, అధికార పదవుల కొరకు తహతహలాడడం సహజంగానే కనపడుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ కేబినెట్ విస్తరణ అప్పుడు ఇప్పుడు అంటూ ఎప్పటికప్పుడు దాటవేత ధోరణిని ప్రదర్శిస్తున్నది. ఢిల్లీ చుట్టూ తిరిగినా, హైదరాబాదులో చర్చలు జరిపినా ఫలితాలు మాత్రం తేలడం లేదు. కేబినెట్ బెర్తు కేటాయించకపోతే తమ దారి తాము చూసుకుంటామని కొందరు ఎమ్మెల్యేలు బాహాటంగానే తమ సన్నిహితుల దగ్గర వాపోతుండడంతో పార్టీలో కలకలం రేపుతున్నది. ఇటీవల నియమించిన కమిటీల్లో సామాజిక కోణం బహిర్గతం అవుతున్నప్పటికీ సీనియర్ జూనియర్ అనే విభేదం మాత్రం అంతర్గతంగా అగ్గి రాజేస్తూనే ఉన్నది. మరోవైపు మహిళా కాంగ్రెస్ నేతలు గాంధీభవన్లో తమకు సరిపడా ప్రాధాన్యత లభించడం లేదని ఇటీవల ధర్నాకు దిగడం కూడా చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ బిజెపిలో నాయకత్వ లేమి స్పష్టంగా కనబడుతున్నప్పటికీ ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలలో తన సత్తా చాటడం ఆ పార్టీకి కాస్త ఊరటనిచ్చినప్పటికీ అంతర్గత కుమ్ములాటలతో అతలాకుతలమవుతున్నది. సాధారణంగా బిజెపిలో అంతర్గత విభేదాలు బహిర్గతం కావు. ఎన్ని విభేదాలు చోటు చేసుకున్నా, ఎంతటి వివాదం రాజుకున్నా భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ లోలోపలే పరిష్కారం జరుగుతుంది. కానీ అందుకు విరుద్ధంగా తెలంగాణ బిజెపిలో మాత్రం బాహాటంగానే విభేదాలు పొడచూపుతున్నాయి. పార్టీ ఎమ్మెల్యేలు ఎంపీలు గ్రూపులుగా విడిపోయి వ్యవహారాలు నడిపిస్తున్నారని చర్చ జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యేల మధ్య సఖ్యత కొరవడిందని, ఎంపీలలోనూ ఏ ఇద్దరు ఒకే వేదికను పంచుకునే పరిస్థితి లేదని పార్టీ వర్గాలే బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నాయి. ఇదిలా ఉండగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపిక విషయంలో ఇప్పటికే పెద్ద రచ్చ నడుస్తున్నది. దీంతో రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతలను ఎవరికి అప్పగించాలో అధిష్టానానికి తలనొప్పిగా మారిపోయింది. ఒక పక్క కేంద్ర మంత్రిగా మరోపక్క రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు ఇంకా కిషన్ రెడ్డియే నిర్వహించడం బట్టి ఆ పార్టీలో ఉన్న పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా పార్టీ జిల్లా అధ్యక్షుల ఎంపిక వ్యవహారంలో కూడా అసమ్మతి గళాలు ఇప్పటికీ వినపడుతూనే ఉన్నాయి. ఇక బిఆర్ఎస్ పార్టీలో కవిత వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆమె పలు ప్రశ్నలను సంధిస్తూ, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండడంతో పార్టీ శ్రేణులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. పార్టీ నాయకుడిని నేరుగా విమర్శించకుండా ఆ నాయకుడి చుట్టూ ఉన్న కోటరీపై లేఖ రూపంలో విమర్శనాస్త్రాలను సంధించడం పార్టీలో ముదురుతున్న ముసలానికి అద్దం పడుతున్నది. అటు బిఆర్ఎస్ పార్టీనే కాకుండా ఇటు రాష్ట్ర రాజకీయ వర్గాలను సైతం విస్మయానికి గురి చేస్తున్నది. వరంగల్‌లో పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కావడంతో ఊపు మీద ఉన్న బిఆర్ఎస్‌కు ఇది అశనిపాతంలా మారిందని రాజకీయ పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేయడమో లేక బిజెపితో పొత్తు కుదుర్చుకోవడమో జరుగుతుందని దాన్ని వ్యతిరేకిస్తున్నందుననే తనను బయటకు పంపించే ప్రయత్నం జరుగుతున్నదని కవిత చేస్తున్న వ్యాఖ్యలు అధినేత కేసీఆర్‌ను సైతం ఇరుకున పెడుతున్నాయి. ఇదిలా ఉండగా ఎన్నడూ లేని విధంగా హరీష్ ఇంటికి కేటీఆర్ వెళ్లడం రాజకీయ చర్చకు దారితీస్తున్నది. ఈ వారసత్వ రాజకీయాలు కింది కేడర్‌కు తలనొప్పిగా మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధికారం చేపట్టిన పార్టీలో ఆశావహుల సంఖ్య అధికంగా ఉండడం సహజం. దాన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ అధిష్టానం చాకచక్యంగా వ్యవహరించి, వారిని బుజ్జగించి వారి మధ్య సమన్వయ సహకారాన్ని నెలకొల్పాలి. అంతేగానీ రోట్లో నూకలు పోసి కుక్కలకు కొట్లాట పెట్టినట్టు చేయరాదు. అధిష్టానాన్ని ధిక్కరిస్తూ వ్యవహరిస్తే కొరడా ఝుళిపించి గాడిలో పెట్టాలి. ఇక బిజెపిలో రాజాసింగ్ వ్యవహారం రోజురోజుకు తలనొప్పిగా మారుతున్నది. బిఆర్ఎస్‌లో కవిత వ్యవహారం ఆ పార్టీల పెద్దలకు కొరకరాని కొయ్యగా తయారవుతున్నది. అధికారంలోకి వచ్చి సంవత్సరం ఆరు నెలలు కావస్తున్ననూ పాలన ఇంకాగాడిన పడినట్లు కనపడడం లేదు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు అరకొరగానే అమలుకు నోచుకుంటున్నాయి. దానికితోడు పార్టీలోని విభేదాలు పార్టీని మరింత ఇరకాటంలో నెట్టుతున్నది. ఇదిలా ఉండగా అధికార పార్టీని ఎండగట్టాల్సిన ప్రతిపక్ష పార్టీలైన బిజెపి, బిఆర్ఎస్‌లు అంతర్గత కుమ్ము లాటలతో పార్టీని చక్కదిద్దుకోవడానికే సమయం సరిపోతున్నది. ●

# ఒత్తిడి పెంచే చదువులకు స్వస్తి పలికేదెప్పుడు?

డి జె మోహన రావు

ఒకప్పుడు రాజస్థాన్‌లోని కోట నగరం మన దేశంలో ఎంతోమంది విద్యార్థులకు ఒక ఆశాకిరణం. కష్టపడి చదివి, పెద్ద పెద్ద ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో సీట్లు సంపాదించవచ్చనే ఒక నమ్మకాన్ని ఇచ్చేది. అందుకే లక్షలాది మంది యువత ఇక్కడికి పరుగులు తీశారు, దీంతో 'కోట' మన దేశానికి 'కోచింగ్ రాజధాని'గా మారిపోయింది. కానీ, ఈ వెలుగుల వెనుక ఒక చీకటి నిజం దాగి ఉంది. అదే విద్యార్థుల ఆత్మహత్యలు. అవును, చదువుల ఒత్తిడి తట్టుకోలేక ఎంతో మంది పిల్లలు తమ ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇది కోటా కీర్తికి ఒక మాయని మచ్చగా మారింది. ఒక్క 2023లోనే 26 మంది పిల్లలు చనిపోయారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2024లో 17 మంది, ఇక 2025 మే 23 నాటికే 14 మంది మరణించారన్న వార్తలు మన గుండెల్ని పిండేస్తున్నాయి. ఈ దారుణాలు చూసి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా కల్పించుకోవాల్సి వచ్చింది. ఇటీవలే, మే 23, 2025న, సుప్రీంకోర్టు రాజస్థాన్ ప్రభుత్వాన్ని నిలదీసింది. 'ఒక రాష్ట్రంగా మీరేంచేస్తున్నారు? ఈ పిల్లలు కోటాలోనే ఎందుకు చనిపోతున్నారు? మీకిది పట్టదా?' అంటూ తీవ్రంగా ప్రశ్నించింది. ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటున్నా, పిల్లల చావులు ఆగడం లేదని కోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. అంటే, ఎక్కడో మన వ్యవస్థలోనే లోపం ఉందని స్పష్టమవుతోంది కదా? పైపైన మెరుగులు కాకుండా, సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కరించాలని సుప్రీంకోర్టు చెప్పినట్టే ఉంది. అసలు కోటా ఎందుకంత ఫేమస్ అయింది? జేఈఈ (ఇంజనీరింగ్), నీట్ (మెడిసిన్) వంటి కష్టమైన పరీక్షలకు ఇక్కడ ఇచ్చే కోచింగే దానికి కారణం. ఇవి మామూలు బడులు కావు, కేవలం ఈ పరీక్షల్లో నెగ్గడానికే శిక్షణ ఇచ్చే కేంద్రాలు. 1980 90లలో కొందరు ముందుచూపున్నవాళ్లు ఈ కోచింగ్ మొదలుపెట్టారు. వి.కె. బన్సల్ అనే ఇంజనీర్ మొదట కొంతమందికి లెక్కలు చెప్పడం మొదలుపెట్టి, కోటా కోచింగ్ పరిశ్రమకు పునాది వేశారు. ఆయన దగ్గర చదివిన వాళ్లు ఐటీల్లో సీట్లు కొట్టడంతో, బన్సల్ క్లాసెస్ పెద్ద సక్సెస్ అయింది. దాన్ని చూసి ఎన్నో సంస్థలు పుట్టుకొచ్చాయి. ప్రశాంత వాతావరణం, తక్కువ ఖర్చు కూడా కోటాకు ప్లస్ అయ్యాయి. మరి, కోచింగ్ తీసుకుంటే సీటు గ్యారెంటీనా? ప్రతీ ఏటా టాప్ ర్యాంకర్లు కోటా నుంచే వస్తుంటారు. వాళ్ల ఫోటోలతో పెద్ద పెద్ద హోర్డింగులు మనల్ని ఊరిస్తుంటాయి. కానీ, నిజం చెప్పాలంటే, కోచింగ్‌లో చేరిన వాళ్లలో మహా అయితే 2నుంచి 5శాతం మందికే మంచి కాలేజీల్లో సీట్లు వస్తాయి. చాలామంది కలలు కల్లలవుతాయి. సంస్థలు కేవలం టాపర్లను చూపించి అందరినీ ఆకర్షిస్తాయి. ఈ 'కోటా కల' వెనుక పిల్లల మానసిక ఆరోగ్యం దారుణంగా దెబ్బతింటోంది. అధికారికంగా 250 కోచింగ్ సెంటర్లున్నా, లెక్కల్లోకి రానివి ఇంకా చాలా ఉన్నా



యి. పెద్ద సెంటర్లలో వసతులు బాగున్నా, హాస్టళ్లు, పీజీ (పేయింగ్ గెస్ట్)లు మాత్రం ఇరుకుగా, కనీస సౌకర్యాలు లేకుండా, ముఖ్యంగా మానసిక ఆరోగ్యసలహాలు ఇచ్చేవారు లేకుండా ఉంటున్నాయి. ఆటపాటలు, సొంత సమయం అన్నీ చదువుకే బలి. ఈ పిల్లలు పడే ఒత్తిడి అంతా ఇంతా కాదు. రోజుకు 12 నుంచి 18 గంటల చదువు, ప్రతీవారం పరీక్షలు, అందరి ముందు ర్యాంకుల ప్రకటన ఇవన్నీ నిరంతరం భయాన్ని, ఆందోళనను పెంచుతాయి. చాలామంది తల్లిదండ్రులు తమ జీవితకాల సంపాదనను పిల్లల చదువు కోసం పెడతారు. ఆ భారం పిల్లలపై పడుతుంది. దీనికి తోడు, ఇంజనీరింగ్, మెడిసిన్ చదివితేనే గొప్ప అనే సామాజిక ఒత్తిడి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంది. తెలివైన వాళ్లంతా ఒకేచోట చేరడం వల్ల పోటీ పెరిగి, పోలికలు మొదలవుతాయి. చాలామందికి అదే మొదటిసారి ఇల్లు వదిలి రావడం, దాంతో ఒంటరితనం, ఇంటి బెంగ వేధిస్తాయి. లాభాల కోసం నడిచే కోచింగ్ సెంటర్లు కూడా పిల్లల శక్తికి మించి వారిపై ఒత్తిడి తెస్తాయి. పరీక్షల్లో ఫెయిలైతే జీవితంలో ఫెయిలైనట్టే అనే భావన వారిని కుంగదీస్తుంది. పోలీసు రికార్డులు చూస్తే 2020లో 4 (కరోనా వల్ల తక్కువ), 2021లో 15, 2022లో 15, 2023లో ఏకంగా 26, 2024లో 17, ఇక 2025 మే 23 నాటికి 14 మంది పిల్లలు ప్రాణాలు తీసుకున్నారు. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఈ సంక్షోభం ఆగకపోగా, కొన్నిసార్లు పెరుగుతోందంటే వ్యవస్థలో లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అందని అంచనాలు, తీవ్రమైన ఆందోళన, ఒంటరితనం, మానసిక సమస్యల గురించి బయటకు చెప్పుకోలేనిపరిస్థితి, నిరంతర చదువుతో అలసట, ఒత్తిడిని తట్టుకునే నైపుణ్యాలు లేకపోవడం, సరైన మానసిక ఆరోగ్య సాయం అందకపోవడం ఇవన్నీ కారణాలే. కౌన్సెలర్లు ఉన్నా, విద్యార్థుల సంఖ్యకు సరిపోవడం లేదు. రాజస్థాన్ ప్రభుత్వం, కోచింగ్ సంస్థలు కొన్ని కొత్త రూల్స్ పెట్టాయి. వారానికో సెలవు, సెలవుల తర్వాత పరీక్షలు పెట్టకూడదు, పిల్లల్ని ర్యాంకుల బట్టి వేరుచేయొద్దు, మానసిక సలహాలు ఇవ్వాలి, ఫీజు వాపసు సులువుగా ఉండాలి అని. హాస్టళ్లలో స్ప్రింగ్‌ఫ్యాన్లు, బాల్కనీలకు వలలు కట్టారు. 'దర్వాజే పే దస్తక్', పోలీసుల 'కాళికా స్క్వాడ్', 'కలెక్టర్‌తో రాత్రి భోజనం' వంటి కార్యక్రమాలు పెట్టినా, ఇవన్నీ పైపైన పూతలేనని, అసలు సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఈ చర్యలు మంచివే అయినా, అసలు సమస్య అయిన తీవ్రమైన పోటీ, తల్లిదండ్రుల అవాస్తవిక అంచనాలు, కోచింగ్ సెంటర్ల వ్యాపార ధోరణి వంటివి మారడం లేదు. జేఈఈ, నీట్‌లకే అతి ప్రాధాన్యం తగ్గించి, ఇతర వృత్తివిద్య, నైపుణ్య కోర్సులను ప్రోత్సహించాలి. బట్టీ చదువు కాకుండా, ఆలోచించేలా, జీవిత నైపుణ్యాలు నేర్పేలా సిలబస్ ఉండాలి. తల్లిదండ్రులు, సమాజం పిల్లలపై అవాస్తవిక అంచనాలు తగ్గించుకోవాలి. మార్కులకంటే మానసిక ఆరోగ్యంముఖ్యం. మానసిక సాయం తీసుకోవడాన్ని ప్రోత్సహించాలి. ప్రతి కోచింగ్ సెంటర్, స్కూల్‌లో కౌన్సెలర్లు ఉండాలి. ఒత్తిడి తగ్గించే కార్యక్రమాలు, ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో హెల్ప్‌లైన్లు అవసరం. కోచింగ్ సెంటర్ల తప్పుడు ప్రకటనలను నిషేధించాలి. పిల్లల బాగోగులను పట్టించుకునే విధంగా ఉండాలి. నచ్చకపోతే ఫీజు వాపసు పారదర్శకంగా ఉండాలి. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం, ఆటపాటలకు, ఇతర వ్యాపకాలకు సమయం ఉండాలి. కోటాలో ఈ లేత ప్రాణాలు రాలిపోవడం చూస్తుంటే, చదువు పేరుతో పిల్లల మానసిక ఆరోగ్యాన్ని గాలికొదిలేస్తే ఎంత ప్రమాదమో అర్థమవుతోంది. ఈ విషాదాలకు ముగింపు పలకాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ●

# ప్రజావాక్కు



## ఆహార కల్తీతో అనారోగ్యం

ఆహార కల్తీ ప్రజల ప్రాణాలకు సంకటంగా మారింది తాజాగా ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక చికిత్సలయంలో కలుషిత ఆహారం తిని ఒకరు మృతిచెందగా సుమారు 92మంది అస్వస్థతకు గురవడం తీవ్ర ఆందోళన గురి చేస్తుంది. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు పరమాన్నం తిన్న రోజున రోగులు అనారోగ్యంకి గురైనారని అధికారులు చెబుతున్నారు. పాలతో పాటు ఇతర నాసిరకం పదార్థాలువాడారనే కోణంలో పరిశీలిస్తున్నారు. ఆసుపత్రులకు సరఫరా చేసే ఆహార పదార్థాలు సైతం తక్కువ నాణ్యతతో కూడిన పదార్థాల వినియోగిస్తున్నారు. దీంతో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పరిమితికి మించి వాడితే ఆస్తమా, దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఎర్రగడ్డ లాంటి ఘటనలు మరోమారు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్‌పల్లి జిల్లా

## ఫించను పెంచి ఇవ్వండి

కాంగ్రెసు పార్టీ చేసిన ఎన్నికల వాగ్దానాలలో ముఖ్యమైన వృద్ధాప్య ఫించన్ను అప్పట్లో బి.ఆర్.ఎస్. ఇచ్చే 2016 రూపాయలను 4000 కు పదవిలోకి వచ్చిన వెంటనే పెంచుతామని వాగ్దానం చేసింది. కాని ఈరోజు వరకు ఈ ప్రస్తావన ఇంతవరకు ఏ సందర్భాన తేలేదు. బి.ఆర్ ఎస్.నాయకులు పదేపదే గుర్తుచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకొన్న పాపాన పోలేదు. కాని రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలముందు ఈ ఫించను పెంచుతారని వార్తలొచ్చాయి. ఇది ఎంతవరకు వాస్తవ రూపం దాలుస్తుందో తెలియదు. బి.ఆర్.ఎస్. పార్టీ కనుక తిరిగి పదవిలోకి వచ్చుంటే ఇంకో వెయ్యి రూపాయలు కలిసుండేది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ప్రణాళిక ముఖ్యం

ఆర్‌సిబి క్రికెట్ ఉదంతం చాలా బాధాకర విషయం. స్టేడియం కెపాసిటీ ఎంత, ఫ్రీగాపాస్‌లు ఇచ్చింది ఎంత అప్పటికి ముందే స్టేడియంను చేరినఅభిమానులు ఎంతమంది ఎలా కంట్రోల్ చెయ్యాలి అనే స్పష్టమైన ప్లాన్ లేక జరిగిన ఉదంతమే. అసలు ఈఫంక్షన్ గురించి మాకు తెలియదు అని ఒకరు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు 5000 మంది పోలీసులను పెట్టాం మాది తప్పులేదని ఒకరు.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## నిర్లక్ష్యం తగదు

ఇటీవలి బెంగుళూరులోని చిన్న స్వామి స్టేడియంలో ఐపీఎల్ విజేతల సన్మాన కార్యక్రమం సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన చాలా బాధాకరం. ఉత్సాహంగా స్టేడియానికి తరలి వచ్చిన వేలాదిమంది అభిమానుల్లో 11మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలుకావడం, కొందరి పరిస్థితి విషమంగా మారడం అమానుషసంఘటన. ఈఘటనలో నిర్వాహకుల నిర్లక్ష్యం, క్రమశిక్షణ లేకపోవడం, సరైన భద్రతాఏర్పాట్లు చేపట్టకపోవడం వల్లే ఈ విషాదం సంభవించిందని అనిపిస్తుంది. ఇలాంటి పెద్ద కార్యక్రమాల నిర్వహణలో పునరావృతంకాని విధంగా ముందస్తు ప్రణాళిక, పోలీసులు ఇతర విభాగాల సమన్వయం అత్యవసరం. టికెట్ లేని వారిని అదుపులోకి తీసుకోవడం, ప్రవేశ ద్వారాల వద్ద నిబంధనల నిర్వహణ, అత్యవసర వైద్య సదుపాయాలు వంటి అంశాలపై సన్నద్ధత ఉండాల్సింది. కానీ ఈ కార్యక్రమంలో ఆ మౌలిక ఏర్పాట్లే లేవనిపించాయి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రత్యేక క్యాబినెట్ అవసరం

నూతన పరిపాలన సంస్కరణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా మొదటి శనివారం, మూడవ శనివారం 2 సార్లు క్యాబినెట్ సమావేశ నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం తీసుకున్న నిర్ణయం చాలా సంతోషకరం. అదే తరహాలో ఒక క్యాబినెట్ సమావేశమును ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వికలాంగుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, సమస్యలను కూడా పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి. ఉద్యోగ వికలాంగులసమస్యలను కూడా పరిష్కరించడం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## ఇంగ్లీషుకు ఉన్న ప్రాముఖ్యతే వేరు

మనిషికి నాగరికత నేర్పేది నిలకడగా ఉంచేది క్రమశిక్షణతో జీవితం గడపగలిగేది చేసేది లెక్కలు మాత్రమే. లెక్కలు ఏ దేశంలోనైనా ఎక్కడైనా కూడా ఇంగ్లీషులోనే చెప్తారు. తెలుగు మీడియంలో చెప్పాల్సిన అవసరం లేదు. రెండు ప్లస్ మూడు అంటారు. ఎప్పుడూ టూప్లస్ త్రీఅంటారు. రెండు ను మూడు తో కూడుము అనరు. ప్లస్ అనేది ఇంగ్లీష్, మైనస్ అనేది ఇంగ్లీష్. ఇంగ్లీష్ లాంగ్వేజ్ ని లెక్కల్లో నైనా ఫిజిక్స్‌లోనైనా అవాయిడ్ చేయడం చాలా కష్టం. సైన్స్ టీచింగ్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్‌ను అవాయిడ్ చేయడం చాలా కష్టం.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# గెహ్లాట్, పైలట్ విభేదాలకు తెర?

## సయోధ్యకు కసరత్తులంటూ ప్రచారం

**జైపూర్, జూన్ 8:** రాజస్థాన్ కాంగ్రెస్ రాజకీయా ల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఏళ్లుగా తీవ్ర రాజకీయ వైరం కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌తో జైపూర్‌లో సమావేశమయ్యారు. ఈ భేటీ వారిద్దరి మధ్య నెలకొన్న విభేదాలకు తెరపడి, సయోధ్య కుదిరే అవకాశాలు న్నాయనే చర్చకు దారితీసింది. దివంగత కేంద్ర మంత్రి, తన తండ్రి రాజేష్ పైలట్ 25వ వర్ధంతి కార్యక్ర మానికి హాజరు కావాల్సిందిగా అశోక్ గెహ్లాట్‌ను సచిన్ పైలట్ వ్యక్తిగతంగా ఆహ్వానించారు. 11న రాజేష్ పైలట్ ప్రాతినిధ్యం వహించిన పార్లమెంటరీ నియోజకవర్గమైన దౌసాలో ఈ స్మారక కార్యక్రమం జరగనుంది. 25 ఏళ్ల క్రితం రాజేష్ పైలట్ ఒక రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. కొన్నేళ్లుగా పైలట్ గెహ్లాట్ మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం, రాజకీయ ఆధిపత్య పోరు నడిచింది. 2020లో రాజస్థాన్ కాంగ్రెస్‌లో తలెత్తిన రాజకీయ సంక్షోభం తర్వాత ఇలా బహిరంగంగా కలుసుకోవడం ఇదే ప్రథమం. ఈ నేపథ్యంలో తాజా భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం ఇరువురు నేతలు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ తన నివాసంలో మాజీ కేంద్ర మంత్రి రాజేష్ పైలట్ 25వ వర్ధంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి నన్ను ఆహ్వానించారని గెహ్లాట్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రాజేష్ పైలట్, నేను 1980లో కలిసి లోక్‌సభలో అడుగుపెట్టాం. దాదాపు 18 ఏళ్లపాటు ఎంపీలుగా పనిచేశాం. ఆయన అకాల మరణం నాకు వ్యక్తిగతంగా, పార్టీకి తీరని లోటు అని రాజేష్ పైలట్‌తో తనకున్న సుదీర్ఘ అను బంధాన్ని గెహ్లాట్ గుర్తు చేసుకున్నారు. సచిన్ పైలట్ కూడా తమ భేటీకి సంబంధించిన ఫోటోను షేర్ చేస్తూ ఈ రోజు మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌ను కలిశాను. జూన్ 11న దౌసాలో మా నాన్నగారు రాజేష్ పైలట్ 25వ వర్ధంతి సందర్భంగా జరిగే స్మారక కార్యక్రమానికి హాజరుకావాలని వారిని అభ్యర్థించానని పేర్కొన్నారు.

రాజేష్ పైలట్ జూన్ 2000లో జైపూర్‌కు సుమారు 50 కిలోమీటర్ల దూరంలోని దౌసా జిల్లా భండానా గ్రామంలో జరిగిన కారు ప్రమాదంలో మరణిం చారు. అయితే, సయోధ్య గురించి ఇరుపక్షాల నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన లేనప్పటికీ, ఈ సమావేశం రాజస్థాన్‌లో కీల కమైన పార్టీ సంస్థాగత నిర్ణయాలకు ముందు సయోధ్య కుదిరే అవకాశం ఉందన్న ఊహా గానాలకు కాంగ్రెస్ వర్గాల్లో తెరలేపింది. ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు 2018 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించినప్పటి నుంచి మొదలయ్యాయి. అప్పటి రాజస్థాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న పైలట్, రాష్ట్రంలో పార్టీ పునరుజ్జీవనంలో కీలక పాత్ర పోషించారన్న ప్రశంసలు అందుకున్నారు. అయితే, ముఖ్య మంత్రి పదవి మాత్రం అనుభవజ్ఞుడైన అశోక్ గెహ్లాట్‌కు మూడోసారి దక్కింది. పైలట్‌కు ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇది తొలిదశలో అసంతృప్తికి బీజం వేసింది. ఈ వైరం 2020 జూలైలో తారస్థాయికి చేరింది. యువ నాయకులను పక్కన పెడుతున్నారని, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడిగా తన అధికారాన్ని గెహ్లాట్ అణగదొక్కుతున్నారని ఆరోపిస్తూ పైలట్ తన వర్గానికి చెందిన 18 మంది ఎమ్మెల్యేలతో కలిసి గెహ్లాట్‌పై తిరుగుబాటు చేశారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు పైలట్ బీజేపీతో కుమ్మక్కయ్యారని గెహ్లాట్ బహిరంగంగా ఆరోపిం చారు. ఆయన్ని పనికిరానివాడు, అసమర్థుడు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ బహిరంగ విమర్శలు వారి మధ్య అగాధాన్ని మరింత పెంచాయి. అనతికాలంలోనే పైలట్‌ను ఉప ముఖ్య మంత్రి పదవి నుంచి, పీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించారు.

ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీతో సహా కాంగ్రెస్ కేంద్ర నాయక త్వం మధ్యవర్తిత్వం చేయడానికి చేసిన ప్రయ త్నాలు ఫలించలేదు, ఇరువురి మధ్య నమ్మకం పూర్తిగా దెబ్బతింది. ఈ పరిణామాల నేపథ్యంలో తాజా భేటీ ఆసక్తికరంగా మారింది.



# పాక్‌కు ఉగ్రవాద నిరోధక కమిటీ నాయకత్వమా?

## భద్రతామండలి చర్చపై ప్రపంచదేశాల వ్యతిరేకత

**న్యూఢిల్లీ, జూన్ 8:** టెర్రరిజానికి చిరునామాగా ఉన్న పాకిస్థాన్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యుఎస్ఎస్‌సి)లో ఉగ్రవాద నిరోధక కమిటీకి వైస్ ఛైర్మన్ హోదా కట్టబెట్టడం విమ ర్శలకు దారితీస్తోంది. ఇస్లామాబాద్‌కు తాలిబన్ల ఆంక్షల కమిటీ బాధ్యతలను కూడా అప్పగిం చడంపై ప్రపంచ దేశాలు విస్మయం వ్యక్తం చేస్తు న్నాయి. మరోవైపు భద్రతా మండలి తీసుకున్న ఈ నిర్ణయాన్ని కౌన్సిల్‌లోని మిగిలిన సభ్యులు సైతం వ్యతిరేకిస్తున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జనవరిలో జరగాల్సిన ఐక్యరాజ్య సమితి కమిటీల కేటాయింపు ప్రక్రియ కేవలం పాక్ డిమాండ్లపైన ఏకాభిప్రాయం లేకపోవ డంతోనే ఐదు నెలలు ఆలస్యమైందని అధికా రులు పేర్కొన్నారు.

పాకిస్థాన్ మంకుపట్టు, అహేతుక డిమాండ్లపై మండలిలోని ఇతర సభ్యులు విసిగిపోయారని అధికారులు తెలి పారు. దీంతో ఉగ్రవాదంపై భారత్‌ను లక్ష్యంగా చేసే పాక్ ప్రయత్నాలకు ఇతర సభ్యులు మద్దతు పలికేందుకు సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. యుఎన్ఎస్‌సి శాశ్వత సభ్యులు చైనా, ఫ్రాన్స్, రష్యా, యుకె, అమెరికా ఏ కమిటీకీ నాయకత్వం వహించడానికి ఇష్టపడలేదని పేర్కొన్నారు. ఎందుకంటే ఆ దేశాలకు హోదాలతో పనిలేదని అవన్నీ ఏకాభిప్రాయంతో పనిచేస్తా యని అధికారులు తెలిపారు. అయితే పాక్‌కు కేటాయించిన స్థానం అంత ముఖ్యమైనది కాదని కేవలం నామమాత్రమైందేనన్నారు. కానీ తాలి బన్ ఆంక్షల కమిటీ పగ్గాలను దక్కించుకోవడం వల్ల ఇస్లామాబాద్, కాబుల్ మధ్య అభిప్రాయ భేదాలు తగ్గేందుకు అవకాశం ఉందన్నారు.
మొదట భద్రతా మండలిలో 1267 ఆంక్షల కమిటీ, 1540 (నాన్-ప్రొలిఫరేషన్) ఆంక్షల కమిటీ, 1988 తాలిబాన్ కమిటీ, 1373 ఉగ్రవాద నిరోధక కమిటీ (సిటిసి)ల అధ్యక్ష పదవులను పాక్ డిమాండ్ చేసింది. అయితే యుఎన్ఎస్‌సి ఆ దేశానికి తాలిబాన్ కమిటీతో పాటు, ఉగ్రవాద నిరోధక కమిటీకి వైస్‌ఛైర్మన్ హోదాలను ఇచ్చింది.
పాకిస్థాన్ ఉగ్రవాదానికి అడ్డా అనేది జగమెరిగి సత్యం. ప్రపంచవ్యాప్తంగా 850 మంది వ్యక్తు లను, సంస్థలను ఐరాస భద్రతా మండలి ఉగ్ర జాబితాలో చేర్చగా అందులో 146 పాకిస్థానీ యులే ఉండటం గమనార్హం. 2008 ముంబయి దాడుల సూత్రధారి, లష్కరే తయ్యిబా వ్యవస్థాకుడు హాఫీజ్ మహమ్మద్ సయీద్, జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మౌలానా మసూద్ అజార్ వంటి ఎంతో మంది కరడుకట్టిన ఉగ్రవాదులు అక్కడ ఆశ్రయం పొందుతున్నారు.

# ఐపిఓకు లలితా జ్యూయెలరీస్

**ముంబయి, జూన్ 8:** ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ లలితా జువెలరీ మార్ట్ త్వరలోనే పబ్లిక్ ఇష్యూకు (ఐపీవో) వచ్చేందుకు సిద్ధమ వుతోంది. దీని ద్వారా సుమారు రూ.1700 కోట్లు సమీకరించాలని సంస్థ లక్ష్యంగా పెటు కుంది. ఇందుకు సంబంధించిన ప్రాథమిక పత్రా లను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమ ర్పించింది. సమీకరించదలచిన మొత్తంలో రూ.1200కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయాలని లలితా జువెలరీ ప్రతిపాదిం చింది. దీనికి అదనంగా ఆఫర్ ఫర్ సేల్ (వోఎఫ్ ఎస్) విధానంలో సంస్థ ప్రమోటర్ అయిన కిరణ్‌కుమార్ జైన్ తన వాటా నుంచి రూ.500 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న లలితా జువెలరీకి దక్షిణ భారతదేశంలోని పలు నగరాల్లో మొత్తం 56 రిటైల్ విక్రయశాలలు ఉన్నాయి. 2022-24 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో సంస్థ ఆదాయాల్లో ఏటా సగటున 43.62 శాతం వృద్ధి నమోదైనట్లు తెలుస్తోంది. అయితే, సంస్థకు కొంత రుణ భారం కూడా ఉన్నట్లు సమాచారం. ఈ ఐపీవో ద్వారా లభించే నిధులను ప్రధానంగా వ్యాపార విస్తరణకు ఉపయోగించనున్నారు. కొత్తగా 12 స్టోర్లను ఏర్పాటు చేయడంతో పాటు ఇతర కార్పొరేట్ అవసరాలకు కూడా ఈ నిధులను కేటాయించనున్నారు. ఐపీవో ప్రక్రియ పూర్త యిన తర్వాత సంస్థ ఈక్విటీ షేర్లను ఎన్ఎస్ఈ , బీఎస్ఈలలో జాబితా చేయిస్తారు. ఈ పబ్లిక్ ఇష్యూకు ఆనంద్ రాఠీ అడ్వైజర్స్, ఈక్విరస్ కేపిటల్ సంస్థలు లీడ్ మేనేజర్లుగా వ్యవహ రించనున్నాయి. ఎంయూఎఫ్‌జీ ఇన్‌టైమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఐపీఓకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుంది. ఇప్పటికే భారత స్టాక్ మార్కెట్లో టైటాన్ ఇండియా, కళ్యాణ్ జువెలర్స్,పీసీ జువెలర్స్, పీఎన్ గాడ్గిల్ జువెలర్స్, తంగమలై, త్రిభోవన్‌దాస్ భీమ్ జీ జవేరి వంటి పలు ఆభరణాల విక్రయ సంస్థలు లిస్టయిఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు లలితా జువెలరీ కూడా ఈ జాబితాలో చేరనుంది.

# డెమొక్రాట్లకు సహకరిస్తే తీవ్రపరిణామాలు!

## ఎలాన్ మస్క్‌కు ట్రంప్ హెచ్చరికలు


**వాషింగ్టన్, జూన్ 8:** అమెరికా అధ్యక్షుడు డొనా ల్డ్ ట్రంప్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మధ్య చెలరేగిన ఘర్షణ రానురాను తీవ్రస్థాయికి చేరు తోంది. మధ్యంతర ఎన్నికల్లో మస్క్ డెమొక్రా ట్లకు సహకరిస్తే తీవ్రపరిణామాలు తప్పవని ట్రంప్ తాజాగా బిలియనీర్ మస్క్‌కు తీవ్రస్థాయి హెచ్చరికలుచేసారు. ఇటీవలి కాలంలో ఒకరిపై ఒకరు తీవ్రంగా వ్యాఖ్యలు చేసుకున్న వీరు ఆ తర్వాత ఎవరి పనిలో వారు పడిపోయారు. తాను వేరే పనులతో బిజీగా ఉన్నానని అధ్య క్షుడు ట్రంప్ వ్యాఖ్యానించగా, 'ద అమెరికా పార్టీ' అంటూ కొత్త పార్టీపై మస్క్ ట్వీట్ చేశారు. మరోవైపు ఇద్దరూ కాస్త తగ్గాలని రిపబ్లికన్లు కోరుతున్నారు. అయితే, అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా పోస్టులు చేస్తున్న మస్క్ పార్టీపై కీలక వ్యాఖ్యలు చేశారు. 80 శాతం మందికి ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ ఇప్పుడు అవసరమేనని, దీన్ని 80శాతం మంది సమర్థించారని చెప్పుకొచ్చారు. 'ద అమెరికా పార్టీ' అంటూ మస్క్ ఈ పోస్టు చేయడం కలకలం రేపారు. అయితే అమెరికాలో పుట్టని మస్క్‌కు అధ్యక్షుడయ్యే ఛాన్స్ లేదు. 80 శాతం అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ స్థాపించడానికి ఇది తగిన సమయమేనా అంటూ ఫాలోవర్లను 'ఎక్స్'లో ప్రశ్నించారు. ఆ ఓటింగ్ ఫలితాన్ని ప్రకటిస్తూనే మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈఘర్షణల వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు మరోసారి గట్టి హెచ్చరిక చేశారు. 2026 మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లకు సహకరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని అల్టి మేటం జారీ చేశారు. అయితే ఆ పరిణామాలు ఏమిటో వెల్లడించలేదు. మస్క్‌తో తిరిగి సంబంధాలను పునరుద్ధరించుకునే ఆలోచన లేదన్నారు. మొదటిసారి అమెరికా అధ్యక్షపగ్గాలు చేపట్టినప్పుడు మస్క్‌కు ఎంతో సహకరించినట్లు ట్రంప్ చెప్పారు. ఈ వ్యవహారంపై స్పందించిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ట్రంప్‌ను వెంబడించటం ద్వారా మస్క్ పెద్ద తప్పు చేస్తు న్నారని అన్నారు. భావోద్వేగంతోనే ఆయన నిరాశకు గురయ్యాడని తక్కువగా అంచనా వేసినట్లు చెప్పారు. మస్క్ దూకుడు చూస్తుంటే అంత సర్దుకుంటుందనే తన అంచనాలు నిజమయ్యే అవకాశం లేదని జేడీ వాన్స్ అన్నారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్లు విషయంలో




ట్రంప్‌మస్క్ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇరువురు సామాజిక మాధ్యమాల్లో పరస్పరం తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసుకున్నారు. మరోవైపు ట్రంప్, మస్క్‌ల మధ్య విభేదాలతో షాక్‌కు గురైన రిపబ్లికన్లు శాంతి మంత్రం పఠిస్తున్నారు. ఇద్దరూ మళ్లీ కలిసి పని చేయాలని కోరుకుంటున్నామని, అప్పుడే దేశానికి మంచి చేయగలమని సెనేటర్ టెడ్ క్రజ్ స్పష్టం చేశారు. ఇంకా పలువురు సెనేటర్లు, ప్రతినిధుల సభ సభ్యులు వారిద్దరి మధ్య సయోధ్య కుదరాలని పిలుపునిచ్చారు. ట్రంప్, మస్క్‌ల వివాదం ప్రభావం పన్ను, సరిహద్దు బిల్లుపై ఉండబోదని స్పీకర్ మైక్ జాన్సన్ వెల్లడించారు.

# కొలంబియా అధ్యక్ష అభ్యర్థిపై హత్యాయత్నం

**బొగోటా, జూన్ 8:** కొలంబియా సెనేటర్, అధ్యక్ష అభ్యర్థి మిగ్యుల్ ఉరిబ్ టర్బే (39)పై హత్యా యత్నం జరిగింది. ఓ కార్యక్రమంలో ప్రసంగి స్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆయనపై కాల్పు లు జరిపాడు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం బొగోటా పార్కులో ఓ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించరు. మిగ్యుల్ ఆ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తుండగా ఓ దుండగుడు ఆయన వెనక నుంచి కాల్పులు జరి పాడు. అధికారులు వెంటనే అప్రమత్తమై మిగ్యు ల్‌ను ఆస్పత్రికి తరలించారు. బొగోటా మేయర్ కార్లోగాలన్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కాల్పులు జరిపినట్లు అనుమానిస్తున్న ఓ వ్యక్తిని కూడా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనను మిగ్యుల్ పార్టీ కన్జర్వేటివ్ డెమోక్రటిక్ తీవ్రంగా ఖండించింది. ఇది ఒక రాజకీయ నాయకుడిపై జరిగిన దాడి కాదని, దేశంలోని ప్రజాస్వామ్యం,



స్వేచ్ఛపై జరిగిన దాడి అని పేర్కొంది. కాగా ఈ ఘటనను కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తీవ్రంగా ఖండించారు. మిగ్యుల్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే యేడాది కొలంబియాలో అధ్యక్ష ఎన్నికలు జరగ నున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష కన్జర్వేటివ్ డెమోక్రటిక్ పార్టీ నుంచి మిగ్యుల్ పోటీలో ఉన్నారు.

# సూట్‌కేస్‌లో శవమై తేలిన 9ఏళ్ల చిన్నారి

**న్యూఢిల్లీ, జూన్ 8:** బంధువుల ఇంటికి వెళ్లిన 9 ఏళ్ల చిన్నారి సూట్‌కేసులో శవమై కనిపించింది. ఈశాన్య ఢిల్లీలోని నెహ్రూ విహార్ ప్రాంతంలో ఆదివారంవెలుగులోకి వచ్చింది. ప్రాథమిక వైద్య పరిశీలనల ఆధారంగా బాలికపై లైంగిక దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తు న్నారు. గత రాత్రి బాధిత బాలిక సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. రెండు గంటలు గడిచినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించడం ప్రారంభించారు. తమ ఇంటికి సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న ఒక ఇంటి వైపు బాలిక వెళ్లినట్లుగా ఎవరో చెప్ప డంతో బాలిక తండ్రి అక్కడికి వెళ్లారు. ఆ బిల్డిం గ్‌లోని రెండో అంతస్తులో ఉన్న ఒక ఫ్లాట్‌కు బయట నుంచి తాళం వేసి ఉండటాన్ని బాలిక తండ్రి గమనించారు. అనుమానంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా, ఒక సూట్‌కేసులో తన కుమార్తె కదలకుండా పడి ఉండటం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ సమయంలో బాలిక ఒంటిపై నూలుపోగు కూడా లేదని తెలిసింది. ఈ ఘటనపై బాలిక తండ్రి మాట్లాడుతూ నేను ఆ ఫ్లాట్‌కు చేరుకుని తాళం పగలగొట్టాను. లోపల సూట్‌కేసులో నా కూతురు స్పృహ లేకుండా పడి ఉంది. వెంటనే మా వీధిలోనే ఉన్న నర్సింగ్ హోమ్‌కు తీసుకెళ్లానని తెలిపారు. మా అమ్మాయి దగ్గ ర్లోని మా బంధువులకు ఐస్ ఇవ్వడానికి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో బంధువులకు ఫోన్ చేస్తే అసలు అక్కడికి రాలేదని చెప్పారు. నేను వెతకడం మొదలుపెట్టాక, మా అమ్మాయి దగ్గర్లోని ఒక ఫ్లాట్‌లోకి వెళ్లిందని, ఎవరో లోపలికి పిలిచారని ఒకరు చెప్పారు. ఆ ఇంటి యజమానిని అడిగితే ఫ్లాట్‌కు తాళం వేసి ఉందని, తాళాలు తన సోదరుడి దగ్గర ఉన్నా యని చెప్పాడు. అమ్మాయి అప్పటికే వెళ్లిపో యిందని కూడా అన్నాడు. కావాలంటే చూసుకో మన్నాడు. మేము వెళ్తుంటే ఆ యజమాని అక్కడి నుంచి పారిపోయాడని ఆయన వివరిం చారు. తాళం పగలగొట్టి చూడగా, నా బిడ్డ సూట్‌కేసులో కనిపించిందంటూ కన్నీటిపర్యం తమయ్యారు.

# లాస్‌ఏంజెల్స్‌లో ఇమ్మిగ్రేషన్‌రైడ్స్‌పై గవర్నర్ల నిరసన

## నేషనల్‌గార్డ్‌ను ట్రంప్ రంగంలోకి దించడంపై అభ్యంతరం

**లాస్‌ఏంజెల్స్, జూన్ 8:** ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ దాడుల కారణంగా గత కొన్ని రోజులుగా అట్టు డుకుతున్న లాస్ ఏంజెలెస్‌లో అల్లరి మూకలను అణిచివేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. కాలిఫోర్నియా నేషనల్ గార్డ్‌ను ఫెడరల్ ప్రభుత్వం తన ఆధీ నంలోకి తీసుకోవడం, నగరానికి 2,000 మంది సైనికులను పంపడం హింసను ప్రేరేపించడానికి పన్నిన రాజకీయ స్టంట్ అని కాలిఫోర్నియా గవర్నర్ గేవిన్ న్యూసమ్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. కాలిఫోర్నియా గవర్నర్ గేవిన్ న్యూ స్కమ్, లాస్ ఏంజెల్స్ మేయర్ కరెన్ బాస్‌కు తమ పనులు చేతకాకపోతే అప్పుడు ఫెడరల్ ప్రభుత్వం రంగంలోకి దిగి అల్లర్లు, దోపిడీదా రుల సమస్యను పరిష్కరించాల్సిన విధంగా పరి ష్కరిస్తుందంటూ అని ట్రంప్ హెచ్చరించారు. దీనిపై గవర్నర్ న్యూసమ్ కూడా అంతే తీవ్రంగా స్పందించారు. ఫెడరల్ ప్రభుత్వం కాలిఫోర్నియా నేషనల్ గార్డ్‌ను తమ నియంత్రణలోకి తీసుకుని, 2,000 మంది సైనికులను లాస్ ఏంజెలెస్‌లో




మోహరించడం ప్రమాదకరమని, రాజకీయ ప్రేరే పిత చర్య అని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల కొరత లేకపోయినా ఫెడరల్ ప్రభుత్వం ఇలా చేయడం కేవలం ప్రదర్శన కోసమే. వారికి ఆ అవకాశం ఇవ్వకండి. హిం సను ఎప్పుడూ ఆశ్రయించవద్దు. శాంతియు తంగా మీ గళం వినిపించండని న్యూసమ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఫెడరల్ ప్రభుత్వ చర్య ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేలా ఉందని, ఇది ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తుందని గవర్నర్ న్యూసమ్ అంతకుముందు హెచ్చరిం చారు. లాస్ ఏంజెలెస్ అధికారులకు అవసరమైన వెంటనే పోలీసు సహాయం అందుబాటులో ఉంది. మేము నగరం, కౌంటీ అధికారులతో నిరంతర సమన్వయంతో ఉన్నాం. ప్రస్తుతం తీర్చలేని అవసరం ఏదీ లేదు. నేషనల్ గార్డ్ ఇప్పటివరకు లాస్ ఏంజెలెస్‌కు అద్భుతంగా సేవలు అందించింది.

ఇది తప్పుడు చర్య, ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఫెడరల్ ప్రభుత్వం అస్తవ్యస్తంగా ఇమిగ్రేషన్ తనిఖీలు నిర్వహిస్తోందని, లాస్ ఏంజెలెస్ హైవేలపై శాంతి భద్రతలు కాపాడేం దుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సీహెచ్‌పీ కాలిఫోర్నియా హైవే పెట్రోల్ బలగాలను మోహరిస్తోందని న్యూసమ్ తెలిపారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ దాడులకు సాయం చేయడం వారి పని కాదు. ఫెడరల్ ప్రభుత్వం ఉద్రిక్తతలను పెంచడానికి గందరగో ళాన్ని సృష్టిస్తోంది. ఏ నాగరిక దేశం ఇలా ప్రవర్తించదని ఆయన విమర్శించారు.

# బాలికల అపహరణ..సామూహిక అత్యాచారం




**భువనేశ్వర్, జూన్ 8:** వివాహ వేడుకలో పాల్గొన్న ఇద్దరు బాలికలను ఇద్దరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. వారిని జనంలేని ప్రాంతానికి తీసు కెళ్లారు. అక్కడకు మరో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఆ నలుగురు కలిసి ఇద్దరు బాలికలపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఒడిశాలోని గంజాం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూన్ 3న జరిగిన పెళ్లి వేడుకలో 14, 15 యేళ్ల వయస్సున్న ఇద్దరు బాలికలు పాల్గొన్నారు. ఒక బాలికకు తెలిసిన వ్యక్తితో పాటు మరో వ్యక్తి వారిని మభ్యపెట్టి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడకు మరో ఇద్దరు వ్యక్తులు చేరుకున్నారు. నలుగురు కలిసి ఇద్దరు బాలికలపై సామూహిక అత్యాచారానికి పాల్ప డ్డారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. కాగా, బాలికల కోసం వెతికిన కుటుంబసభ్యులు జనం లేని ప్రాంతంలో వారిని గుర్తించారు. వారిపై లైంగిక దాడి జరిగినట్లు తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారి తెలిపారు. బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అదే గ్రామానికి చెం దిన నలుగురు నిందితులు విశాఖపట్నం పారి పోతుండగా అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

# గాజాసిటీలోని ఆసుపత్రి కింద హమాస్ సొరంగం

**గాజాసిటీ, జూన్ 8:** గాజాపై ఇజ్రాయెల్ దాడు లను తీవ్రతరం చేసిన ఖాన్ యూనిస్‌లోని ఒక ఆస్పత్రి కింద హమాస్ సొరంగం గుర్తించామని ఇజ్రాయెల్ రక్షణ దళాలు వెల్లడించాయి. యూరోపియన్ హాస్పిటల్ కాంపౌండ్‌లో ఓ సొరంగాన్ని గుర్తించామని తెలిపాయి. హమాస్ సీనియర్ కార్యకర్తలు దానిని కమాండ్‌అండ్ కంట్రోల్ సెంటర్‌గా, ఇజ్రాయెల్‌పై దాడులకు ప్రణాళికలు రచించే స్థావరంగా ఉపయోగిస్తు న్నారని సైన్యం తెలిపింది. ఈ సొరంగానికి సంబంధించిన వీడియోను ఐడీఎఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అందులో ఓ సొరంగంలో ఆయుధాలు, నిఘా సామగ్రి ఇతర పరికరాలు ఉంచిన కంట్రోల్ రూములు కూడా ఉన్నట్లు వివరించింది. ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ మార్గదర్శకత్వంలో గోలన్ బ్రిగేడ్, యాహలోమ్ యూనిట్, ప్రత్యేక దళాలు చేసిన ఆపరేషన్‌లో ఈ వీడియోను సేకరించినట్లు ఐడీఎఫ్ తెలి పింది. హమాస్ తన ప్రయోజనాల కోసం గాజా లోని ఆసుపత్రులను స్థావరాలుగా వాడుకుంటూ పౌరుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోందని విమర్శించింది. 2023లోనూ ఇదే విధంగా గాజాలోని అతిపెద్ద ఆస్పత్రి అల్ షిఫా కింద సొరంగాన్ని కనుగొన్నట్లు ఐడీఎఫ్ గుర్తు చేసింది. వాటిని ధ్వంసం చేయడానికి తాము దాడులు చేసినప్పుడు అక్కడ ఉన్న అమా యకులు సైతం ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పింది. అయితే



ఇజ్రాయెల్ వాదనలు అసత్య ప్రచారాలని పాల స్తీనా అధికారులు, వైద్య సిబ్బంది ఖండించారు. 2023 అక్టోబర్ నుంచి ఇజ్రాయెల్‌హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధంలో 53 వేల మంది ప్రాణాలు కోల్పో యారని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. గత 24 గంటల్లో 60 మంది మరణించారని వివరించింది. మరోవైపు గాజా మొత్తాన్ని తమ నియంత్రణలోకి తీసుకుంటా మని ఇప్పటికే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు.

ఈ అంశంపై వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేశారు. మరోవైపు గాజాలో ఇజ్రాయెల్ సైన్యం మరో బందీ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుంది. ఇది థాయ్‌లాండ్‌కు చెందిన నట్టా పోంగ్ పింటా మృతదేహం అని వెల్లడించింది. ప్రత్యేక విమా నంలో ఆ భౌతిక కాయాన్ని ఇజ్రాయెల్‌కు తీసుకు వచ్చింది. 2023 అక్టోబరు 7 దాడుల సమ యంలో హమాస్ తీవ్రవాదులు నట్టాపోంగ్ ను హతమార్చి అతని మృతదేహాన్ని గాజాకు తరలించింది.

# తమిళనాడులో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఖాయం

## మదురై పర్యటనలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**చెన్నై, జూన్ 8:** తమిళనాడులో అవినీతి పరా కాష్టకు చేరిందని, గడచిననాలుగేళ్లలో రాష్ట్రం లోని డిఎంకె ప్రభుత్వం అవినీతిలో అగ్రస్థా నానికి చేరుకుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధ్వజమెత్తారు. తమిళనాడు పర్యటనలో ఆయన వివిద కార్యక్రమాల్లోపాల్గొని ప్రసంగిం చారు. 2026 అసెంబ్లీ ఎన్నికలనంతరం తమిళనాడులో బిజెపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేసారు. అలాగే పశ్చిమబెంగాల్‌లో కూడా బిజెపికూటమి ప్రభుత్వం ఖాయమని తేలింది. ప్రస్తుతం నా దృష్టి అంతా తమిళనాడుపైనే ఉందని ప్రధానిమోడీ నేతృత్వంలో భారతదేశ సైనిక ఉక్కు సంకల్పంప్రదర్శించిన ఆపరేషన్ సింధూర్ ఒక మలుపు అని ఆయన అన్నారు. డిఎంకె ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన పదిశాతం హామీలు కూడా నెరవేర్చలేదని అన్నారు. అక్రమ మద్యం మరణాలనుంచి టాస్మాక్‌లో రూ.39వేల కోట్ల కుంభకోణం వరకూ డిఎంకె నూరుశాతం పాలనలో వైఫల్యం చెందిందని ఆరోపించారు. స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం కేంద్ర నిధులను దుర్వినియోగంచేస్తోందని, అభివృద్ధి పథకాలు అమలుచేయడంలేదని ఆరోపించారు. మోడీ నిధులు తమిళనాడుప్రజలకు చేరడంలేదని వాటిని డిఎంకె ఇతరత్రా మళ్లిస్తోందని ఆరోపించారు. ఇంజనీరింగ్ విద్యతోసహా ఉన్నత విద్యను ప్రోత్సహించడంలో రాష్ట్రప్రభుత్వం ఆసక్తిలేనట్లుగా ఉందని తన ఎన్నికల వాగ్దానాలు ఎన్ని అమలుచేసారో ప్రజలకు తెలియజెప్పాలని ఆయన సవాల్‌చేసారు. ఇటీవలి ఎన్నికల్లో ఒడిశాను గెలుచుకున్నామని, హర్యానాను మళ్లీ నిలుపుకున్నామన్నారు. 26 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అధికారంలోకి వచ్చామని, మోడీ మూడోసారి అధికారంలో వచ్చేందుకు పార్టీ మంచి కృషి చేసిందని అన్నారు. జాతీయ విద్యావిధానం అమలుచేయకపోవడంవల్ల తమిళనాడుకు రూ.2152 కోట్లు నిలిచిపోయాయయని, నియో జకవర్గ పునర్విభజన కసరత్తు వంటి వాటిని మాత్రం అమిత్‌షా తన ప్రసంగాల్లో ఎక్కడా ప్రస్తావించలేదు. కాగా అమిత్‌షా ప్రసం గాలపై డిఎంకె ఎదురుదాడిచేసింది. పార్టీ ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హాఫీజుల్లా మాట్లా డుతూ అమెరికాలో కూడా బిజెపికి అధికారం చేజిక్కిం చుకునే అవకాశం చాలా ఎక్కువ ఉండవచ్చని, కానీ తమిళనాడులో ఉండదని రూ.39వేల కోట్ల కుంభకోణంపై బిజెపి ఒక ఊహాజనిత ప్రపంచంలో జీవిస్తోందని ఎద్దేవా చేసారు.

# కనీస స్థాయికి పడిపోయిన పాక్ సింధు జలాలు

**ఖరీఫ్‌సీజన్‌కు కష్టమేనంటున్న వ్యవసాయరంగ నిపుణులు**

**భారత్‌కు లేఖలద్వారా పాకిస్థాన్ విజ్ఞప్తులు**

**కరాచి, జూన్ 8:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పేందుకు సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడం వల్ల దాయాది దేశానికి నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. పాకిస్థాన్‌లోని పలు డ్యామ్‌లలో నీటి మట్టం దారుణంగా పడిపోయింది. దాదాపు డెడ్‌లెవల్‌కు చేరిందని పాక్ అధికారిక గణాంకాల ద్వారా వెల్లడైంది. గతేడాదితో పోలిస్తే సింధు బేసిన్‌లో నీటి ప్రవాహం 15 శాతం తగ్గింది. వేసవిలో పంటలు ఎండి కష్టాల్లో పడిన పాకిస్థాన్ రైతులకు నీరు లేకపోవడం వల్ల ఖరీఫ్ సీజన్‌లో మరిన్ని కష్టాలు తప్పవని నిపుణులు చెబు తున్నారు. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులో గతేడాది జూన్ 5న 1.44 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల ఉండగా, ప్రస్తుతం నీటి విడుదల 1.24 లక్షల క్యూసెక్కులకు తగ్గిందని తెలిపింది. తాజా డేటా ప్రకారం పాకిస్థాన్ ఖైబర్ పఖ్తూ న్ఖ్వాలోని టార్బెలా ఆనకట్ట వద్ద సింధూ నది నీటి మట్టం 1,465ఔమీటర్లకు తగ్గింది. ఈ డ్యామ్‌లో డెడ్‌లెవల్ 1,402 మీటర్లుగా ఉన్నట్టు తెలుస్తోంది. పంజాబ్‌లోని చస్మా ఆనకట్ట వద్ద ప్రస్తుతం నీటి మట్టం 644 మీటర్లుగా ఉంది. ఇక్కడ డెడ్ లెవల్ 638 మీటర్లని సమాచారం. మీర్పూర్‌లోని జీలంపై ఉన్న మంగ్లా ఆనకట్ట వద్ద 1,163 మీటర్ల స్థాయిలో నీరు ఉంది. ఇక్కడ డెడ్ లెవల్ 1,050 మీటర్లుగా తెలు స్తోంది. సియాల్‌కోట్‌లో మరాలా వద్ద పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని సమాచారం. అక్కడ చీనాబ్‌పై సగటు నీటి విడుదల మే 28న 26,645క్యూసెక్కుల నుంచి జూన్ 5న 3,064క్యూసెక్కులకు పడిపోయిందని పాకిస్తాన్ డేటా ద్వారా స్పష్టమవుతోంది.

# హర్యానాలో బోగస్ కార్డియాలజిస్టు!

## అర్హతలేకున్నా 50 మందికి శస్త్రచికిత్సలు



**ఫరీదాబాద్(హర్యానా), జూన్ 8:** హర్యానాలోని ఫరీదాబాద్‌లో వైద్యరంగంలోనే అత్యంత దారు ణమైన మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. కేవలం ఎంబీబీఎస్ డిగ్రీ మాత్రమే ఉన్న ఒక వైద్యుడు ఏకంగా కార్డియాలజిస్ట్‌గా నటిస్తూ ప్రభు త్వ ఆసుపత్రిలో 50కి పైగా గుండె సంబంధిత శస్త్రచికిత్సలు చేసిన వైనం వెలు గులోకి వచ్చింది. ఫరీదాబాద్‌లోని బాద్‌షా ఖాన్ సివిల్ ఆసుపత్రిలో డాక్టర్ పంకజ్ మోహన్ శర్మ అనే వ్యక్తి ఈ దారుణానికి పాల్పడ్డాడు. సుమారు ఎనిమిది నెలలకు పైగా కార్డియా లజిస్ట్‌గా చలామణి అవుతూ గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులకు శస్త్రచికిత్సలు నిర్వ హించాడు. వాస్తవానికి అతడికి ఎంబీబీఎస్ పట్టా మాత్రమే ఉంది. గుండె వంటి కీలకమైన అవయవాలకు సంబంధించిన సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడానికి అతనికి ఎలాంటి అధికారిక అర్హత లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నకిలీ వైద్యుడు, ప్రస్తుతం ప్రాక్టీస్‌లో ఉన్న మరో నిజమైన కార్డియాలజిస్ట్ రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఉపయోగించి ఈ మోసానికి పాల్పడి నట్లు విచారణలో తేలింది. అతడితో సర్జరీ చేయిం చుకున్న అనేక మంది రోగులు తీవ్రమైన అనా రోగ్య సమస్యలు ఎదుర్కొన్నారని, వారిలో కొందరు మరణించినట్లు కూడా సమాచారం. ఈ దారుణం ఒక రోగి ద్వారానే వెలుగులోకి వచ్చింది. డాక్టర్ శర్మ చేతిలో చికిత్స పొందిన ఒక రోగి, అనుమానంతో అసలు రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన కార్డియాలజిస్ట్‌ను సంప్రదిం చడంతో విషయంబయటపడింది. దీనితో ఆసు పత్రి యాజమాన్యం అంతర్గత విచారణలో డాక్టర్ సమర్పించిన పత్రాలు నకిలీవని తేల డంతో విధులనుంచి తొలగించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

## కొత్త మంత్రులకు పొన్నం అభినందనలు

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని మరోసారి నిరూపించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొత్తగా మంత్రివర్గంలో ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరికి అభినందనలు తెలిపారు. రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కులగణన చేస్తే ఏం లాభం అన్నవారికి ఇటీవల ఎమ్మెల్సీ ఇవ్వడం, ఇప్పుడు మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించడం రాహుల్‌గాంధీ ఆలోచనకు అద్దం పడుతుందన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ, కెసి వేణు గోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లక్ష్యంగా ఎమ్మెల్యే రాజాసింగ్ పరోక్ష విమర్శలు

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి కిషన్‌రెడ్డిపై గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి పరోక్ష విమర్శలు చేశారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకా విష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకరిస్తే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతోందంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందిస్తూ.. పరోక్ష విమర్శలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డి సహాయం అడుగుతున్న వారికి చెవులు ఉన్నా..వినపడవని అన్నారు.

నోరు ఉందని కానీ చెప్పరంటూ రాజా సింగ్ ఎద్దేవా చేశారు. అలాంటి మహానుభావులకు అడిగితే ఏం సహాయం చేస్తారని ఎమ్మెల్యే రాజాసింగ్ పరోక్షంగా విమర్శించారు. గత కొంతకాలంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి, ఎమ్మెల్యే రాజాసింగ్ మధ్య అంతర్గతంలో కోల్డ్‌వార్ జరుగుతున్నట్లు బీజేపీలో అంతర్గతంగా ఓ చర్చ అయితే నడు స్తోంది. దీనిపై పలు సందర్భాల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని విలేకర్లు ప్రశ్నిం చినా.. అలాంటివి పార్టీలో లేవని కొట్టిపారేశారు. అయితే పార్టీలో చిన్నచిన్న పొర పొచ్చాలు ఉన్నా వాటిని సరిచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని తామే పరిష్కరించుకుంటామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కానీ చాలాకాలంగా కిషన్‌రెడ్డి విషయంలో ఎమ్మెల్యే రాజాసింగ్ భిన్న వైఖరిని అవలంబిస్తున్నారు.

# ఇక ఓపెన్ మార్కెట్‌లో తెలంగాణ బ్రాండ్ బియ్యం

## రేట్ల నిర్ణయంపై పౌరసరఫరాల సంస్థ సన్నాహాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8:** తెలంగాణ బ్రాండ్ పేరుతో సన్న వడ్ల బియ్యాన్ని ప్యాక్ చేయించి ఓపెన్ మార్కెట్‌లో విక్రయించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర అవసరాలకు మించి సన్న వడ్లు వస్తుండటంతో మిగులు ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి బియ్యాన్ని బియ్యంగా విక్రయించేందుకు పౌరసరఫరాల సంస్థ సిద్ధం అవుతోంది. ఈ సన్నబియ్యంలో బీపీటీ, ఆర్ఎన్ఆర్, రకాలకు మంచి డిమాండ్ ఉండగా కేటగిరీలను పౌరసరఫరాల సంస్థ ప్రత్యేకంగా నిల్వ చేయించింది. భారీ ఎత్తున వానాకాలం, యాసంగి సీజన్లలో సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. వానాకాలంతో పోలిస్తే యాసంగి పంటలో నూకలు అధికంగా వస్తున్నాయి.

ఈ నేపథ్యంలో వానాకాలంలో వచ్చిన వడ్లతో బియ్యాన్ని తయారు చేసి తెలంగాణ బ్రాండ్ పేరుతో విక్రయించనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. తెలంగాణ బ్రాండ్ పేరుతో రాష్ట్రంలో సూపర్‌మార్కెట్లు, కిరాణా దుకాణాలతో పాటు రేషన్ షాపుల్లోనూ ఈ బియ్యాన్ని విక్రయించనున్నట్లు తెలుస్తోంది. రేషన్‌షాపుల్లో ప్రస్తుతం తెల్లకార్డు ఉన్నవారికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. అలాగే దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారికి ఏపీఎల్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

తెలంగాణ బ్రాండ్ బియ్యాన్ని ఏపీఎల్ కార్డుదారులు కొనుగోలు చేసేందుకు వీలుగా రేషన్ దుకాణాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ బ్రాండ్‌తో విక్రయించే బియ్యానికి ధర నిర్ణయించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ప్రస్తుతం మార్కెట్లో ఉన్న సన్నబియ్యం ధరలను పరిశీలిస్తున్నారు. ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి ఇస్తే డబ్బులు రావడానికి కనీసం ఆరు నెలలు నుంచి ఏడాది వరకు సమయం పడుతుంది. అదే తెలంగాణ బ్రాండ్‌తో బియ్యాన్ని విక్రయిస్తే వెంటనే డబ్బులు వస్తాయని పౌరసరఫరా శాఖ భావిస్తోంది. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ బియ్యాన్ని విక్రయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాల సమాచారం.

# అప్పులు తీర్చలేక ఇద్దరు రైతుల బలవన్మరణం

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త :** వ్యవసాయంలో నష్టాల పాలైన ఇద్దరు రైతులు చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలోని ఆర్గొండకు చెందిన రైతు జంగిటి పెంటయ్య (48) తన పొలంలో బోరు వేయడంతో పాటు, మొక్కజొన్న పంట వేసేందుకు అప్పులు చేశారు. అయితే, పంట దిగుబడి రాకపోవడం, చేసిన రూ.6 లక్షలకు చేరడంతో అవి తీరే మార్గం కనిపించ లేదు. ఈ అప్పులను ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం ఎక్లాసఖాన్‌పేటకు చెందిన రైతు ఒట్టెల కుమార్ (38) వ్యవసాయంతో పాటు నాలుగు పాడి ఆవులను తెచ్చుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆవులు చనిపోవడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం లేక పొలంలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు.



# రహదారి లేదు.. 108 రాదు

## అత్యవసర వైద్యం అందాలంటే ప్రాణాలకు తెగించాల్సిందే

## పురిటి నొప్పులతో గర్భిణుల అవస్థలు

### ప్రాణాలు కాపాడుకోవాలంటే జట్టి కట్టాల్సిందేనా!

**పినపాక, ప్రభాతవార్త, జూన్ 8:** రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజలకు విద్యా, వైద్యసేవలు అందించే నేపథ్యంలో వాటికీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ ఇంకా మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అత్యవసర వైద్యం అందాలంటే సరైన రహదారి సౌకర్యం లేక నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇక్కడ ఎవరికి ఏమైనా వైద్య ఆరోగ్యకేంద్రం వెళ్లాలంటే రహదారి లేక,108 వాహనం రాక వైద్య సేవలు సైతం అందక ప్రాణాలు కాపాడుకోవాలంటే తోటి వాళ్లతో జట్టి కట్టాల్సిందే, ఒకవేళ ప్రమాద స్థాయి తీవ్రంగా ఉంటే ప్రాణాలు గాల్లో కలవాల్సిందే. మండల పరిధిలోని ఆదివాసి వలస గిరిజనులకు ప్రభుత్వం అందించే వైద్య సేవలు దక్కాలంటే సరైన రహదారి వ్యవస్థ అత్యవసరం,వారి నిత్యవసరాల కోసం, జీవనోపాధి కోసం తమ నివాసాల నుండి నిత్యం బయటకు రావాల్సిన పరిస్థితి.ఇలాంటి నేపథ్యంలో వారికి రహదారి సౌకర్యం ప్రభుత్వం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.మండల పరిధిలోని టీ కొత్తగూడెం గ్రామపంచాయతీలో గల ఉమేష్ చంద్ర నగరానికి చెందిన మీడియం జానకి ఆదివారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు బాధితురాలకు మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో 108 వాహనం రావడానికి రహదారి సౌకర్యం లేక 108 వాహనం రాలేదు తల్లి,బిడ్డ క్షేమం కోసం తోటి గిరి జనులు ఏకమై గర్భిణీ మహిళలను జట్టి సహాయంతో రోడ్డు సౌకర్యం ఉన్న వరకు తీసుకురావడం జరిగింది.

స్థానిక వైద్యాధికారులు సిబ్బంది గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి వైద్య సేవలు అందించినప్పటికీ, కొన్ని అత్యవసర సందర్భాలలో తమకు అత్యవసర వైద్య సేవలు అందాలంటే కనీసం రోడ్డు సౌకర్యం అవసరం.ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం అందించాలని ఉమేష్ చంద్ర నగర్ గిరిజనులు కోరుతున్నారు.

రహదారి సౌకర్యం లేకపోతే గర్భిణీ మహిళలు,వృద్ధులు చిన్న పిల్లలకి అత్యవసర వైద్యం అందించడం అంత సులభం కాదని వారు వాపోతున్నారు. వర్షాకాలంలో వరదలు, వానల ప్రభావంతో విష జ్వరాలు అయినా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు ప్రబలి వైద్యం అందించాలంటే రహదారి సౌకర్యం ఎంతైనా అవసరం ఉంది.ప్రభుత్వ ఉన్నతాధికారులు దృష్టి సారించి మారుమూల గిరిజన గ్రామాలకు సైతం వైద్య సేవలు అందించే నేపథ్యంలో రహదారి సౌకర్యం వెంటనే కల్పించి తమ ప్రాణాలను కాపాడాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

# మల్‌రెడ్డి రంగారెడ్డికి అధిష్ఠానం బుజ్జగింపులు

## మంత్రిపదవి రాకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న మల్‌రెడ్డి

## ఆయన నివాసానికి వెళ్లి చర్చలు జరిపిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం

**హైదరాబాద్ (మలక్‌పేట /సైదాబాద్), జూన్ 8, ప్రభాతవార్త:** మంత్రిపదవి ఆశించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి నిరాశ ఎదురుకావడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన ఒక దశలో రాజీనామా చేస్తారన్న పుకార్లు వచ్చాయి. ఆదివారం సాయంత్రం ప్రెస్‌మీట్‌లో వివరాలు వెల్లడిస్తారన్న సమాచారం రావడంతో మలక్‌పేట తిరుమలహిల్స్‌లోని ఆయన నివాసానికి మీడియా సిబ్బంది చేరుకున్నారు. అయితే అసంతృప్తితో ఉన్న మల్‌రెడ్డిని బుజ్జగించడానికిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ మల్‌రెడ్డిరంగారెడ్డి ఇంటికి చేరుకుని చర్చలు జరిపారు. అనంతరం పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సామాజిక సమతుల్యత పాటిస్తూ మంత్రి పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. మంత్రి వర్గంలో చోటును మల్‌రెడ్డి రంగారెడ్డి ఆశించారని, అయితే సమీకరణల దృష్ట్యా, చాలా కోణాల నుంచి, ఏఐసిసి పెద్దలు ఆలోచించి మూడు మంత్రి పదవులను భర్తీ చేయడం జరిగింద న్నారు. మరో మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నా యన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 40 శాతం జనాభా ఉందని, కేబినెట్‌లో ఈ ప్రాంతానికి చోటు కల్పించాలనే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరిక సమంజసమైనదే నన్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతానికి న్యాయం చేస్తామన్నారు.

**పార్టీకి విధేయుడిగా ఉంటా : మల్‌రెడ్డి రంగారెడ్డి**

నాయకులు, కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్‌తో కొట్లాడడం జరిగిందని, కార్యకర్తలు లేకుండా పనిచేయలేమని, వారి డిమాండ్ మేరకు అడగడం జరిగిందన్నారు. పార్టీకి ఎల్లప్పుడు విధేయుడిగా ఉంటానని, హైద్రాబాద్, రంగారెడ్డి జిల్లాకు గతంలో ఆరుగురు మంత్రులు ఉండేవారని, అధిష్టానానికి చెప్పడానికి అవకాశం ఇవ్వాలని పిసిసి చీఫ్‌ను కోరడం జరిగిందన్నారు. పార్టీ బాగు కోసమే తాము అడుగుతున్నామని, కొట్లాడి అధికారంలోకి వచ్చాక పార్టీకి నష్టం జరుగుతుందని, తాను చెప్పదలుచుకున్న విషయాన్ని చెప్పడం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాము సమర్థిస్తామన్నారు. మంత్రి పదవికి సామాజిక వర్గమే అడ్డుగా వస్తే, పార్టీ కోసం త్యాగం చేస్తానని అన్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం దశాబ్దాలుగా శ్రమిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూత

## అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

## నివాళులర్పించిన సిఎం రేవంత్, మాజీ సిఎం కెసిఆర్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు

## పాడె మోసిన కెటిఆర్, హరీశ్‌రావు

## అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన బిఆర్ఎస్ శ్రేణులు



మాగంటి గోపీనాథ్ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు



ఆదివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సిఎం కెసిఆర్

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), జూన్ 8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నేత మాగంటి గోపీనాథ్(62) కన్నుమూశారు. ఈనెల 5వ తేదీ గురువారం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు గచ్చి బౌలిలోని ఎఐజి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 5:45 నిముషాలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సునీత, కుమారుడు వాత్సల్యనాథ్, కుమార్తెలు అక్షర నాగ, దిశిర ఉన్నారు. గోపీనాథ్ పార్థివదేహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాగంటి గోపీనాథ్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని మహా ప్రస్థానంలో మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో ప్రభుత్వ అధికారిక లాంఛ నాల నడుమ మాగంటి పార్థివదేహానికి అంత్య క్రియలు నిర్వహించారు. మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావులు గోపీనాథ్ అంతిమ సంస్కార కార్య క్రమాల్లో పాల్గొని స్వయంగా పాడె మోసారు.

**కంట తడిపెట్టిన కెసిఆర్..**

ఎమ్మెల్యే గోపీనాథ్ భౌతికకాయాన్ని చూసి కెసిఆర్ కంటతడిపెట్టారు. బి ఆర్ ఎస్‌కు చెం దిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి మృతివార్త తెలియగానే ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి మాదాపూర్‌లోని మాగంటి నివాసానికి చేరుకుని నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మాగంటి గోపీనాథ్ మరణం పార్టీకి తీరనిలోటని ఆయన అన్నారు. ఎంతో కష్టపడి రాజ కీయా ల్లో అంచలంచెలుగా ఎదిగిన గోపీనాథ్ సౌమ్యుడుగా ప్రజా నేతగా పేరు సంపాదించారని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ హైదరాబాద్ నగర సీనియర్ రాజకీయ నాయకుడిగా మాగంటి తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారని కెసిఆర్ గుర్తుచేసుకున్నారు. మాగంటిని కాపాడేందుకు వైద్యులు చేసిన కృషి, పార్టీ తరఫున చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. మాగంటి మరణంతో శోకతప్తులైన కుటుంబసభ్యులు, మిత్రులు, అభిమానులకు కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**పార్టీకి తీరనిలోటు: కెటిఆర్**

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. మృదుస్వభావియైన గోపీనాథ్ మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. ఒక మంచి నాయకుడిని కోల్పో యామని, హైదరాబాద్ అభివృద్ధిలో మాగంటి గోపీనాథ్ కీలకపాత్ర పోషిం చారని తెలిపారు. కుటుంబసభ్యుల అభిప్రాయం మేరకు సాయంత్రం 4 గంటలలోపే అత్యక్రియలు నిర్వహించామన్నారు.

**గోపీనాథ్ మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది : లోకేష్**

ఎమ్మెల్యే గోపీనాథ్ అకాలమృతి బాధాకరమని, తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఆదివారం లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి మాగంటి భౌతికాయానికి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీతోనే మాగంటి గోపీనాథ్ రాజకీయ ప్రస్థానం మొదలైందని, 2014లో టిడిపి తరఫున ఎమ్మెల్యేగా గెలు పొందారని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు విజయం సాధించి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

# తెలంగాణ సోనాకు దేశవ్యాప్త డిమాండ్

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** తెలంగాణలో రైతులు పండిస్తున్న సోనా రకం వరి ధాన్యం దేశ వ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన తెలంగాణ సోనా రకం బియ్యం తక్కువ కాలంలోనే రాష్ట్రంతో పాటు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రతో సహా వివిధ రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. అన్ని వర్గాల ప్రజలు ఈ రకం బియ్యం అన్నం తినేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో వివిధ మార్కెట్లలో సోనా రకానికి రోజు రోజుకూ ఆదరణ లభిస్తుండటంతో వినియోగదారులకు వాటిని అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో దేశంలోని పలు ప్రాంతాల్లో తెలంగాణ సోనా-ఆర్ఎన్ఆర్ 15048 వరి రకం బియ్యం మార్కెటింగ్ చేసేందుకు పలు సంస్థల ముందుకు వస్తున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ సోనా రకాననఇన మార్కెటింగ్ చేసేందుకు కర్నాటక రాష్ట్రంలోని బళ్లారికి చెందిన ఒక రైస్ ఇండస్ట్రీ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఈ ఒప్పందం రెండేళ్ల పాటు కొనసాగనుందని వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు వెల్లడించారు.

# పత్తి విత్తనాలకు కొరత

## దర్శనమిస్తున్న నో స్టాక్ బోర్డులు

## బ్లాక్ చేస్తున్న వ్యాపారులు

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** తెలంగాణలో వానాకాలం సాగు సీజను ప్రారంభమైన నేపథ్యంలో పత్తి విత్తనాలకై రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశంతో పత్తి విత్తనాలకు డిమాండ్ పెరిగింది. దీంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పత్తి విత్తనాలు లభ్యం కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధిక ధరలకు అమ్ముకునేందుకు కొందరు వ్యాపారులు పత్తి విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టిస్తూ నో స్టాక్ బోర్డులు పెడుతున్నట్లు చెబుతున్నారు. అయితే ఈ విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో విత్తనాల కోసం వెళ్లి రైతులకు లేవంటూ విత్తనాల షాపుల నిర్వహకులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఈ సీజనులో 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందుకు గాను పత్తి విత్తనాలు 1.21 కోట్ల ప్యాకెట్లు అవసరం ఉంటుందని లెక్క కట్టింది. వీటిని రైతులకు అందుబాటులో ఉంచాలని ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వం స్పష్టం చేసినా క్షేత్ర స్థాయిలో అది అమలు కావడం లేదు. రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో పత్తి విత్తనాలు లేవని చెప్పడంతో రైతులు ఇటీవల ఆందోళనకు దిగారు. ఈ జిల్లాలో పత్తి ఎక్కువగా సాగు చేస్తారు. పలువురు రైతులు దుకాణాలకు వచ్చి ఆర్‌సీహెచ్ 659 రకానికి చెందిన పత్తి విత్తనాలు కావాలని అడగడంతో లేవని నిర్వహకులు చెప్పారు. వివిధ దుకాణాల్లో నో స్టాక్ బోర్డులు కూడా పెట్టడం చూసి కంగుతిన్నారు. విత్తనాల కోసం మూడు, నాలుగు రోజుల నుండి వస్తున్నా దుకాణాల్లో పత్తి విత్తనాల దొరకడం లేదని వాపోతున్నారు. మరికొన్ని జిల్లాల్లో 475 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్‌ను 864 రూపాయలకు గాను వెయ్యి రూపాయల నుండి 1,300 రూపాయలకు పైబడి అవసరం, అవకాశాన్ని బట్టి అమ్ముతున్నట్లు తెలుస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కొందరు అక్రమార్జనపరులు మంచి విత్తనాల్లో నాసిరకం కలుపుతూ రైతులకు అంటగడుతున్నారు. ప్రధానంగా నిషేధిత బిటి 3 పత్తి విత్తనాలను కొందరు అక్రమార్కులు రైతులకు అండగడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, నంద్యాలతో పాటు, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాల నుండి నకిలీ పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తూ వాటిని ప్యాకింగ్‌లు చేసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రైతులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. కిలో పత్తి విత్తనాలను 2 వేల రూపాయల నుండి 2,500 రూపాయల వరకూ విక్రయిస్తున్నట్లు రైతులు అంటున్నారు.

# గ్రేటర్ పరిధిలో ఎస్టీ బాలబాలికల హాస్టళ్లు మంజూరు చేయాలి

## సిఎంకు లేఖ ద్వారా ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాలేజీలలో చదివే ఎస్టీ బాలుర కోసం, బాలికల కోసం ప్రత్యేక హాస్టల్స్‌ను మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన తెలంగాణ ముఖ్యమంత్రికి ఒక లేఖ వ్రాశారు. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో ఎస్టీ విద్యార్థులకు హాస్టళ్లు కేవలం 25 లోపు మాత్రమే ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. హాస్టళ్లు తక్కువ ఉండటం వల్ల ఎస్టీ విద్యార్థులకు అవి సరిపోక, ప్రైవేట్ హాస్టల్స్‌లో ఉండే ఆర్థిక స్థోమత లేక మధ్యలోనే చదువును ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థులు ఇప్పుడిప్పుడే ఉన్నత విద్యను అభ్యసించటానికి ముందకు వస్తున్నారు కాబట్టి, వారికి చదువుకునే అవకాశాలు కల్పించి, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. కాలేజీ కోర్సులు చదివే ఎస్టీ అమ్మాయిలకు హైదరాబాద్‌లో 5, రంగారెడ్డిలో 4, మేడ్చల్‌లో 4 కాలేజీ హాస్టల్స్ మంజూరు చేయాలని, అదేవిధంగా ఎస్టీ అబ్బాయిలకు కూడా హైదరాబాద్‌లో 5, రంగారెడ్డిలో 4, మేడ్చల్‌లో 4 హాస్టల్స్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థతో దేశవ్యాప్తంగా తగ్గిన వాహనాల చోరీలు

## అనేక ఘటనల్లో గంట నుంచి మూడు గంటల వ్యవధిలోనే పట్టుబడిన దొంగలు



జిపిఎస్ వ్యవస్థ ఉన్న ఉపకరణం


**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** పోలీసు గణాంకాలలో చోరీలకు ప్రత్యేక స్థానం వుంది. ప్రతీయేటా పోలీసులు వెల్లడించే వార్షిక నివేదికలో చోరీలదే అగ్రభాగంగా వుండడం తెలిసిందే. అయితే ఈ చోరీలలో మెజారిటీ కేసులు నివారించే వీలున్నా అనేక కారణాల వల్ల ఇది సాధ్యమవడం లేదు. ఇందులో ఇళ్లలో జ రిగే చోరీలు ఒకటి కాగా రెండవది వాహనాల దొంగతనాలు, ఇళ్లలో జరిగే చోరీలను హౌస్ బ్రేకింగ్ (హెచ్‌బి)గా పిలుస్తారు. ఇళ్లకు ధృడమైన తలుపులు, కిటికీల తో పాటు వెంటిలేటర్లు అమర్చడం ద్వారా వీటిని నివారించే వీలుందని పోలీసులు పదే పదే చెబుతున్నా ఈ విషయంలో పోలీసుల చైతన్య కార్యక్రమాలు కొంతమేరకే ఫలితాలిస్తున్నాయి. ఇక రెండవ చోరీల వరకు వస్తే వాహనాల దొంగతనాలు. పోలీసులకు ఏళ్ల తరబడి శిరోభారంగా మారిన వాహనాల చోరీలు ఇటీ వల కాలంలో చాలా వరకు తగ్గాయి. కొత్తగా అందుబాటులోకి వచ్చిన జిపిఎస్ వ్యవస్థ వల్ల వాహనాల చోరీలు చాలా వరకు తగ్గించిందని జాతీయ నేర రికార్డు ల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాలు చెబుతున్నాయి. ఖరీదైన కార్లతో పాటు ఇతర వాహనాలకు ఇటీవల కాలంలో వాహనదారులు జిపిఎస్‌ను వాడడం బాగా పెరగడం వల్ల వాహనాల దొంగతనాలు తగ్గాయని పోలీసులు చెబుతున్నారు.

ఆయా నగరాలకు చెందిన పోలీసులు వాహనాలకు జిపిఎస్ వ్యవస్థను వాడేందుకు వాహనదారులను ఒప్పించడం వల్లే ఇది సాధ్యమయ్యింది. తక్కువ ధరకు అంటే 1500 రూపాయల నుంచి ఐదారు వేల రూపాయలలోపు జిపిఎస్ వ్యవస్థకు స ంబంధించిన ఉపకరణాలు మార్కెట్లో లభిస్తున్నాయి. వాహనదారులు వీటిని కొని పోలీసుల సూచనల మేరకు తమ వాహనాలలో అమర్చుకుంటే వాహనాల చో రీలను నివారించే వీలుంటుంది. వాహనాలను కొన్నపుడే జిపిఎస్ ఉపకరణాలను కొని వాహనాలకు అమర్చుకుంటే మంచిదని పోలీసు అధికారులు చెబుతున్నారు . అయితే తమ వాహనంలో జిపిఎస్ వ్యవస్థ వున్న విషయాన్ని వాహనదారులు బహిరంగ పరచవద్దని వారు కోరుతున్నారు.

ఇటీవల కాలంలో జిపిఎస్ ఉపకర ణాలు వున్న వాహనాలు చోరీకి గురైన సందర్భాలలో గంట నుంచి మూడు గంటల వ్యవధిలోనే అవి ఎక్కడ , ఏ పొజిషన్‌లో వున్నాయో...? పోలీసులు కనుగొంటున్నారు. జిపిఎస్ ఉపకరణాలు ట్రాకర్ శాటిలైట్ సిగ్నల్స్ సాయంతో అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా చోరీ అయిన వాహనం ఎక్కడ వున్నా కచ్చితంగా గుర్తించే వీలుంటుందని పోలీసులు చెబుతున్నారు. జిపిఎస్ ఉపకరణాలను బయటకు కనిపించకుండా బిగించి, బ్యాటరీకి అనుసంధానిస్తారు. వీటిని తమ సెల్‌ఫోన్‌లలో గల సిం కార్డులకు రీఛార్జి చేసుకోవాల్సి వుంటుంది. ఇక జిపిఎస్‌కు సంబంధించిన సమాచారం మొబైల్ యాప్, వెబ్ ప్లాట్ ఫాంల ద్వారా వాహనదా రులకు సమాచారం అందుతుంది.

ఇక జిపిఎస్ అమర్చిన వాహనం దొంగతనానికి గురైతే కచ్చితమైన స్థానాన్ని ప్రత్యక్షంగా (రియల్ టైంలో) చూపిస్తుందని పోలీ సులు అంటున్నారు. పార్కింగ్ చేసిన ప్రాంతం నుంచి కదిలిస్తే వాహనదారుడి ఫోన్‌కు వార్నింగ్ వస్తుంది. అనంతరం చోరీకి గురైన వాహనం ఏ దిక్కున వెళ్లిం ది...? కూడా చెబుతుంది. ఇక ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన అధునాతన జిపిఎస్ ఉపకరణాలతో చోరీకి గురైన వాహనాలను వాటి యజమానుల ను ఆపివేసే సౌకర్యం కూడా వుంది. జిపిఎస్ అమర్చిన వాహనాలు చోరీకి గురైతే వాటి యజమానులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు తమ వద్ద జిపిఎస్ ట్రాకర్ వల్ల అందిన సమాచారాన్ని చెప్పాలి. దీనివల్ల పోలీసులు చోరీకి గురైన వాహనం ఎక్కడ వుందనేది తెలుసుకుని అక్కడి పోలీసులను అప్రమ త్తం చేసి, వాహనంతో పాటు నేరగాళ్లను కూడా వెంటనే పట్టుకునేందుకు వీలుంటుంది.

కొన్నేళ్లుగా పోలీసు గస్తీ వాహనాలకు జిపిఎస్ వ్యవస్థను అందుబాటులో తేవడం వల్ల పోలీసులు సరిగ్గా డ్యూటీ చేస్తున్నారా...? లేదా మరేదైనా ప్రాంతంలో షికార్లు చేస్తున్నారా...? అనేది కంట్రోల్ రూం సిబ్బంది తెలుసుకుంటున్నా రు. వాహనాలకు జిపిఎస్ అందుబాటులో వుండడం అనేది చాలా కాలంగా వున్నా గడచిన రెండేళ్ల కాలంలో వీటి వాడకం ఎక్కువగా వుంది. దీనివల్ల దేశ రాజ ధాని ఢిల్లీతో పాటు హైదరాబాద్, ముంబాయి, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా విజయవాడ, వైజాగ్ సహా పలు నగరాలలో వాహనాల చోరీలు చాలా వరకు తగ్గా యని ఎన్‌సిఆర్‌బి గణాంకాలు చెబుతున్నాయి.



## చైనా యువతుల్లో పెరుగుతున్న 'మాన్‌మమ్' హగ్స్

**బీజింగ్, జూన్ 8:** ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి అనేది సర్వసాధారణ సమస్యగా మారింది. దీనిని అధిగమించేందుకు ఒక్కొక్కరూ ఒక్కో మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో చైనాలోని యువతులు ఓ వినూత్న పద్ధతిని అనుసరిస్తున్నారు. తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు, మానసిక సాంత్వన కోసం డబ్బులు చెల్లించి మ్యాన్ మమ్స్అని పిలవబడే వ్యక్తుల నుంచి కొద్దిసేపు కౌగిలింతలు పొందుతున్నారు. ఈ సేవలకు గాను సుమారు 50 యువాన్లు (భారత కరెన్సీలో దాదాపు 600 రూపాయలు) చెల్లిస్తున్నారు. గతంలో మ్యాన్ మమ్స్ అనే పదాన్ని కండలు తిరిగిన శరీరంతో జిమ్‌లో కసరత్తులు చేసే పురుషులను ఉద్దేశించి వాడేవారు. అయితే, ఇప్పుడు ఈ పదం అర్థం మారింది. శారీరకంగా ధృడంగా ఉంటూనే, సున్నితత్వం, ఓర్పు, ఆప్యాయత వంటి లక్షణాలున్న పురుషులను మ్యాన్ మమ్స్‌గా పరిగణిస్తున్నారు. వీరు అందించే కౌగిలింతలు ఒత్తిడిని తగ్గించి, ఓదార్పునిస్తాయని యువతులు భావిస్తున్నారు. ఈ సేవలను చాట్ యాప్‌ల ద్వారా ఏర్పాటు చేసుకుంటున్నారు. సాధారణంగా రద్దీగా ఉండే షాపింగ్ మాల్స్ లేదా సబ్‌వే స్టేషన్ల వంటి బహిరంగ ప్రదేశాలలో ఈ కౌగిలింతల సెషన్లు జరుగుతాయి. కేవలం ఐదు నిమిషాల పాటు సాగే ఈ కౌగిలింత, ఒత్తిడితో కూడిన సమయాల్లో మానసిక ఉపశమనాన్ని అందిస్తుందని మహిళలు తెలుపుతున్నారు. ఇటీవల, థీసిస్ కారణంగా తీవ్ర ఒత్తిడికి లోనైన ఒక విద్యార్థిని, తనకు ఓదార్పునిచ్చేందుకు దయగల, ఫిట్‌గా ఉండే మ్యాన్ మమ్ నుంచి కౌగిలింత కావాలని, అందుకు డబ్బులు చెల్లిస్తానని ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసింది. నాకు సెకండరీ స్కూల్‌లో ఉన్నప్పుడు ఒకసారి ఇలాగే కౌగిలించుకుంటే చాలా సురక్షితంగా అనిపించింది. మనం ఒక అండర్‌గ్రౌండ్ స్టేషన్‌లో ఐదు నిమిషాలు కౌగిలించుకుంటే చాలని ఆమె రాసుకొచ్చింది. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ అయింది, లక్షకు పైగా కామెంట్లు వచ్చాయి. సోషల్ మీడియాలో మ్యాన్ మమ్ కోసం వెతికితే, ప్రధాన నగరాల్లోని అనేక మంది మహిళలు ఇలాంటి సేవలను కోరుతూ పెట్టిన పోస్టులు కనిపిస్తున్నాయి. వీరు మ్యాన్ మమ్స్‌ను వారి ప్రవర్తన, ఓపిక, శరీర ఆకృతి, మరియు రూపం ఆధారంగా ఎంచుకుంటున్నారు. కలవడానికి ముందు వారితో ప్రైవేట్‌గా చాట్ చేస్తున్నారు. పొడవుగా, అథ్లెటిక్‌గా ఉండే కొంతమంది మహిళలను కూడా ఈ సేవల కోసం సంప్రదిస్తున్నారని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పేర్కొంది. ఈ కౌగిలింతలకు 20 నుంచి 50 యువాన్ల (సుమారు 250 నుంచి 600 రూపాయలు) వరకు వసూలు చేస్తున్నారు. ఒక మహిళ మాట్లాడుతూ, మూడు గంటల పాటు ఓవర్‌టైమ్ పని చేసిన తర్వాత, ఒక మ్యాన్ మమ్‌ను కలుసుకున్నానని, అతను మూడు నిమిషాల పాటు తనను కౌగిలించుకుని, తన బాస్ గురించి తాను ఆవేదన వ్యక్తం చేస్తుండగా నెమ్మదిగా భుజం తట్టాడని తెలిపింది. ఈ పరిణామం చైనాలో మారుతున్న సామాజిక పోకడలకు, ఒత్తిడిని ఎదుర్కొనేందుకు యువతరం ఎంచుకుంటున్న నూతన మార్గాలకు అద్దం పడుతోంది.

## కర్ఫ్యూ,ఇంటర్నెట్ బంద్‌కు దారితీసిన జాతుల వైరం!

**ఇంఫాల్, జూన్ 8:** జాతుల వైరంతో కొద్దికాలంగా అట్టుడుకుతూ వచ్చిన మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. మైయితీ సంస్థ అయిన అరాంబాయ్ టెంగోల్ కు చెందిన పలువురు నేతలను అరెస్టు చేశారన్న వార్తల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు చోట్ల నిరసనలు, హింసాత్మక ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. దీంతో ఐదు జిల్లాలో ఇంటర్నెట్, మొబైల్ డేటా సర్వీసులను అధికార యంత్రాంగం నిలిపివేసింది. బిష్ణుపూర్ జిల్లాలో కర్ఫ్యూ విధించింది. అరెస్టు చేసిన నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు ఇంఫాల్‌లోని కావాకేథేల్, యురిపోక్‌లో రోడ్లపైకి వచ్చారు. టైర్లు, పాత సామగ్రికి నిప్పుపెట్టారు. దీంతో నిరసనకారులు, భద్రతా బలగాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కావాకేథేల్ ఔట్‌పోస్టుపై ఆందోళనకారులు దాడికి దిగారు. ఈ ఘర్షణల్లో ఇద్దరు జర్నలిస్టులు, ఒక పౌరుడు గాయపడ్డారు. అరాంబాయ్ టెంగోల్‌కు చెందిన ఐదుగురు వలంటీర్లను ఎన్ఐఏ అరెస్టు చేసినట్టు వార్తలు రావడంతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే ఈ అరెస్టులను అధికారికంగా ఇంకా ధ్రువీకరించలేదు. నిరసనల నేపథ్యంలో ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, తౌబల్, బిష్ణుపూర్, కాక్‌చింగ్ జిల్లాల్లో శనివారం రాత్రి 11.45 నుంచి ఐదు రోజులపాటు ఇంటర్నెట్, మొబైల్ డేటా, వీఎస్ఏటీ, వీపీఎన్ సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. బిష్ణుపూర్ జిల్లాలో అయితే కర్ఫ్యూ కూడా విధించారు.

శాంతి భద్రతల సమస్యలుంటాయని, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసే అవకాశాలున్నాయనే కారణంగా ఈ ఆంక్షలు విధిస్తున్నామని, వీటిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోం శాఖ కమిషనర్ కమ్ సెక్రటరీ ఎన్.అశోక్ కుమార్ తెలిపారు. కాగా, నిరసనలు, ఆందోళనలు చోటుచేసుకున్న జిల్లాల్లో భద్రతా బలగాలను మోహరించగా.. అల్లరిమూకను చెదరగొట్టేందుకు బలగాలు పలురౌండ్లు గాలిలో కాల్పులు జరిపారు. అల్లర్లు విస్తరించకుండా అదనపు బలగాలను మోహరించినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఆరాంబాయ్ టెంగోల్ అనేది మణిపూర్ ప్రాంతంలో చురుకుగా ఉన్న మైయితీ యూత్ గ్రూప్. జాతుల ఘర్షణ సమయంలో కమ్యూనిటీ మొబిలైజేషన్‌లో కీలక భూమిక పోషించినట్టు చెబుతుంటారు. ఇటీవల చోటుచేసుకున్న అలజడుల్లో వీరి ప్రమేయం ఉందన్న ఆరోపణలు రావడం, వీరిలో కొందరిని అరెస్టు చేయడం తాజా ఉద్రిక్తతలకు కారణమవుతోంది.

# ఇంటివాడవుతున్న ఐపిఎల్ క్రికెటర్!

### క్రికెటర్ రింకూసింగ్, ఎంపి ప్రియాసరోజ్‌ల నిశ్చితార్థం



**లక్నో, జూన్ 8:** భారత క్రికెటర్ రింకూసింగ్, సమాజ్ వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్ నిశ్చితార్థం వేడుక ఘనంగా జరిగింది. లక్నోలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి కుటుంబీకులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరు కాగా పలువురు రాజకీయ నేతలు, క్రీడాకారులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరిద్దరి వివాహం ఈ నెల 18న జరుగనున్నది. సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌డింపుల్ యాదవ్ దంపతులు, ప్రముఖ నటి, ఎంపీ జయాబచ్చన్ హాజరై జంటను ఆశీర్వదించారు. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాకూడా హాజరయ్యారు. బిసిసిఐ శుక్లా మాట్లాడుతూ రింకు, ప్రియా ఇద్దరు తమతమ రంగాల్లో రాణిస్తున్నారని ఇద్దరు కలిసి విజయవంతమైన జంటగా నిలుస్తారన్నారు. వారిద్దరు ఆనందకరమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రియా సరోజ్ తండ్రి, ఎమ్మెల్యే తుఫానీ సరోజ్ మాట్లాడుతూ.. నిశ్చితార్థం కార్యక్రమానికి కుటుంబీకులు, బంధువులు, పలువురి స్నేహితుల సమక్షంలో జరిగిందన్నారు.

రింకు - ప్రియా సింగ్ ఒకరినొకరు కొంతకాలం నుంచి పరిచయం ఉందని.. ప్రియా స్నేహితురాలి తండ్రి మాజీ క్రికెటర్ అని, ఆయన ద్వారానే ఇద్దరికీ పరిచయం ఏర్పడింద న్నారు. ఇరు కుటుంబాల ఆశీస్సులతో ఇద్దరు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారన్నారు. రింకు సింగ్ టీమిండియా తరఫున ఇప్పటి వరకు రెండు వన్డేలు, 33 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో కేకేఆర్ జట్టులో సభ్యుడు. ఇక ప్రియా సరోజ్ ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసికి చెందిన కర్ఖియాన్ గ్రామవాసి. ఆమె తండ్రి తూఫానీ సరోజ్ మూడుసార్లు ఎంపీగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఆయన వార సురాలిగా ప్రియా సరోజ్ మచిలీషహార్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తొలి ప్రయత్నంలోనే ఎంపీగా గెలిచింది. బీజేపీ సీనియర్ నేతపై 35వేల ఓట్ల మెజారిటీతో గెలిచి దేశంలోనే అతిపిన్న వయస్కురాలైన ఎంపీలో ఒకరిగా నిలిచారు. ప్రియాసరోజ్ గతంలో సుప్రీంకోర్టు న్యాయవాదిగా కూడా కొనసాగారు. కాగా వీరివివాహం నవంబరు 18న వారణాసిలో సాంప్రదాయబద్ధంగా జరుగనున్నది. క్రికెట్, బాలివుడ్, వ్యాపార, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులందరూ ఈ వివాహ వేడుకకు ఆహ్వానించనున్నారు.


# మహిళా సాధికారతకే అధిక ప్రాధాన్యం

### పదకొండేళ్లలో గణనీయ ప్రగతి సాధించాం

### ఉజ్వల్ సిలిండర్ల నుంచి ముద్రా రుణాల దాకా ఎన్నో పథకాలు అమలు : ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 8:** మహిళా సాధికారత లక్ష్యంగా 11 ఏళ్లలో అవిరళ కృషిచేసిందని ప్రధానిమోడీ గుర్తుచేసుకున్నారు. అన్నిరంగాల్లోను అంటే సైన్స్, విద్య, క్రీడలు, స్టార్టప్స్, సాయుధ దళాల్లోకూడా మహిళలు అద్భుత పాత్రలు పోషిస్తున్నారని, భావితరాలకు స్ఫూర్తిని నింపుతున్నారని మోడీ తన సోషల్‌మీడియా 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌పై పోస్టుచేసారు. కేవలం మహిళల సంక్షేమం కోసమే కొన్ని ప్రత్యేక పథకాలు అమలుచేసినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛభారత్‌నుంచి ఆర్థిక సమ్మిళితం పరిధిలో జన్‌ధన్ ఖాతాలు వంటివి మహిళా సాధికారతకు పేరుగా నిలిచాయని అన్నారు. మహిళలకు కట్టెల పొయ్యి ఇబ్బందులను తప్పించేందుకు వీలుగా ఉజ్వల్‌యోజన కింద సబ్సిడీ సిలిండర్లను అందించామని, మహిళా పారిశ్రామికవేత్తలకోసం ముద్రా రుణాలను అందుబాటులోకి తెచ్చినట్లు మోడీ వెల్లడించారు. పిఎం ఆవాస్‌యోజనలో మహిళల పేరు మీదనే ఇళ్లు మంజూరు అయ్యాయని, బేటీ బచావో బేటీ పఢావో కింద బాలికల విద్యకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు బాలికల సంరక్షణకు జాతీయ స్థాయిలో ఉద్యమాన్నే తీసుకువచ్చినట్లు తెలిపారు. జననాల రేటు ప్రతిలక్షలో 93కి తగ్గించామని, గృహిణులకు సుజల నల్లానీటి సౌకర్యం అందించి 15.46 కోట్లమందికి నల్లాసౌకర్యం కల్పించినట్లు తెలిపారు. 2019 నాటికి 3.23 కోట్లమంది ఉన్నవారు 2025 మేనాటికి 15.64 కోట్లకు పెరిగారని హర్షం ప్రకటించారు.
పదికోట్లమందికి వటగ్యాస్ కనెక్షన్లు ఉజ్వల స్కీం కిందనే పంపిణీచేసినట్లు మోడీ తన ఎక్స్ ఖాతాలో వివరించారు. సమాజంలోని విభిన్నరంగాలకు తమ సంకీర్ణ ఎన్డీయే కూటమి అందించిన సేవలను ఆయన ఈసందర్భంగా ప్రస్తావించారు. నిరుపేదలు, రైతులు, యువత లక్ష్యంగా అనేక సంక్షేమ, ఆర్థికలబ్ది పథకాలను అమలుకు తెచ్చినట్లు మోడీ వివరించారు. మహిళల సంక్షేం కోసమే 1.81 లక్షలకోట్ల రూపాయలతో మిషన్‌పోషన్ 2.0.,గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, కౌమారదశ బాలికలు, పిల్లలకు పోషకాహారంవంటి వాటిని గణనీయంగా అమలుచేసినట్లు మోడీ తన విడియోలో వివరించారు. అంగన్‌వాడికింద వేలాదిగా అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్‌చేసినట్లు చెప్పుకొచ్చారు. లింగనిష్పత్తి బేరీజువేస్తూ బాలికల విద్య కూడా పెరిగింది. సుకన్య సమృద్ధియోజనలో 4.2 కోట్లకుపైగా కుటుంబాలు తమ కుమార్తెల భవిష్యత్తునుసురక్షితంగా ఉంచడంలో సహాయపడిందని అన్నారు. ప్రధాని ముద్రయోజనతో 52కోట్లకుపైగా రుణఖాతాల్లో 68శాతం మహిళలకే మంజూరుచేసినట్లు తెలిపారు. స్టాండ్‌అప్ ఇండియాకింద మంజూరుచేసిన రుణాల్లో 83శాతం మహిళా వ్యవస్థాపకులకే అందించామని, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, లక్‌పతి దీదీ కార్యాచరణద్వారా 1.48 కోట్లకుపైగా గ్రామీణ మహిళలు లక్షాధికారులయ్యేందుకు తోడ్పాటునిచ్చినట్లు ఎన్డీయే కూటమి ప్రభుత్వం 11 ఏళ్ల ప్రగతినివేదికను విడుదలచేసింది. జమ్ముకాశ్మీర్‌లో 370వ అధికరణం రద్దు, ట్రిపుల్ తలాక్‌రద్దు, చట్టబద్ధ మైన వివాహ వయస్సు 21ఏళ్లకు పెంచడం, 26 వారా లా ప్రసూతి సెలవు, సమాన ఆస్తిహక్కులు అన్నీ వమి ళలక చట్టబద్ధంగా సామాజికంగా సాధికారత కల్పించే మైలురాయిగా మార్పులు తెచ్చినట్లు మోడీ ప్రస్తావించారు.

# అఖిల్-జైనాబ్ పెళ్లి రిసెప్షన్‌కు హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి



అన్నపూర్ణ స్టూడియోలో సినీనటుడు అక్కినేని నాగార్జున కుమారుడు అఖిల్ వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8:** అక్కినేని కుటుంబంలో పెళ్లి సందడి కొనసాగుతోంది. యువ కథానాయకుడు అక్కినేని అఖిల్, జైనాబ్‌ల వివాహ రిసెప్షన్ హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరై అఖిల్, జైనాబ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ సినీ నటుడు మహేశ్‌బాబు తన అర్ధాంగి నమ్రతతో కలిసి విచ్చేయగా, తమిళ స్టార్ హీరో సూర్య, యువ దర్శకుడు వెంకీ అట్లూరి తదితరులు కూడా ఈ వేడుకలో పాలుపంచుకుని నవ దంపతులకు తమ ఆశీస్సులు అందించారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఉపాసన, నాని, నిఖిల్, దర్శకులు సుకుమార్, బుచ్చిబాబు సానా తదితరులు కూడా విచ్చేశారు. వీరితో పాటు మరికొంతమంది సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు ఈ వివాహ విందులో పాల్గొని సందడి చేశారు.
అన్నపూర్ణ స్టూడియోస్ ప్రాంగణం ప్రముఖుల రాకతో కళకళలాడింది. అభిమానులు కూడా సోషల్ మీడియా వేదికగా అఖిల్, జైనబ్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకకు సంబంధించిన కొన్ని ఆకర్షణీయమైన ఫోటోలను అన్నపూర్ణ స్టూడియోస్ తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకోగా, అవి ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన, శుక్రవారం నాడు, అఖిల్, జైనాబ్‌ల వివాహం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నాగార్జున నివాసంలో నిరాడంబరంగా జరిగిన విషయం తెలిసిందే. వివాహానంతరం ఏర్పాటు చేసిన ఈ రిసెప్షన్ వేడుకకు పలువురు రాజకీయ, సినీ, క్రీడా రంగ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# డాక్టర్ షకీల్ అఫ్రిదీని వెంటనే విడుదల చేయాలి

### ఎంపి శశిథరూర్ డిమాండ్

**వాషింగ్టన్, జూన్ 8:** ప్రపంచాన్ని వణికించిన అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థ అగ్రనేత ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చేందుకు అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)కి సమాచారం అందించి సాయపడిన పాకిస్థానీ వైద్యుడు డాక్టర్ షకీల్ అఫ్రీదీ పట్ల పాకిస్థాన్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ తీవ్ర




అభ్యంతరం వ్యక్తం చేశారు. డాక్టర్ అఫ్రీదీని తక్షణమే విడుదల చేయాలంటూ అమెరికా చట్టసభ సభ్యుడు బ్రాడ్ షెర్మన్ చేసిన డిమాండ్‌కు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు శశి థరూర్ ఎక్స్‌వేదికగా స్పందించారు. పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి వివరించేందుకు శశి థరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష కమిటీ ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తోంది. అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు బ్రాడ్ షెర్మన్, డాక్టర్ షకీల్ అఫ్రీదీ నిర్బంధం విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై స్పందించిన థరూర్, "బ్రాడ్ షెర్మన్ డిమాండ్‌ను మేము స్వాగతిస్తున్నాం. పాకిస్థాన్, బిన్ లాడెన్‌కు ఆశ్రయం కల్పించింది. ఆయన ఎక్కడ ఉన్నాడన్న రహస్యాన్ని బయటపెట్టాడన్న ఆరోపణలతో ఓ వైద్యుడిని అక్రమంగా అరెస్టు చేసి, చిత్రహింసలకు గురిచేస్తోంది. ఒకవేళ ఆ వ్యక్తే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి ఉంటే, వారికి అవార్డులు, రివార్డులు దక్కేవంటూ పాకిస్థాన్ వైఖరిని తప్పుబట్టారు. పాక్ సైన్యాధ్యక్షుడు జనరల్ ఆసిం మునీర్‌కు దేశ అత్యున్నత సైనిక హోదా అయిన 'ఫీల్డ్ మార్షల్'గా పదోన్నతి కల్పించిన విషయాన్ని థరూర్ పరోక్షంగా ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు.
డాక్టర్ షకీల్ అఫ్రీదీని విడుదల చేయాలని పాకిస్థాన్ నాయకత్వానికి శశి థరూర్ విజ్ఞప్తి చేశారు. ఒకవేళ అఫ్రీదీ విడుదలైతే, అది 9/11 నాటి, ముంబయి ఉగ్రదాడుల బాధితులకు న్యాయం చేయడంలో ఒక ముందడుగు అవుతుందని ఆయన అన్నారు. పాకిస్థాన్‌కు చెందిన వైద్యుడైన షకీల్ అఫ్రీదీ, ఒసామా బిన్ లాడెన్ కుటుంబ సభ్యుల డీఎన్ఏ నమూనాలను సేకరించేందుకు సీఐఏ నిర్వహించిన నకిలీ పోలియో టీకా కార్యక్రమంలో పాలుపంచుకున్నారని ఆరోపణలున్నాయి. ఈ సమాచారం ఆధారంగానే, 2011 మే నెలలో అమెరికా నేవీ సీల్స్ పాకిస్థాన్‌లోని అబోట్టాబాద్ మిలిటరీ కంటోన్మెంట్ సమీపంలోని ఓ రహస్య స్థావరంలో నక్కిన ఒసామా బిన్ లాడెన్‌పై దాడి చేసి మట్టుబెట్టాయి.
ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి అఫ్రీదీ అందించిన సమాచారమే కారణమని భావించిన పాకిస్థాన్ నిఘా వర్గాలు, ఆయన్ను వెంటనే అరెస్టు చేశాయి. దేశద్రోహం ఆరోపణలపై విచారణ జరిపిన అక్కడి కోర్టు, 2012లో అఫ్రీదీకి 33 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. అప్పటి నుంచి ఆయన జైలు జీవితం గడుపుతున్నారు. ఆయన విడుదల కోసం అమెరికా పలుమార్లు డిమాండ్ చేసినప్పటికీ, పాకిస్థాన్ ప్రభుత్వం ససేమిరా అంటోంది. తాజాగా శశి థరూర్ కూడా ఈ డిమాండ్‌కు గొంతు కలపడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# బెలూచిస్థాన్ ఉద్యమ అణిచివేతకు 'ఉగ్రవాద' సవరణ చట్టం!



**క్వెట్టా, జూన్ 8:** పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్‌లో వేర్పాటువాద ఉద్యమాన్ని నియంత్రించేందుకు పాక్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తరచూ వివాదాస్పదమవుతున్నాయి. తాజాగా, బెలోచిస్థాన్ అసెంబ్లీ ఆమోదించిన ఉగ్రవాద వ్యతిరేక (సవరణ) చట్టం 2025, స్థానికంగా తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. పౌరులు, మానవ హక్కుల సంఘాలు ఈ చట్టంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బలూచ్ పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ చట్టాన్ని రూపొందించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కొత్త నిబంధనల ప్రకారం, ఎటువంటి నేరారోపణలు లేదా కేసులు నమోదు కాకపోయినా, కేవలం అనుమానం ఆధారంగా వ్యక్తులను అదుపులోకి తీసుకునే అధికారం పాకిస్థాన్ సైన్యానికి, నిఘా సంస్థలకు దఖలు పడుతుంది. అరెస్టు చేసిన వారిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టకుండానే 90 రోజుల వరకు నిర్బంధంలో ఉంచవచ్చు. అంతేకాకుండా, కోర్టుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే సోదాలు నిర్వహించడానికి, వస్తువులు స్వాధీనం చేసుకోవడానికి, వ్యక్తులను నిర్బంధించడానికి అవసరమైన ఆదేశాలు జారీ చేసేందుకు పోలీసు, నిఘా సంస్థల అధికారులతో కూడిన సంయుక్త దర్యాప్తు బృందాలకు (జేఐటీ) ఈ చట్టం అధికారం కల్పిస్తోంది. కేవలం ఖిఅనుమానంఖి ఆధారంగా అరెస్టులు చేసే వెసులుబాటు కల్పించడం పట్ల పౌర సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ చట్టం ద్వారా పౌరులకు రాజ్యాంగబద్ధంగా లభించే న్యాయపరమైన రక్షణ పూర్తిగా కరువవుతుందని న్యాయ నిపుణులు, మానవ హక్కుల కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. గతంలో ప్రభుత్వ బలగాలు నీడచాటున, అనధికారికంగా సాగించిన చర్యలనే ఇప్పుడు చట్టబద్ధం చేశారని వారు ఆరోపిస్తున్నారు. ఈ చర్యలు అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలను, పాకిస్థాన్ రాజ్యాంగం కల్పించిన పౌర రక్షణలను పూర్తిగా ఉల్లంఘించడమేనని స్థానిక మానవ హక్కుల కమిషన్ ఆఫ్ పాకిస్థాన్ (హెచ్‌ఆర్‌సీపీ)తో పాటు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ వాచ్, ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ సివిల్ అండ్ పొలిటికల్ రైట్స్ (ఐసీసీపీఆర్) వంటి అంతర్జాతీయ హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బలోచిస్థాన్‌లో బలవంతపు నిర్బంధాలు, వ్యక్తులు అదృశ్యమవడం వంటి ఘటనలు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. తమ ఆప్తులు ఏమయ్యారో తెలియక అనేక కుటుంబాలు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాయి. ఈ అదృశ్యాల వెనుక ప్రభుత్వ హస్తం ఉందనేది బహిరంగ ఆరోపణ. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకురావడం బలూచ్ పౌరులలో మరింత భయాందోళనలను రేకెత్తిస్తోందని పరిశీలకులు అంటున్నారు. ఈ పరిణామాలపై మానవ హక్కుల సంస్థ బలోచ్ యక్జైజీ కమిటీ (బీవైసీ) తీవ్రంగా స్పందించింది. ఈ చట్టంలోని నిబంధనలు వ్యక్తిగత స్వేచ్ఛకు, ఏకపక్ష నిర్బంధాల నుంచి పౌరులకు లభించాల్సిన రక్షణ హక్కుకు పూర్తిగా విఘాతం కలిగిస్తున్నాయని ఆ సంస్థ తీవ్రంగా విమర్శించింది.



# హనీమూన్ జంట అదృశ్యంపై సిబిఐ దర్యాప్తు

### కుళ్లిన స్థితిలో భర్త మృతదేహం లభ్యం

### భార్య ఆచూకీ కోసం గాలిస్తున్న బృందాలు

**షిల్లాంగ్, జూన్ 8:** మేఘాలయలో హనీమూన్ కోసం వెళ్లిన ఇండోర్ జంట అదృశ్యం ఘటనలో మిస్టరీని ఛేదించేందుకు సిబిఐ దర్యాప్తునకు అప్పగిస్తూ మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ లేఖరాసారు. ఈ దంపతుల్లో భర్త మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యం కాగా, భార్య ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించి తాజాగా వెలుగులోకి వస్తున్న వివరాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఈ జంట అదృశ్యమైన రోజున, వారి వెంట మరో ముగ్గురు పురుషులు ఉన్నట్లు ఒక టూరిస్ట్ గైడ్ తాజాగా వెల్లడించడం ఈ కేసులో కీలక మలుపుగా మారింది. ఆల్బర్ట్ ప్డే అనే గైడ్, రాజా రఘువంశీ, ఆయన భార్య సోనమ్‌లను మే 23న ఉదయం సుమారు 10 గంటల సమయంలో నాన్‌గ్రియాట్ నుంచి మావ్లాయాట్ వైపు 3,000 మెట్లను ఎక్కుతుండగా చూశానని తెలిపారు. అంతకు ముందు రోజు తాను వారికి గైడ్‌గా సేవలందిస్తానని చెప్పగా, వారు సున్నితంగా తిరస్కరించారని ఆల్బర్ట్ గుర్తు చేసుకున్నారు. ఆ నలుగురు పురుషులు ముందు నడుస్తుండగా, మహిళ వారి వెనుక వస్తున్నారు. ఆ నలుగురు హిందీలో మాట్లాడుకుంటున్నారు. కానీ నాకు ఖాసీ, ఇంగ్లిష్ మాత్రమే తెలుసు కాబట్టి వారేం మాట్లాడుకుంటున్నారో అర్థం కాలేదని ఆల్బర్ట్ ప్డే చెప్పినట్లు తెలుస్తోంది. తాను మావ్లాయాట్ చేరుకునే సమయానికి వారి స్కూటర్ అక్కడ లేదని, వెంటనే పోలీసులకు తెలియజేశానని గైడ్ పేర్కొన్నాడు. నవ దంపతులు అద్దెకు తీసుకున్న స్కూటర్ మావ్లాయాట్‌లోని పార్కింగ్ స్థలానికి చాలా కిలోమీటర్ల దూరంలో సోహ్రారిమ్ వద్ద తాళం చెవితో సహా వదిలేసి ఉండటం గమనార్హం. రోజుల తరబడి గాలించిన అనంతరం జూన్ 2న రాజా రఘువంశీ మృతదేహాన్ని సహాయక సిబ్బంది ఒక లోయలో గుర్తించారు. అతని శరీరంపై ఉన్న బంగారు ఉంగరం, మెడలోని గొలుసు మాయమవడం హత్య జరిగి ఉండవచ్చనే అనుమానాలను మరింత బలపరుస్తోంది. ఆ మరుసటి రోజు సమీపంలోనే రక్తపు మరకలతో కూడిన ఒక కత్తిని కూడా అధికారులు కనుగొన్నారు. రెండు రోజుల తర్వాత సోహ్రారిమ్ నుంచి రాజా మృతదేహం దొరికిన లోయకు మధ్యలో ఉన్న మావ్క్మా గ్రామంలో దంపతులు ఉపయోగించిన రెయిన్‌కోట్ ఒకటి లభ్యమైంది. ఈ ఆధారాలన్నీ రాజా హత్యకు గురై ఉండవచ్చని సూచిస్తుండటంతో, అతని భార్య సోనమ్ కోసం గాలింపు చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పర్వతారోహకులు, జాగిలాలు, డ్రోన్లతో గాలిస్తున్నారు. అయితే, క్లిష్టమైన భూభాగం, అతి భారీ వర్షాలు, కొన్ని అడుగుల దూరం కూడా కనిపించకుండా అడ్డుకుంటున్న పొగమంచు వాతావరణం గాలింపు చర్యలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. దంపతుల అదృశ్యంపై దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి రెండు సీసీటీవీ ఫుటేజ్‌లు వెలుగులోకి వచ్చాయి. ఒక ఫుటేజ్‌లో దంపతులు అద్దెకు తీసుకున్న స్కూటర్‌పై వెళ్తున్నట్లు కనిపించగా, మరొకటి వారు ట్రిప్‌కు బయలుదేరే ముందు తమ వస్తువులలో కొన్నింటిని తీసుకుంటున్న గెస్ట్‌హౌస్‌లోనిది. మే 22న, అంటే వారు అదృశ్యం కావడానికి ఒక రోజు ముందు రాజా, సోనమ్ ఒక గెస్ట్‌హౌస్‌కు వచ్చారు. అక్కడ గదులు అందుబాటులో లేకపోవడంతో కనీసం తమ లగేజీనైనా భద్రపరచాలని గెస్ట్‌హౌస్ సిబ్బందిని కోరినట్లు తెలిసింది. నాన్‌గ్రియాట్‌లోని ప్రసిద్ధ డబుల్ డెక్కర్ రూట్ బ్రిడ్జ్‌ను సందర్శించి తిరిగి వస్తామని వారు హామీ ఇవ్వడంతో హోటల్ సిబ్బంది లగేజీని తనిఖీ చేసి భద్రపరచడానికి అంగీకరించారు. వీడియోలో సోనమ్ తమ స్కూటర్‌పై రెయిన్‌కోట్ వేస్తున్నట్లు కూడా కనిపించింది. షిల్లాంగ్‌లో మకాం వేసిన సోనమ్ సోదరుడు గోవింద్ రాష్ట్ర ప్రభుత్వం తమ సోదరి ఆచూకీ కనుగొనడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఆమె చనిపోయిందన్నట్లుగా గాలిస్తున్నారని ఆరోపించారు. సోనమ్ బతికే ఉందని మేము గట్టిగా నమ్ముతున్నాము. వారు మాత్రం ఆమె చనిపోయినట్లుగా వెతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు దర్యాప్తును సీబీఐ లేదా ఇతర ఏజెన్సీలకు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఆపరేషన్‌పై తూర్పు ఖాసీ హిల్స్ జిల్లా ఎస్‌పి వివేక్ సియెమ్ మాట్లాడుతూ, మేము మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం.. మా సిబ్బంది విశ్రాంతి లేకుండా అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన జాగిలాలను ఉపయోగిస్తున్నారు. గాలింపు కొనసాగుతుందని తెలిపారు. ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపగా, సోనమ్ ఆచూకీ లభిస్తుందనే ఆశతో కుటుంబసభ్యులు ఎదురుచూస్తున్నారు.

# కొత్త మంత్రులకు శుభాకాంక్షలు.. అభినందనలు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన ముగ్గురు మంత్రులు వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కాబోతున్న రామచంద్ర నాయక్ కు సైతం శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం అమలు చేస్తుందని అందుకే కుల ఘనన చేసి బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కొత్త మంత్రులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్, ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# 27న రాబోతున్న 'కన్నప్ప' ను ఆశీర్వదించండి

## గుంటూరులో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో డా. మోహన్ బాబు



**డైనమిక్ హీరో** విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' విడుదలకు సిద్ధమవుతోంది. డాక్టర్ ఎం. మోహన్ బాబుతో పాటుగా ఈ చిత్రంలో విష్ణు మంచు, ప్రీతి ముకుందన్, అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ లాల్, ముఖేష్ రిషి, కాజల్ అగర్వాల్ ముఖ్య పాత్రల్లో నటించారు. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై డా. మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. జూన్ 27వ తేదీన ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ వేగవంతం చేసిన టీమ్ జూన్ 7న గుంటూరులో ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో..

డా. మోహన్ బాబు మాట్లాడుతూ.. 'మా అమ్మకి పుట్టుకతో రెండు చెవులు వినిపించేవి కావు. అందరూ నా వాయిస్‌ని మెచ్చుకుంటుంటే ఆ మాటలు మా తల్లికి వినిపిస్తే ఎంత బాగుండేది అనుకునేవాడిని. జీవితంలో భయం అనేది ఉండకూడదు, తప్పు చేయనప్పుడు ఎవరికీ భయపడకూడదు, మా విద్యాలయాల్లో విద్యార్థులకు అదే నేర్పిస్తున్నాను. కన్నప్ప సినిమాని ఆ పరమేశ్వరుడు ఆశీర్వదించాడు. నా కంటే చిన్నవాడు, నా బావ ప్రభాస్‌కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మామధ్య ఎన్నో ఏళ్ల అనుబంధం ఉంది. మానవత్వం, మంచి హృదయం ఉన్నవాడు ప్రభాస్. ఇండియాలోనే కాదు, వరల్డ్ వైడ్‌గా ఉన్న టాప్ హీరోలలో ప్రభాస్ ఒకడు. సినిమాలో నటించాలని కోరిన వెంటనే ఓకే చెప్పారు. మోహన్ లాల్ వర్సటైల్ యాక్టర్. కన్నప్పలో చేయమని అడిగిన వెంటనే చేస్తానని అన్నారు. శరత్ కుమార్, అక్షయ్ కుమార్, బ్రహ్మానందం.. ఇలా అందరినీ ఆ భగవంతుడే ఈ సినిమాలోకి రప్పించాడు. ప్రభుదేవా డ్యాన్స్ మాస్టర్‌గా ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నారు. జూన్ 27న రాబోతోన్న 'కన్నప్ప'ను ఆశీర్వ దించండి' అన్నారు. విష్ణు మంచు మాట్లాడుతూ.. .. 'కన్నప్ప' ఫస్ట్ రోడ్‌షో గుంటూరులోనే జరిగింది. ఈ సినిమా తీయడానికి, నేను ఇక్కడ నిలబడటానికి చాలామంది సాయం చేసారు. నాకు మా నాన్న దేవుడు.. ఆయన లేకపోతే నేను లేను. ఈ జర్నీ స్టార్ట్ చేసినప్పటి నుంచి నిన్నటి వరకూ కూడా బ్రహ్మానందం గారు ఈ సినిమా విషయంలో ధైర్యం చెబుతూనే ఉన్నారు. ప్రభుదేవా ఒక కొరియోగ్రాఫర్‌గా, నటుడిగా, డైరెక్టర్‌గా సక్సెస్ చూసారు. ఆయన పనులన్నీ మానుకొని కన్నప్ప సినిమాకి మూడు పాటలు చేయాల్సిన అవసరం లేదు. అయినా మా కోసం చేశారు. డైరెక్టర్ ముఖేష్ సింగ్ భాష రాకపోయినా 'కన్నప్ప' సినిమా చేయడానికి వెంటనే ఒప్పుకున్నారు. సినిమా ఎప్పుడు చేస్తామో తెలియకుండానే 2017లోనే ఈ ప్రాజెక్ట్ చేయడానికి మ్యూజిక్ డైరెక్టర్ ఒప్పుకున్నారు. నా మిత్రుడు ప్రభాస్‌కి నేను ఎప్పటికీ రుణపడి ఉంటా. అతను కన్నప్ప సినిమా చేయడానికి కారణం.. నాన్న మీద ఆయనకు ఉన్న ప్రేమ, గౌరవం. నాన్న కోసం ప్రభాస్ ఈ సినిమా చేసారు కానీ, నాకోసం చేయలేదు. ఈ కాలంలోనూ పెద్దల పట్ల గౌరవం, స్నేహానికి విలువ ఉందనడానికి ప్రభాస్ ఒక ఉదాహరణ. మీరందరూ అతని స్టార్ డమ్‌నికాదు, అతని వ్యక్తిత్వాన్ని ప్రేమించండి. జీవితంలో ఒక సందర్భంలో మనందరికీ దేవుడు నిజంగానే ఉన్నాడా అనే డౌట్ ఉంటుంది. అక్కడి నుంచే భక్తి పుడుతుంది. దేవుడికి దాసోహం అవుతాం. కన్నప్ప సినిమా కూడా అంతే. ఈ ప్రయాణం ఒక వ్యక్తిగా నన్ను చాలా మార్చింది. దాదాపు 50 ఏళ్ల తర్వాత కన్నప్ప కథను చిత్రీకరించాం. యాభై ఏళ్ల తర్వాత కన్నప్ప కథను మరోసారి చెప్పరా అని శివుడు నన్ను ఎన్నుకున్నాడని నేను భావిస్తున్నా. కన్నప్పను ఎన్నో సంవత్సరాలుగా ఒక బిడ్డగా చూసుకున్నాం. జూన్ 27న మీ ముందుకు తీసుకొస్తున్నాం. అందరూ ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాన్ను అని అన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ.. .. 'కన్నప్ప' చిత్రంలో విష్ణు బాబు అద్భుతంగా ఉన్నారు. గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. నిర్మాతగా మోహన్ బాబు పేరు ఉంటుంది.. కానీ నిర్మాతగా, హీరోగా విష్ణు చాలా కష్టపడ్డారు. ఈ చిత్రం పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. రఘు బాబు మాట్లాడుతూ.. .. 'కన్నప్ప సినిమా ఒక రేంజ్. ఈ సినిమాను కనువిందు చేసేలా న్యూజిలాండ్‌లో తీశారు. అబ్బురపరిచే లొకేషన్స్‌లో తీశారు. కామెడీ, యాక్షన్, ఎంటర్ టైన్ మెంట్ అన్నీ కలిసి ఉండే భక్తి సినిమా కన్నప్ప. ఈ షూటింగ్ లో బాగా ఎంజాయ్ చేశాం. సినిమా చూశాక మీరు కూడా ఎంజాయ్ చేస్తారు' అన్నారు.



**గాడ్ ఆఫ్ మాసెస్** నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హైలీ యాంటిసిపేటెడ్ 'అఖండ 2: తాండవం' కోసం నాల్గవ సారి కొలాబరేట్ అయ్యారు. ఈ హైఆక్టేన్ సీక్వెల్ కథ, స్కేల్, నిర్మాణం, సాంకేతిక నైపుణ్యం.. ప్రతి అంశంలో అఖండను మించి ఉంటుదని హామీ ఇస్తోంది. ప్రతిష్టాత్మకమైన 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట అత్యంత భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎం. తేజస్విని నందమూరి సగర్వంగా సమర్పిస్తున్నారు.

తాజాగా కర్స్ డబుల్ అప్‌డేట్‌లతో సర్ప్రైజ్ చేశారు. అఖండ 2 ఫస్ట్ లుక్, టీజర్ జూన్ 9న, బాలకృష్ణ

# 'అఖండ 2: తాండవం' ఫస్ట్ లుక్ టీజర్ 9న రిలీజ్

పుట్టినరోజుకు ఒక రోజు ముందు విడుదల కానున్నాయి. ఈ పోస్టర్‌లో నంది, డమరుకంతో కూడిన త్రిశూలం కనిపిస్తుంది, దాని నేపథ్యంలో విశ్వ దిక్సూచి ఉంటుంది. ఈ పోస్టర్ చాలా క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. సినిమా షూటింగ్ షెడ్యూల్ ప్రకారం జరుగుతోంది. టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తుంది. డైనమిక్ ఆది పినిశెట్టి ఇంటెన్స్ పాత్రని పోషిస్తున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. సంగీత సంచలనం థమన్ సంగీతం అందిస్తున్నారు, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సి రాంప్రసాద్ డీవోపీగా పని చేస్తున్నారు. ఎడిటర్ తమ్మిరాజు. ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. దసరా కానుకగా సెప్టెంబర్ 25న 'అఖండ 2' పాన్ ఇండియా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. నటీనటులు: గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంయుక్త, ఆది పినిశెట్టి సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపి ఆచంట, బ్యానర్: 14 రీల్స్ ప్లస్, సమర్పణ: ఎం తేజస్విని నందమూరి, సంగీతం: థమన్ ఎస్, డీవోపీ: సి రాంప్రసాద్, సంతోష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కోటి పరుచూరి, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు, ఫైట్స్: రామ్‌లక్ష్మణ్, పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో

# 'ఎన్‌బికె 111' అనౌన్స్‌మెంట్

**గాడ్ ఆఫ్ మాసెస్** నందమూరి బాలకృష్ణ వరుస బ్లాక్ బస్టర్లతో దూసుకుపోతున్నారు. ఆయన పుట్టినరోజు (జూన్ 10) పురస్కరించుకొని బాలకృష్ణ 111వ చిత్రం అధికారికంగా ప్రకటించారు. 'ఎన్‌బికె 111' చిత్రానికి బ్లాక్ బస్టర్ మేకర్ గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తారు. భారీ బ్లాక్ బస్టర్ హిట్ వీరసింహారెడ్డి తర్వాత ఇది వారి సెకెండ్ కొలాబరేషన్. ప్రస్తుతం 'పెద్ది'వంటి పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్న వెంకట సతీష్ కిలారు, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో ఈ కొత్త ప్రాజెక్ట్‌ను మ్యాసీవ్ స్కేల్ లో నిర్మించనున్నారు. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో ఉగ్ర సింహం ఫెరోషియస్ ఇమేజ్ వుంది. దాని ముఖంలో సగం లోహ కవచం, మిగిలిన సగం వైల్డ్ గా కనిపిస్తోంది. ఈ అద్భుతమైన ఇమేజ్



బాలకృష్ణ ఈ చిత్రంలో పోషించబోయే ఇంటెన్స్ పవర్ ఫుల్ క్యారెక్టర్‌ని ప్రజెంట్ చేస్తోంది. మాస్, కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లతో అదరగొట్టే దర్శకుడు గోపీచంద్ మలినేని తొలిసారిగా హిస్టారికల్ బ్యాక్ డ్రాప్‌లోకి అడుగుపెట్టనున్నారు. బాలకృష్ణ కోసం ఆయన ఇంతకు ముందు చూడని అవతార్‌ను రూపొందిస్తున్నారు. ఇది గ్రాండియర్, హిస్టరీ, హైఆక్టేన్ యాక్షన్‌ను బ్లెండ్ చేసే ఒక ఎపిక్ స్టోరీ. పవర్ ఫుల్ అండ్ యూనిక్ గా వుండబోతున్న ఈ స్క్రిప్ట్ ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ చివరి దశలో ఉంది. మిగిలిన తారాగణం, సాంకేతిక సిబ్బందిని మేకర్స్ త్వరలో అనౌన్స్ చేస్తారు.

# 'కట్టలన్' కీలక పాత్రలో సునీల్



**బిగ్గెస్ట్ పాన్ ఇండియా బ్లాక్** బస్టర్ మార్కో విజయం తర్వాత క్యూబ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత షరీఫ్ మహమ్మద్, తన తదుపరిప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా 'కట్టలన్'ను అనౌన్స్ చేశారు. ఇదిపాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న హైయాక్షన్ థ్రిల్లర్. ప్రముఖ నటుడు ఆంటోనీ వర్గీస్ (పేపే) హీరోగా నటిస్తున్నారు. దర్శకత్వం పాల్ జార్జ్. ఈ చిత్రంలో కీలక పాత్రలో సునీల్ నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. సునీల్ స్టయిలీష్ లుక్‌లో కనిపిస్తున్న అనౌన్స్ మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ఈ మూవీకి కాంతార 2 ఫేం అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ సంచలనంగా మారింది. వర్షంలో తడిచిన పేపే, చుట్టూ పడి ఉన్న మృతదేహాలు, ఏనుగు దంతాల మధ్య నిలబడి వుండటం కథలో ఉండబోయే వైలెన్స్ సూచిస్తోంది. మార్కో స్థాయిని మించి ఉండబోతోందని సంకేతాలు ఇస్తోంది. జైలర్, లియో, జవాన్, కూలీ లాంటి చిత్రాలకు టైటిల్ ఎలిమెంట్స్ డిజైన్ చేసిన ఐడెంట్ ల్యాబ్స్ ఈ సినిమాకి కూడా టైటిల్ డిజైన్ చేశారు.

# 'సర్దార్ 2' షూటింగ్ పూర్తి

**హీరో కార్తి** తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'సర్దార్'కి సీక్వెల్ 'సర్దార్ 2'తో ప్రేక్షకులు ముందుకు రానున్నారు. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ 'సర్దార్2' కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ గ్రాండ్‌గా నిర్మిస్తోంది. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా టీం అందరూ సెట్‌లో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్న ఫోటోలని మేకర్స్ షేర్ చేశారు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తుండగా ఎస్‌జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. 'సర్దార్ 2' భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్‌లోతెరకెక్కుతోంది. ఈ సినిమాకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. 'సర్దార్ 2' చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫోటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. రాజీవ్ నంబియార్ ప్రొడక్షన్ డిజైనర్. విజయ్ వేలుకుట్టి ఎడిటర్. తిశి పాల్ పాండి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్. ఎ వెంకటేష్ సహ నిర్మాతగా, ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



# 'సోలో బాయ్' జూలై 4న విడుదల!

**బిగ్ బాస్ షోతో** పాపులర్ అయిన యంగ్ హీరో గౌతమ్ తాజా చిత్రం 'సోలో బాయ్' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. నవీన్ కుమార్ దర్శకత్వంలో సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సతీష్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్వేతా అవస్తి, రమ్య పసుపులేటి హీరోయిన్లుగా మెరవనున్నారు. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో పోసాని కృష్ణ మురళి, అనిత చౌదరి, అరుణ్ కుమార్, ఆర్కే మామ, షఫీ, డాక్టర్ భద్రం వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'సోలో బాయ్' ఫస్ట్ లుక్ పోస్టర్, సాంగ్ సినీ లవర్స్‌ను ఆకర్షిస్తున్నాయి. తాజాగా రిలీజైన పోస్టర్‌లో గౌతమ్.. రమ్య పసుపులేటితో కలిసి కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రొమాంటిక్ లుక్‌లో ఆకట్టుకున్నాడు. ఈ పోస్టర్ యూత్‌లో హైప్ క్రియేట్ చేస్తోంది.



మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని జూలై 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. యూత్‌ఫుల్ కథతో, రొమాంటిక్ వైబ్‌తో, ఎంటర్‌టైన్‌మెంట్ డోస్‌తో ఈ సినిమా ప్రేక్షకులను ఫుల్ ఎంగేజ్ చేయనుంది. గతంలో 'ఆకాశ వీధుల్లో' చిత్రంతో ఆకట్టుకున్న గౌతమ్ మరోసారి హీరోగా ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నాడో చూడాలి!


# నంబర్ వన్ రేసులో మమిత బైజు

**నెక్స్ట్ కోలీవుడ్‌లో** నెంబర్ వన్ హీరోయిన్ ఎవరు? నెంబర్ వన్ రేస్ గురించి తెలియదు కానీ, ఇప్పుడున్న లైనప్ చూస్తుంటే మాత్రం మమిత బైజు కొన్నేళ్ల పాటు హాల్‌చల్ చేయడం ఖాయమనే మాటలు వినిపిస్తున్నాయి. ప్రేమలు హీరోయిన్ తెలుగులో ఎంట్రీ ఇవ్వడంలో ఆలస్యమైనా, మన దగ్గర కూడా క్రేజ్‌ని హోల్డ్ చేయడంలో మాత్రం దిట్టే అని అంటున్నారు నెటిజన్లు. కొత్త సినిమాల టాపిక్ వచ్చిన ప్రతిసారీ క్రేజ్ ఉన్న హీరోయిన్లను గురించి మాట్లాడుకోవడం అలవాటు. ఇప్పుడు మమిత బైజు గురించి కూడా కోలీవుడ్‌లో అలాంటి టాపిక్కే నడుస్తోంది. ఫోర్త్ కమింగ్ స్టార్ హీరోల సినిమాల్లో నాయికగా మమిత పేరే స్ట్రాంగ్‌గా వినిపిస్తోంది. ప్రేమలు సినిమాతో పాపులారిటీ సంపాదించుకున్నారు మమిత బైజు. తెలుగులో వరుస సినిమాలతో హాల్‌చల్ చేసే అవకాశాలు చాలానే ఉన్నాయనే టాక్ అప్పట్లో బాగా నడిచింది. బట్, సర్‌ప్రైజింగ్గా ఆమె కోలీవుడ్‌కే పరిమితమయ్యారు. ప్రస్తుతం విజయ్‌తో జననాయగన్ సినిమా చేస్తున్నారు మమిత. ఇటు తెలుగు ప్రొడక్షన్ హౌస్‌కి కూడా సైన్ చేశారు ఈ బ్యూటీ. ప్రదీప్ రంగనాథన్ నెక్స్ట్ సినిమాలో నాయికగా నటిస్తున్నారు మమిత బైజు. ఈ సినిమా ఓపెనింగ్ ఆ మధ్య జరిగింది. నెక్స్ట్ సూర్య సినిమాలోనూ హీరోయిన్‌గా నటిస్తున్నారు. పళని మురుగన్ ఆలయాన్ని దర్శించి పనులు మొదలుపెట్టేసింది టీమ్. సూర్య పక్కన ప్రేమలు బ్యూటీని ఎప్పుడెప్పుడు చూస్తామా అని వెయిట్ చేస్తున్నారు ఫ్యాన్స్.



# సరికొత్తగా 'పయనం' చిత్రం ప్రారంభం

**రోటి కపడా రొమాన్స్** చిత్రంతో కథానాయకుడిగా తనకంటూ ఓ గుర్తింపు పొందిన సుప్రజ్ హీరోగా, 'జనక అయితే గనక' చిత్రంలో తన అభినయంతో మెప్పించిన సంగీర్తన విపిన్ నాయికగా నటిస్తున్న నూతన చిత్రం 'పయనం' ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఛాయచిత్రాలు పతాకంపై చందురామ్ దర్శకత్వంలో స్వర్ణ కమల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ క్లాప్ నివ్వగా, నటుడు, సంగీత దర్శకుడు రఘు కుంచె కెమెరా స్విచాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న చిత్రమిది. డ్రామా సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేసే అంశాలు చాలా ఉంటాయి. అవసరాల శ్రీనివాస్ మా చిత్రంలో ఓ ముఖ్యపాత్రలో కనిపిస్తారు. అంతేకాదు ప్రతి పాత్ర ఎంతో సహజంగా ఉంటుంది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ఈతరం ప్రేక్షకులు మెచ్చే అంశాలతో రూపొందుతున్న ఓ వైవిధ్యమైన చిత్రమిది. మంచిర్యాల, తమిళనాడు, ఒరిస్సా పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ పూర్తిచేస్తాం. జూలై 7 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు. సుప్రజ్, సంగీర్తన విపిన్, అవసరాల శ్రీనివాస్, రఘు కుంచె ఆమని, మైమ్ మధు, మెహబూబ్ భాషా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచనా సహకారం, మాటలు, స్క్రీన్‌ప్లే: వీరా రెడ్డి, సతీష్ కుమార్ మూల, డీఓపీ: షోయబ్, సంగీతం: రఘు కుంచె, ఆర్ట్: రాజశేఖర్, కాస్ట్యూమ్ డిజైనర్: రూమ్ జైన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: పి.భరత్ రెడ్డి, కథదర్శకత్వం: చందురామ్, నిర్మాత: స్వర్ణ కమల, బ్యానర్: ఛాయచిత్రాలు





# బేబీ బ్లూస్ నిర్లక్ష్యం చేయవద్దు



**మన జీవితాల్లోకి పిల్లలు తెచ్చే ఆనందం ఎక్కువే. అయితే, ఈ క్రమంలో తల్లిలో ఏర్పడే శారీరక,** మానసిక మార్పులు బేబీ బ్లూస్‌కి కారణమవుతాయి. అంటే, తెలియని ఆందోళన, కుంగుబాటు, సైకోసిస్ లాంటి సమస్యలెన్నో వారిని ఉక్కిరిబిక్కిరి చేయడం, ప్రపంచవ్యాప్తంగా 10 శాతం గర్భిణులు, 13 శాతం బాలింతలు ఇటువంటి మానసిక సమస్యలు బారిన పడుతున్నట్లు తాజా లాన్సెట్ రిపోర్టు నివేదించింది. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ 5 నుంచి 25 శాతం తల్లుల ఆత్మహత్యలకు కారణం ఇదేనట. సుమారు 85 శాతం మహిళల్లో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయట. అయితే, అందులో 70 శ్శాతం మంది వాటిని గుర్తించలేక బయటకు చెప్పలేకపోతున్నారట. దీని ప్రభావం బిడ్డ ఆరోగ్యంపైన పడడంతోపాటు, తల్లీబిడ్డ మధ్య బంధం ఏర్పడ డంలోనూ సమస్యలు ఎదుం వుతున్నాయట. దీర్ఘకాలంలో ఇది పిల్లలపై శారీరకంగా, మానసికంగా, భావోద్వేగాల పరంగానూ ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ఆ సమయంలో తల్లికి తగిన సహకారం అందిస్తూ మానసిక ఆరోగ్యానికి తోడ్పడాల్సిన అవసరం కుటుంబ సభ్యులపై ఉంటుంది. అందుకోసం ఇలాంటి సమస్యలేమైనా ఉంటే వాటి గురించి బహిరంగంగా చర్చించడం, అవగాహన కలిపంచడం, మొదట్లోనే గుర్తించి చికిత్స చేయించడం లాంటివి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారు. □

## చెలి చిట్కా

★ ధనియాలకు పురుగుపట్టకుండా ఉండాలంటే కళాయిలో వేసి వేడి చేయండి. ఒక డబ్బాలో నిల్వచేసిన చాలా కాలం వరకు నిల్వవుంటాయి. ★ నూనె వేయకుండా గుడ్లు ఫ్రై చేయాలంటే బాణలిలో ముందు అరచెమ్చా ఉప్పువేయండి. చక్కగా ఫ్రై అవటమే కాక బాణలికి అంటుకోదు. □

**అమ్మాయి గోల్డ్‌మెన్ శాక్స్ ఉద్యోగి, అబ్బాయి కొలంబియా యూనివర్సిటీ నుంచి ఎంబిఏ! పిల్లల విజయానికి ఇంతకంటే కొలమానం ఏం ఉంటుంది? అయితే వాళ్లది తోడు లేనిదే అడుగుకూడా వేయలేని స్థితి. ఈ స్థాయికి వాళ్లు చేరుకోవడం వెనక ఓ తల్లి కృషి, త్యాగం, ప్రోత్సాహం ఉన్నాయి. ఆ ప్రయాణం తెలుసుకుందాం..**




# చూపులేని పిల్లలకు ప్రపంచాన్ని చూపిస్తూ..

మా వారు అన్నాప్రగడ రాధాకృష్ణమూర్తి పంచాయతీరాజ్‌లో ఏఈ, మాది గుంటూరు దగ్గర వినుకొండ. ఆయన ఉద్యోగరీత్యా కర్నూల్ స్థిరపడ్డాం. మాకు అమ్మాయి రమ్య, అబ్బాయి రాజీవ్. ఇద్దరూ చదువుల్లో చురుకైనవారే. జీవితం సాఫీగా సాగిపోతున్న ఆ దశలో 'రెటినైటిస్ పిగ్మెంటోసా'.. మా జీవితాల్లో చీకటి కమ్ముకునేలా చేసింది. అమ్మాయికి పదేళ్లు, అబ్బాయికి 13 ఏళ్లు ఉన్నప్పుడు ఈ సమస్య వచ్చింది. బోర్డుపైన అక్షరాలు కనిపించకపోవడం గుర్తించారు. హైదరాబాద్‌లో చూపిస్తే... జన్యుపరంగా వచ్చిన సమస్యగా చెప్పారు. చికిత్స అందుబాటులోకి వస్తుంది. కానీ, ఇప్పటికీ రాలేదు. వారి చూపు క్రమంగా మందగించి... టీనేజ్ దాటేసరికి దాదాపుగా చూడలేని పరిస్థితి. దీంతో మావారూ, నేనూ ఎంత కుమిలిపోయామో! నాకైతే దిక్కుతోచలేదు. అయోమయంలో ఉండిపోయా. 'నేనిలా అయిపోతే పిల్లల పరిస్థితి ఏంటి' అని కొద్దిరోజులకే తెలుసుకున్నా. ఆ తర్వాత నుంచి వాళ్ల భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ వచ్చా. పెళ్లికి ముందే బీఏ చేశా. అమ్మాయికి అన్ని సబ్జెక్టులూ చదివి వినిపించేదాన్ని. తనే పరీక్షలు రాస్తున్నది. టెన్త్ ఫైనల్ పరీక్షలు సరిగ్గా లేని గదిలో రాయడంతో మార్కులు తగ్గిపోయాయి. ఆ తర్వాత నుంచి ఆమెకు స్క్రైబ్‌ని పెట్టాం. నేను పరీక్ష రాసేదాన్ని, ఇంటర్, డిగ్రీ వరకూ కర్నూల్ కాలేజీలో చదువుకుంది. దూరవిద్యలో ఎంఎ పాలిటిక్స్ చేసింది. అబ్బాయికి ఎనిమిదో తరగతి నుంచి స్క్రైబ్‌ని పెట్టాం. మ్యాథ్స్ తప్పించి అన్ని సబ్జెక్టులూ చదివి వినిపించేదాన్ని. టెన్త్‌లో 560 మార్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిభ అవార్డు తీసుకున్నాడు. ఇంటర్ ఎంఇసిలో 94 శాతం మార్కులు వచ్చాయి. బికామ్‌తోపాటు సిఎ ఇంటర్మీడియెట్‌ని పూర్తిచేశాడు.

**.. అలుపులేని ప్రయాణం...**

ఇల్లు దాటకుంటే పిల్లలు భద్రంగా ఉంటారు. కానీ, జీవితంలో ఏమీ సాధించలేరని అర్థమైంది. ఇతర మాదిరిగానే లక్ష్యాలు పెట్టుకునేలా పిల్లలను ప్రోత్సహించండి. పాపని ఐఏఎస్‌గా చూడాలని ఉండేది. ఆ మాటే చెబితే అంగీకరించింది. ఢిల్లీ నుంచి ఆడియో మెటీరియల్ తెప్పించాం. అబ్బాయికి ఐవీ లీగ్ యూనివర్సిటీలో ఎంబీఏ చేయాలనే లక్ష్యం. అందుకు పని అనుభవం తప్పనిసరి. బికామ్ తర్వాత ఎన్నో ఉద్యోగావకాశాలు వచ్చినా, తన సమస్య కారణంగా ఎవరూ చేర్చుకునేవారు కాదు. ఐఐఎంతిరుచ్చిలో ఎంబిఏలో చేరాడు. నచ్చిన కోర్సులో చేరావు, ఎంత కష్టమైనా పూర్తిచేయాల్సిందే అని చెప్పా. కుదురుకున్నామనుకుంటున్న దశలో మావారి ఆకస్మిక మరణం... మరోసారి మమ్మల్ని కుదిపేసింది. ఈసారి పిల్లలే నాకు ధైర్యం చెప్పారు. అమ్మాయికి జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా రెండేళ్లకే రాజీనామా చేసి, ఐఐఎం లఖ్ నవూలో ఎంబీఏ చేసింది. ప్రస్తుతం బెంగళూరులో గోల్డ్‌మన్ శాక్స్ సంస్థలో ఉద్యోగం. అబ్బాయి ఆర్బీఎస్, డెలాయిట్ సంస్థల్లో పనిచేశాడు. తన లక్ష్యం ప్రకారం న్యూయార్క్ లోని కొలంబియా యూని వర్సిటీలో 2023లో ఎంబీఏకి చేరాడు. ప్రపంచంలోని టాప్5 బిజినెస్ స్కూళ్లలో ఇది ఒకటి. ఈ వారమే తన గ్రాడ్యుయేషన్ డే. అందుకోసం అమ్మాయి, నేను ప్రస్తుతం అమెరికా వచ్చాం. పిల్లలకు సంగీతం, చిన్న వంటకాలు చేయడమూ నేర్పించా. నాకు ఫోన్‌చేసి వీడియో కెమెరా ఆన్ చేసి పెడతాడు. గమనించి ఏవేవి ఎంత వేయాలో చెబుతుంటే చాలు వంట చేసుకుంటాడు. పిల్లల్ని గారాబం చేయలేదు, భయపెట్టనూలేదు. బాధ్యతని గుర్తుచేస్తూ స్వతంత్రంగా బతికేలా తీర్చిదిద్దా. పిల్లల విజయాన్ని ఆయన చూడలేదన్న బాధ తప్పించి జీవితంలో ఏలోటూ లేదిప్పుడు. మంచి సంబంధాలు చూసి పెళ్లిళ్లు చేయడమే మిగిలిన ఏకైక లక్ష్యం. □

# ఇవి తింటే ఊబకాయం రాదు



జీడిపప్పు అందరికీ తెలుసు కానీ జీడిపండ్ల గురించి పెద్దగా తెలీదు కదూ! వీటిని 'కాజూ యాపిల్' అని కూడా పిలుస్తారు. ఇవి కూడా పోషకాలే...

- ◆ జీడిపండ్లలో కాపర్, క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్, జింక్, ఫోలెట్, బి1, బి2, బి3, బి6, సి, ఐ, కె విటమిన్లు ఉన్నాయి.
- ◆ ఈ పండ్లు తినటం వల్ల రక్తహీనత నుంచి బయటపడొచ్చు.
- ◆ రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- ◆ ఇవి రక్త ఉత్పత్తిని పెంచుతాయి.
- ◆ కురులు ఒత్తుగా పెరుగుతాయి.
- ◆ చర్మం పొడిబారదు, ముడతలు పడదు. ముఖానికి మెరుపు వస్తుంది. ఎర్రరక్త నియంత్రణను వృద్ధి చేస్తుంది. గుండెజబ్బులను దూరం చేస్తుంది. ఊబకాయం రానివ్వవు.
- ◆ ఎముకలు, దంతాలు, కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. వీటితో గుల్ల ఎముక వ్యాధికి చెక్ పెట్టినట్టు అవుతుంది.
- ◆ చక్కెర అతి తక్కువగా ఉంటుంది కాబట్టి మధుమేహం ఉన్నవారు కూడా తినొచ్చు. టైప్ 2 మధుమేహం నుంచి ఉపశమనం కలిగిస్తుంది కూడా.

ట్యూమర్, క్యాన్సర్ల చికిత్స చేయించుకున్న వారికి వీటిలోని యాంటీఆక్సిడెంట్స్ మేలు చేసే అధ్యయనాల్లో తేలింది. □

# పర్యావరణ హితంగా కార్యాలయాలు




వాతావరణంలో మార్పులు, పర్యావరణ విధ్వంసం... ఈ అంశాలు చెపే, మిలీనియల్స్ ను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీనికే ఎకో యాంగ్జైటీ అని పేరు. ఆఖరికి కార్యాలయాలూ పర్యావరణ హితంగా ఉంటేనే ఉద్యోగాలకు ఇష్టపడుతున్నారు. లేకపోతే ప్రత్యామ్నాయాలు చూసుకునేందుకూ వెనకాడటంలేదు. జీతా, పదోన్నతులూ, పని సంస్కృతి... వంటి అంశాల కంటే అక్కడ పర్యావరణాన్ని కాపాడటమే ప్రధానమని కూడా జెన్‌జీ లూ, మిలీనియల్స్ ఏదైనా సంస్థ దీని గురించి పట్టించుకోకపోతే, పని చేయడానికి వారి మనసు అంగీకరించడంలేదట. హితమైన కార్యాలయాలు భూమికే కాదు, ఉద్యోగుల మానసిక ఆరోగ్యానికీ, పర్యావరణ ఉత్పత్తి పెరిగేందుకూ మేలు చేస్తుంది. పనిచేసే చోట సహజమైన వెలుగు, గాలి రావాలి. పర్యావరణ హితమైన పరికరాలు వాడాలి. అప్పుడే వారికి వృత్తిలోనూ సంతృప్తి ఉంటుంది. ఇలాంటి చోట మానసిక అలసట తక్కువే కాకుండా, తామూ పర్యావరణానికి మేలు చేస్తున్నా మన్న భావనతో బాగా పనిచేసుకుంటారు అని మానసిక నిపుణులు చెబుతున్నారు. అలాకాకుండా కృత్రిమ వెలుగు, స్క్రీన్‌ఫ్లేమ్, కర్బన ఉద్గారాల విడుదల ఎక్కువగా ఉండేచోట వారికి మనశ్శాంతి కరవవుతుందట. పర్యావరణ పరిరక్షణకు కంపెనీలు తీసుకునే చర్యలు, ఫలితాలు సుస్పష్టంగా ఉండాలనీ కోరుతున్నారు. ప్రజా రవాణాలో వచ్చేవారికి ప్రోత్సాహకాలు, ఈవీలు కొనేవారికి రాయితీల్లాంటివీ. ఇవ్వాలంటున్నారు. రవాణా తగ్గడం వల్ల కర్బన ఉద్గారాలు తగ్గుతాయి కాబట్టి... హైబ్రిడ్, రిమోట్ వర్క్‌కూ చోటివ్వాలట. సంస్థలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, పేపర్ వాడకాన్ని తగ్గించడం. రీజబుల్ కట్లెరీ, క్యాంటీన్‌లో శాకాహారానికి ప్రాధాన్యత ఇవ్వడం... లాంటి మార్పుల్ని జెన్ జీలు కోరుకుంటున్నారు. □

# పిల్లలు బడికి బొమ్మలతో..










అక్కతో బడికెళతానంటూ మారాం చేసే బుజ్జాయిలు ప్రతి ఇంట్లో ఉంటారు. వీపుపై బ్యాగు తగిలించుకుంటే చాలు. బడికెళ్లినంతగా సంబరపడిపోతారు. ఇక ప్లేస్కూల్‌కెళ్లే సమయం ఆసన్నమైనప్పుడు మాత్రం తమకిష్టమైన బొమ్మలనూ తీసుకెళతానేని పేచీ పెడతారు. అదిగో అటువంటి చిన్నారుల కోసంమే ఈ 'బ్యాక్ ప్యాక్'లు.

## బొమ్మలనూ ఉంచొచ్చు...

కుక్కపిల్ల, సింహం, డైనోసార్ బొమ్మలకు నచ్చిన పేరు పెట్టుకుని పిల్లలు వాటితో ఆడుకుంటుంటారు. తీరా ప్లే స్కూల్‌కు బయలుదేరేటప్పుడు ఆ బొమ్మను వదల్లేరు. తమతోపాటు బడికి తీసుకెళ్లాలని మొండికేస్తారు. అలాంటివారి కోసమే ఈ యూనిమల విండో బ్యాక్ ప్యాక్. దీనికి ఓ వైపు స్ట్రాప్స్, రెండోవైపు మూడు నాలుగు బొమ్మలుంచేలా చిన్నన గదుల్లాంటి రంధ్రాలుంటాయి. నచ్చిన బొమ్మలను వీటిలో ఉంచితే చాలు. అవి కూడా తమతోనే ఉన్నాయనే భావన పిల్లల్లో ఉంటుంది. అలాగే ఆకాశం, నక్షత్రాలు, రాకెట్, అంతరిక్షం, వ్యోమగామిలాంటి డిజైన్లతో బ్యాక్‌ప్యాక్‌లొస్తున్నాయి. పిల్లల్లో ఉత్సాహాన్ని నింపడమే కాదు. ఇవి సృజనాత్మకతనూ పెంచుతాయి.

## నచ్చినవన్నీ సర్దేయొచ్చు...

ఈ బ్యాక్ ప్యాక్‌కు చిన్నారులకు నచ్చే కుందేలు, కుక్కపిల్ల వంటి బొమ్మలను స్ట్రాప్‌తో అటాచ్ చేసే సౌకర్యం ఉంటుంది. దీంతోపాటు నీలి ఆకాశం, నక్షత్రాలు, ఇల్లు, తోట అంటూ పలురకాల ఊలు బొమ్మలూ బ్యాగుకు అతికించి ఉంటాయి. అలాగే డెనిమ్, శాటిన్ క్లాత్స్‌తో తయారవుతున్న కొన్ని బ్యాగులకు ఓవైపు బొమ్మను ఫిక్స్ చేయొచ్చు. దీనికోసం బెల్ట్‌లా స్ట్రాప్స్‌తో లేదా అరలాంటిది అటాచ్డ్‌గా ఉంటుంది. ఇందులో నచ్చిన బొమ్మను స్టఫ్ చేస్తే కదలకుండా కూర్చుంటుంది. ఉత్సాహంగా పరుగులు పెట్టి చటుక్కున కనిపించని పిల్లలను కనుసన్నల్లో ఉండేలా చేసే బ్యాగులు ఇప్పుడొస్తున్నాయి. చిన్నారి తగిలించుకున్న ఈ బ్యాగుకు వెనకవైపు అటాచ్డ్‌గా ఓ బెల్ట్ లేదా వైర్ ఉంటుంది. దీని రెండోకొనను పెద్దవాళ్లు తమ చేతికి తొడుక్కుంటే సరిపోతుంది. □







# ధర్మం

ప్రకృతి నియమాలు మరియు మార్గ దర్శకాలను ప్రధానంగా ధర్మము అని చెప్పుకోవచ్చును. దీనిలో మనిషి యెక్క సత్ప్రవర్తన, సామాజిక న్యాయపాలన, లోకకళ్యాణ ప్రవర్తన వంటివి ఈ కోవలోనికి వస్తాయి. మన ప్రవర్తనతో సాటి మనుషులకు గాని, జంతువులకు గాని, ప్రకృతికి గాని ఎటువంటి హాని కలుగకుండా చూసు కోవాలి. ఎందుకంటే ఈ సృష్టిలో మనతోపాటు మిగిలిన అన్ని జీవరాసులకు బ్రతికే హక్కు సమానంగా ఉంటుంది. మనకు హాని కలిగినా పరవాలేదు గాని ఇతరులకు మనవలన మాత్రము హాని కలుగకూడదు అనేది ధర్మం సూచిస్తుంది. శాంతి, అహింస, సత్యము, ఉపకారము, సానుభూతి వంటివి ప్రధాన ధర్మ కారకాలు. మనిషి మాత్రమే తన బుద్ధిని ఉపయోగించి ప్రవర్తించగలుగుతాడు. మిగిలిన ఏ జీవరాశికి ఇటువంటి అవకాశం లేదు. కాని ఇక్కడ గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన అంశం ఏమంటే ప్రకృతిలో మనిషి తప్ప మిగిలిన అన్ని జీవరాశులు ప్రకృతి నియమిత ధర్మంలో జీవనం సాగిస్తూవుంటాయి. చెట్లు, మొక్కలు కాలానుగుణంగా తమ తమ ధర్మమైన పువ్వులు పూయటం, కాయలు కాయటం, పండ్లు కాయటం వంటివి చేస్తాయి. ఋతువులు తమ తమ ధర్మాలను పాటించి వివిధ కాలాలలో చేయవలసిన కార్యక్రమాలు నిర్వర్తిస్తూ వుంటాయి. జంతువులు కూడా ఎవ్వరి ప్రమేయం లేకుండా తమ కర్తవ్యపాలన చేస్తాయి. కాని మనిషి మాత్రమే ధర్మాన్ని అతిక్రమించి చరిస్తూవుంటాడు. అందువలనే పురాణాలు, శాస్త్రాలు, వేదాలు వంటివి వెలువడి మనిషికి మార్గదర్శనం చేస్తూ వుంటాయి. ధర్మప్రబోధం విషయంలో ఏ మతమైనా ఒక్కటే గురువులను అనుసరించమని వారి బోధనలు పాటించమని చెబుతారు. కాని వివరించే విధానంలో ఆచరించే క్రమంలో తేడా గోచరించవచ్చును. అంతిమ సూత్రం మాత్రం ఒక్కటే. నిస్వార్థము. పరోపకారం వున్న మనిషి ధర్మ నిరతుడై జీవించి తన తోటివారికి కూడా జీవించే అవకాశం కల్పిస్తాడు.

దేవులపల్లి పద్మజ



ఆధ్యాత్మికం

# చిట్టింట పొట్టు

చిట్టింట పొట్టు ఆకు.. మా ఇంట్లో అందరికీ మహా ఇష్టం. ఈ పేరెక్కడా వినలేదే అనేవాళ్లూ ఉన్నారు. కానీ.. ఒకసారి రుచి చూశారంటే ఇక వదల్లేనంత బాగుంటుంది. పాలకూర, తోటకూరలకు భిన్నంగా ఉంటుంది. ఇంతకీ ఈ వంటకం ఎలా చేయాలంటే పావుకిలో కందిపప్పును కడిగి.. మరీ మెత్తబడకుండా కాస్త పలుకుగా ఉంటే ఉడికించి నీళ్లు ఇవ్వాలి. అరకిలో చిట్టింట పొట్టు ఆకును పుల్లలు లేకుండా తీసి కడిగి, నలిపి ఉంచుకోవాలి. కడాయి నూనె కాకనిచ్చి, చెంచా చొప్పున పచ్చి శనగపప్పు, మినప్పప్పు, అరచెంచ ఆవాలు, నాలుగు ఎండు మిరపకాయలు, జీలకర్ర వేసి వేగనివ్వాలి. అందులో వార్చిన కందిపప్పు, చిట్టింట పొట్టు ఆకు వేసి కలియతిప్పి, మూత పెట్టి సన్న సెగ మీద ఉడికించాలి. మగ్గిన తర్వాత ఉప్పు, పసుపు, కారం, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి దంచితే సరి.. ఘుమఘుమలాడే చిట్టి



పొట్టు ఆకు కూర సిద్ధమైపోతుంది. ఇది అరుదైన ఆకు. అన్ని చోట్లా, అన్నిసార్లూ దొరకదు కనుక ఎండబెట్టి అమ్ముతారు. తెచ్చి భద్రం చేసుకుంటే కావాలనుకున్నప్పుడు వండుకోవచ్చు. ఇది విభిన్న రుచితో ఆకట్టుకోవడమే కాదు... శరీరానికి ఔషధంలా పనిచేస్తుంది. మోకాళ్ల నొప్పులు రావు. ఈ ఆకుతో ఇగురు కూడా చేసుకోవచ్చు. □

# బార్లీతో ఫేషియల్ !

శరీరం చక్కగా ప్రకాశవంతంగా మెరుస్తూ ఉండాలని అందరికీ ఉంటుంది.కానీ మచ్చలు మొటిమలు జిడ్డు చర్మం.. ఇలా ఎన్నో సమస్యలు ఇలాంటి వాటన్నింటికీ చెక్ పెడుతుంది ఈ బార్లీ ఫేషియల్



!కావాల్సినవి : బార్లీ గింజలు పొడి – రెండు చెంచాలు, గోరువెచ్చటి నీళ్లు– సరిపడా

**తయారీవిధానం :** ముందుగా ఒక పాత్రలో బార్లీ గింజలు పొడిని తీసుకుని అందులో కొద్దికొద్దిగా గోరువెచ్చటి నీళ్లు పోసుకుంటూ ముద్దలా కలుపుకోవాలి.



**ఫేషియల్ ఇలా ..** ఇలా తయారు చేసు కున్న మిశ్రమాన్ని చర్మంపై నల్ల మచ్చలు ఉన్న చోట పూసి ఓ పదిహేను నిమిషాల పాటు ఆర నివ్వాలి. తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రంగా కడిగేసుకుని మెత్తని గుడ్డతో తుడుచుకుంటే సరిపోతుంది. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే చర్మంపై ఉండే మచ్చలు, మృత కణాలు తొలగి పోయి చర్మం నాజూగ్గా, ప్రకాశవంతంగా తయారువుతుంది. □



# భారత్, ఇంగ్లండ్ టెస్టుల్లో...
# అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్లు
### టీమిండియా నుండి సచిన్, గవాస్కర్, కోహ్లీ

**న్యూఢిల్లీ:** టెస్ట్ సిరీస్ నిమిత్తం ఇంగ్లాండ్ పర్యటనకు టీమిండియా తరలివెళ్లింది. ఈ పర్యటనలో టీమ్ఇండియా ఆతిథ్య ఇంగ్లాండ్‌తో 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ బరిలోకి దిగనుంది. ఇక ఈ సిరీస్ జూన్ 20 నుంచి ప్రారంభం కానుంది. ఈ క్రమంలో భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఇప్పటి వరకు జరిగిన టెస్టు మ్యాచ్‌ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్లలో టీమిండియా నుండి సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ ఉన్నారు. భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన టెస్టు మ్యాచ్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడి రికార్డు జోరూట్ పేరిట ఉంది. ఇప్పటి వరకు జోరూట్ భారత్ పై 30 టెస్టులు ఆడాడు. 55 ఇన్నింగ్స్‌ల్లో 58.08 సగటుతో 2846 పరుగులు చేశాడు. ఇందులో 10 శతకాలు, 11 అర్ధశతకాలు ఉన్నాయి. ఈ జాబితాలో భారత దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ రెండో స్థానంలో నిలిచాడు. ఇంగ్లాండ్ పై సచిన్ 32 టెస్టులు ఆడాడు. 51.73 సగటుతో 2535 పరుగులు చేశాడు. ఇందులో 7 సెంచరీలు, 13 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అలాగే టీమిండియా స్టార్ సునీల్ గవాస్కర్ మూడో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్ గవాస్కర్ 38 టెస్టులు ఆడాడు. 38.20 సగటుతో 2483 పరుగులు చేశాడు. ఇందులో 4 శతకాలు, 16 అర్ధశతకాలు ఉన్నాయి. అలాగే ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ నాలుగో స్థానంలో నిలిచాడు. కుక్ భారత్ పై 30 టెస్టులు ఆడాడు. 54 ఇన్నింగ్స్‌ల్లో 47.66 సగటుతో 2431 పరుగులు చేశాడు. ఇందులో 7 శతకాలు, 9 అర్ధశతకాలు ఉన్నాయి. ఇక ఈ జాబితాలో విరాట్ కోహ్లీ ఐదో స్థానంలో నిలిచాడు. ఇంగ్లాండ్ పై కోహ్లీ 28 టెస్టులు ఆడాడు. 42.36 సగటుతో 1991 పరుగులు చేశాడు. ఇందులో 5 శతకాలు, 9 అర్ధశతకాలు ఉన్నాయి.

### ఫ్రెంచ్ ఓపెన్‌లో మహిళల
# డబుల్స్ విజేత ఎర్రానీ-పయోలిని

**న్యూఢిల్లీ:** గత కొన్ని సంవత్సరాలుగా, ఆల్ ఇటాలియన్ జత సారా ఎర్రానీ-జాస్మిన్ పావోలిని హోలాజిక్ డబ్ల్యూటిఎ టూర్‌లో డబుల్స్‌లో అత్యధిక వియాలు సాధించిన జట్లలో ఒకటిగా నిలిచాయి. ఆదివారం, వారు చివరికి వారి ఖాతాలో గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను జోడించారు.

ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్-2025, మహిళల డబుల్స్‌లో ఈ ఇటాలియన్ జంట విజేతగా నిలిచింది. రెండవ సీడ్ ఇటాలియన్ ద్వయం సారా ఎర్రానీ-జాస్మిన్ పావోలిని మహిళల డబుల్స్ కిరీటాన్ని గెలుచుకున్నారు. అదివారం సాయంత్రం జరిగిన ఫైనల్‌లో




2025 రోలాండ్ గారోస్ చివరి మహిళల మ్యాచ్‌లో, నంబర్ 2 సీడ్స్ ఎర్రానీ మరియు పావోలిని కజకిస్తాన్‌కు చెందిన అన్‌సీడెడ్ అన్నా డానిలినాను ఓడించారు. అలాగే అలెగ్జాండ్రా క్రునిక్ ఫ్రెంచ్ ఓపెన్ మహిళల డబుల్స్ టైటిల్‌ను సెర్బియాకు చెందిన 6-4, 2-6, 6-1 తేడాతో కైవసం చేసుకుంది. 2012లో ఎర్రానీ రాబర్టా విన్సీతో జతకట్టిన తర్వాత రోలాండ్ గారోస్ మహిళల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్న తొలి ఇటాలియన్లుగా నిలిచి, డానిలినా మరియు క్రునిక్‌లను మరో ఓటమి పాలు చేయడానికి 2 గంటల 15 నిమిషాలు పట్టింది.

ఇటాలియన్ ఓపెన్ 2025 సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న తర్వాత, జాస్మిన్ పావోలినీ ఫ్రెంచ్ ఓపెన్ 2025 లో నాల్గవ సీడ్‌గా ఉంది. కాగా మాజీ జూగితి డబుల్స్ ప్రపంచ నంబర్ 1 ఎర్రానీ ఇప్పుడు మహిళల డబుల్స్‌లో ఆరు గ్రాండ్ స్లామ్ టైటిళ్లను గెలుచుకుంది మరియు ఇది ఒక దశాబ్దంలో ఆమెకు మొదటిది.

ఆమె మరియు ఆమె స్వదేశీయురాలు విన్సీ 2012 మరియు 2014 మధ్య ఒక లెజెండరీ జట్టు, వారు మహిళల డబుల్స్‌లో కెరీర్ గ్రాండ్ స్లామ్‌ను పూర్తి చేశారు.

### హాకీ ప్రో లీగ్‌లో నెదర్లాండ్స్
# ఘన విజయం
### భారత్ 1-2 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ప్రో లీగ్‌లో భారత్‌కు చెందిన హర్మన్‌ప్రీత్ అండ్ కో ప్రపంచ నంబర్1 జట్టు నెదర్లాండ్స్‌తో పోరాడి ఓడిపోయింది. నెదర్లాండ్స్‌లో జరిగిన ప్రో లీగ్ యూరోపియన్ లెగ్ తొలి మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు ఒలింపిక్ ఛాంపియన్స్ నెదర్లాండ్స్ చేతిలో 1-2 తేడాతో ఓడిపోయింది. చివరి విజిల్‌కు రెండు నిమిషాల ముందు వాన్ డామ్ థిజ్స్ (58వ నిమిషం) ద్వారా నెదర్లాండ్స్ విజయ గోల్ కొట్టింది, అతను 25వ నిమిషంలో స్కోరును సమం చేసే గోల్ కూడా చేశాడు. మ్యాచ్‌లో తొలి పెనాల్టీ కార్నర్‌ను భారత్ జట్టు



కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 19వ నిమిషంలో గోల్‌గా మలిచి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. నెదర్లాండ్స్ అధిక ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ బలమైన నోట్‌తో మ్యాచ్‌ను ప్రారంభించి స్ఫుటమైన పాస్‌తో ఆధిపత్యం చెలాయించింది. దిల్‌ప్రీత్ సింగ్ రివర్స్ హిట్‌ను డచ్ గోల్ కీపర్ మోరిట్స్ విస్సర్ చాలా దగ్గరగా కొట్టేడు. మరో ఎండ్‌లో, మొదటి క్వార్టర్ చివరిలో థియరీ బ్రింక్‌మాన్ వత్తిడి తెచ్చినా భారత్ దాన్ని అడ్డుకుని నిలిచింది. రెండవ క్వార్టర్‌లో నెదర్లాండ్స్ లక్ష్యంతో ముందుకు వచ్చింది, 17వ నిమిషంలో స్టీజ్న్ వాన్ హీజినింగెన్ సూరజ్ కర్కేరాను పరీక్షించగా, భారత గోల్‌కీపర్ ఆ ప్రయత్నాన్ని అడ్డుకోలేక పోయాడు. దిల్‌ప్రీత్ సర్కిల్ లోపల స్టిక్ ఛాలెంజ్ ద్వారా ఆటంకం కలిగించడంతో భారత్ పెనాల్టీ కార్నర్‌ను అందుకున్నాడు. రెండవ క్వార్టర్‌లో 25వ నిమిషంలో థిజ్స్ వాన్ డామ్ గోల్ చేయడంతో ఆతిథ్య జట్టు గోల్ సాధించగలిగింది. మూడవ క్వార్టర్ తర్వాత స్కోర్లు 1-1తో ఉన్నాయి. చివరి క్వార్టర్‌లో నెదర్లాండ్స్ ఎక్కువ భాగం గోల్‌ను స్వాధీనం చేసుకుంది. ఆతిథ్య జట్టు దానిని లెక్కించింది. 58వ నిమిషంలో థిజ్స్ వాన్ డామ్ మళ్ళీ గోల్ చేశాడు. నియంత్రణ కోసం తెలివిగల మొదటి టచ్‌తో, అతను భయంకరమైన స్ట్రైక్‌తో నెదర్లాండ్స్‌కు విజయాన్ని నిర్ధారించాడు.



### తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్..
# రోహిత్, విద్యా, పూజ, కృష్ణకు స్వర్ణం
### యశస్, ట్వింకిల్‌కు రజతం.. భారత్ ఖాతాలో 10వ బంగారు పతకం

**న్యూఢిల్లీ:** తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్ 2025లో భారత్ ఖాతాలో 10వ బంగారు పతకం చేరింది. రెండో రోజు అదివారం వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో భారత్ అథ్లెట్లకు 4 బంగారు పతకాలు, రెండు రజత పతకాలు దక్కాయి. దీంతో భారత్ ఖాతాలో పతకాల సంఖ్య 12కు చేరింది. భారత్ అథ్లెట్లు రోహిత్ యాదవ్, విధ్యా రామరాజ్, పూజా, కృష్ణ కుమార్‌లు స్వర్ణ పతకాలు సాధించగా, యశస్ పలాక్ష, ట్వింకిల్‌చౌదరికి రజతాలు దక్కించుకున్నారు. తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్ 2025లో భారతదేశం యొక్క అద్భుతమైన పరుగు కొనసాగింది. ఈ ఈవెంట్ రెండవ రోజు పురుషుల జావెలిన్ త్రోలో రోహిత్ యాదవ్ స్వర్ణం సాధించాడు. రెండుసార్లు జాతీయ ఛాంపియన్ అయిన రోహిత్ 71.46 త్రోతో బలంగా ప్రారంభించాడు, ఇది మొదటి రౌండ్ తర్వాత అతన్ని రెండవ స్థానానికి చేర్చింది. 24 ఏళ్ల అతను తన రెండవ ప్రయత్నంలో 74.25 మీటర్లు విసిరి అగ్రస్థానానికి చేరుకున్నాడు. మరియు చివరి ప్రయత్నంలో 74.42 మీటర్లు విసిరి బంగారు పతకాన్ని సాధించాడు. ఇది రోహిత్ వ్యక్తిగత అత్యుత్తమ రికార్డు 83.40 మీటర్లకు తక్కువగా ఉన్నప్పటికీ, ఈ రెండు రోజుల అథ్లెటిక్స్ మీట్‌లో భారతదేశం తరపున ఏడవ బంగారు పతకాన్ని సాధించడానికి సరిపోయింది. అలాగే మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో, విధ్యా రామ్‌రాజ్ 56:53 సమయంతో అత్యున్నత స్థానాన్ని సంపాదించి, రెండు అథ్లెటిక్స్ మీట్‌లో భారతదేశం యొక్క బంగారు పతకాల సంఖ్యను ఎనిమిదికి చేర్చింది. ఇంతలో, యశస్ పలాక్ష 400 మీటర్ల పురుషుల హర్డిల్స్‌లో రజతం గెలుచుకున్నాడు. ఇక మహిళల 800 మీటర్ల ఈవెంట్‌లో కూడా భారతదేశం ఆధిపత్యం చెలాయించింది, పూజ (2:02.79 సెకన్లు ఛాంపియన్‌షిప్ రికార్డ్) మరియు ట్వింకిల్ చౌదరి (2:06.96 సెకన్లు) వరుసగా స్వర్ణం మరియు రజతం గెలుచుకున్నారు. 1500 మీటర్ల ఈవెంట్ గెలిచిన తర్వాత పూజకు ఈ టోర్నమెంట్‌లో ఇది రెండవ స్వర్ణం కావడం విశేషం. కాగా పురుషుల 800 మీటర్ల పరుగులో కృష్ణ కుమార్ 1:48.46 సెకన్ల సమయంతో భారతదేశం తరపున 10వ బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు, ఇది ఛాంపియన్‌షిప్ రికార్డు. అదే ఈవెంట్‌లో, జాతీయ రికార్డు హోల్డర్ మహమ్మద్ అఫ్సల్ ఫైనల్‌కు చేరుకున్నాడు.

# మహిళల వన్డే.. ఇంగ్లండ్‌దే సిరీస్
### వెస్టిండీస్ 3-0తో వైట్‌వాష్

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్, వెస్టిండీస్ మధ్య జరిగిన 3వ మహిళల వన్డేలో ఆతిథ్య జట్టు సిరీస్‌ను పూర్తిగా కైవసం చేసుకుంది. నాట్ స్కైవర్‌బ్రంట్ అజేయ అర్ధ సెంచరీ, సారా గ్లెన్ కీలకమైన మూడు వికెట్ల ప్రదర్శనతో ఇంగ్లాండ్‌లోని టౌంటన్‌లో జరిగిన మూడవ మరియు చివరి మహిళల వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 9 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. ఈ విజయంతో ఆతిథ్య జట్టు 3-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది, వర్షంతో ఆటంకం ఏర్పడి ఆటను 21 ఓవర్లకు మ్యాచ్ సమయాన్ని తగ్గించింది. ఇంగ్లాండ్ 1 వికెట్‌కు 109 (స్కైవర్‌బ్రంట్ 57) వెస్టిండీస్ ను 8 వికెట్లకు 106 (జోసెఫ్ 34, గ్లెన్ 321, ఆర్లాట్ 215) తొమ్మిది వికెట్ల తేడాతో డక్వర్త్ లూయిస్ పద్ధతి ఓడించింది. వర్షం కారణంగా ఐదు గంటల పాటు ఆట ఆగిపోయిన తర్వాత తిరిగి ప్రారంభమైంది. వెస్టిండీస్ 12.3 ఓవర్లలో 3 వికెట్లకు 43 పరుగులు చేసి మ్యాచ్‌ను 21 ఓవర్లకు కుదించింది. కియానా జోసెఫ్ 34 పరుగులతో అత్యధిక స్కోరు సాధించగా, ఆలియా అల్లీన్ 18 బంతుల్లో 27 పరుగులు చేయడంతో వెస్టిండీస్ ఇన్నింగ్స్ ముగిసే సమయానికి 8 వికెట్లకు 106 పరుగులు చేసింది. ఎమ్ ఆర్లాట్ తొలి దశలోనే బ్యాటింగ్ ప్రారంభించిన తర్వాత, వెస్టిండీస్ స్కోరును అడ్డుకునేందుకు పునఃప్రారంభమైన తర్వాత గ్లెన్ మూడు వికెట్లు తీశాడు. ఇంగ్లాండ్ టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకుంది. రెండవ బంతికే యువ క్రీడాకారిణి రియాలియానా గ్రిమ్మండ్‌ను కేట్ క్రాస్ అవుట్ చేయడంతో ఇంగ్లాండ్‌కు ఇది మంచి ఆరంభమైంది. రెండు ఓవర్లలో సీమర్ ఆర్లాట్ వేసిన రెండు వికెట్లు వెస్టిండీస్ జట్టును ఇబ్బంది పెట్టాయి. వెస్టిండీస్ స్టాండ్‌ఇన్ కెప్టెన్ 35 బంతుల్లో 18 పరుగులు చేసి నెమ్మదిగా స్టంప్ చేయబడ్డాడు. తదుపరి ఓవర్‌ను గ్లెన్ షబికా గజ్నాబి బౌలింగ్ చేశాడు మరియు ఆలిస్ దేవిడ్సన్‌రిచర్డ్స్ మిడ్‌ఆఫ్‌లో గాలి నుండి పదునైన ఒంటిచేత్తో క్యాచ్‌ను లారెన్ ఫైలర్ బౌలింగ్‌లో జానిలియా గ్లాస్గోను తొలగించాడు. గ్లెన్ బౌలింగ్‌లో డీప్ మిడ్‌వికెట్‌కు బౌలింగ్ వేయడానికి ముందు ఆమె తన స్కోరుకు మరో 13 పరుగులు జోడించింది, కానీ ఫైలర్ బౌలింగ్‌లో వరుసగా ఐదు ఫోర్లు కొట్టి, చివరి బంతిని పాయింట్ వద్ద డంక్లీకి క్యాచ్ ఇచ్చిర ఆలియా అల్లీన్ గ్లెన్‌కు మూడో క్యాచ్ ఇచ్చింది.

# వాణిజ్యం

# ఎన్ఆర్ఐలకు పెట్టుబడుల అలర్ట్..

**ముంబై, జూన్ 8:** ఒక ఎన్ఆర్ఐగా మీరు ఒక దేశంలో సంపాదిస్తూ ఉండవచ్చు. అలాగే మరో దేశంలో కుటుంబ సంబంధాలను కలిగి ఉండవచ్చు. అయితే ఇలాంటి వారు ఇప్పటికీ భారత దేశంలో పెట్టుబడులు లేదా ఆస్తిని కొనసాగించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక ఆసక్తులు సరిహద్దులు దాటుతున్నందున ప్రస్తుత రోజుల్లో అనువైన, సమర్థవంతమైన పెట్టుబడి వ్యూహాన్ని కలిగి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పెట్టుబడి ప్రణాళికను రూపొందించేటప్పుడు ప్రపంచ దృక్పథాన్ని అవలంబిస్తున్నారు.




చాలా మంది ఎన్ఆర్ఐలు తమ సంపదలో ఎక్కువ భాగాన్ని ఒకే మార్కెట్‌తో తరచుగా భారతదేశంతో ముడిపెట్టి పెట్టుబడి పెడుతున్నారు. భారతదేశం బలమైన వృద్ధి అవకాశాలను అందిస్తున్నప్పటికీ భౌగోళిక ప్రాంతాలలో వైవిధ్యం చూపడం వల్ల ప్రమాదాన్ని తగ్గించి, రాబడిని పెంచుతుందని పెట్టుబడిదారులు అంచనా వేస్తున్నారు. ఉదాహరణకు యూఎస్ టెక్నాలజీ కంపెనీలు మరియు యూరోపియన్ డివిడెండ్‌చెల్లించే స్టాక్‌లకు ఎక్స్‌పోజర్‌తో భారతీయ ఈక్విటీలను కలపడం వల్ల వృద్ధి, స్థిరత్వం రెండూ లభిస్తాయని ఎన్ఆర్ఐలు ఆలోచిస్తున్నారు. యూరప్‌లో నియంత్రించబడే యూసీఐటీఎస్ నిధులు లేదా గిఫ్ట్ సిటీ (భారతదేశం యొక్క అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రం) వద్ద భారతదేశంకేంద్రీకృత ఏఐఎఫ్‌లు వంటి విస్తృత శ్రేణి పెట్టుబడి ఎంపికలను ఎంచుకుంటున్నారు. ఈ తరహా చర్యలు ప్రపంచ పెట్టుబడిని సులభతరం చేయడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న కుటుంబ సభ్యులతో ఎన్ఆర్ఐల కోసం మెరుగైన పన్ను నిర్వహణ, నిధులను సులభంగా స్వదేశానికి తరలించడంతో దీర్ఘకాలిక ఎస్టేట్ ప్రణాళికకు మద్దతు ఇస్తాయి. కరెన్సీ అనేది చాలా మంది పెట్టుబడిదారులు పట్టించుకోని మరో ముఖ్యమైన అంశం.

మీరు యూఎస్ డాలర్లలో సంపాదిస్తూ భారతరూపాయిలలో పెట్టుబడి పెడితే, మీ రాబడి కరెన్సీ కదలికల ద్వారా స్వయం చాలకంగా ప్రభావితమవుతుంది. అందువల్ల యూఎస్‌డీ, ఐఎన్ఆర్, జీబీపీ, ఈయూఆర్ వంటి బహుళ కరెన్సీలలో పెట్టుబడులను కలిగి ఉండటం వల్ల రిస్క్‌ను తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సాంప్రదాయ రియల్ ఎస్టేట్, బంగారం, స్థిర ఆదాయం, యూఎస్ ఈక్విటీలకు మించి ఎన్ఆర్ఐలు తమ పెట్టుబడులను మరింతగా వైవిధ్యపరుస్తున్నారు. హెడ్జ్ ఫండ్స్, ప్రైవేట్ ఈక్విటీ, ఆర్ఈఐటీలు, ప్రైవేట్ క్రెడిట్‌లపై ఇటీవల పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతోంది. యూఎస్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత కలిగిన కరెన్సీగా ఉంటుంది. అలాగే ఈక్విటీ మార్కెట్ స్థిరంగా ఉన్నప్ప టికీ ఎన్ఆర్ఐలు ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్నారు.

# పోస్టల్ శాఖలో కొత్తగా డిజిపిన్ వ్యవస్థ

**న్యూఢిల్లీ, జూన్ 8:** పోస్టల్ పిన్‌కోడ్‌లో కీలక మార్పులు జరగనుంది. మీరు చివర్లో మీ చిరునామా ఇచ్చినప్పుడు పిన్ కోడ్ వల్ల ఉపయోగం ఏమిటో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? పిన్‌కోడ్ అనేది భారతదేశంలోని ఒక ప్రాంతాన్ని లేదా ప్రదేశాన్ని గుర్తించడానికి పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన 6 అంకెల సంఖ్య. ఇది ఏ కొరియర్ వ్యక్తిని మీ చిరునామాకు ఖచ్చితంగా మళ్లించదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని, భారత పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఒక కొత్త అడ్రస్సింగ్ సిస్టమ్‌ను విడుదల చేసింది. దీనికి డిజిపిన్ అని పేరు పెట్టారు.




దీని ఉద్దేశం దేశంలోని ఏ మూల ఖచ్చితమైన చిరునామాను డిజిటల్ రూపంలో అందించడం. ఈ కొత్త వ్యవస్థ అంటే ఏమిటి? మీరు మీ డిజిపిన్‌ను ఎలా కనుగొనవచ్చో తెలుసుకుందాం. డిజిపిన్ అనేది ఐఐటీ హైదరాబాద్, ఇస్రో సహకారంతో పోస్టల్ శాఖ అభివృద్ధి చేసిన కొత్త డిజిటల్ అడ్రస్ సిస్టమ్. ఈ వ్యవస్థ ఉద్దేశం భారతదేశంలోని ఏ ప్రదేశానికైనా లేదా ప్రదేశానికైనా ఖచ్చితమైన డిజిటల్ గుర్తింపు లేదా ఐడిని అందించడం. ఈ కోడ్ ఏదైనా ప్రదేశం అక్షాంశం, రేఖాంశంపై ఆధారపడి ఉంటుంది. ఈ వ్యవస్థ సహాయంతో ఏదైనా వీధి లేదా గ్రామం ఖచ్చితమైన చిరునామాను సులభంగా కనుగొనవచ్చు. ఇప్పుడు ఏ కొరియర్ లేదా ఏ వ్యక్తికి మీ చిరునామాను చేరుకోవడంలో ఎటువంటి సమస్య ఉండదు. డిజిపిన్, పిన్‌కోడ్ రెండూ చిరునామాలను గుర్తించడానికి ఉపయోగించినప్పటికీ, వాటి పని విధానం పూర్తిగా భిన్నంగా ఉంటుంది. పిన్‌కోడ్ అనేది చాలా పెద్ద ప్రాంతాన్ని గుర్తించే 6 అంకెల సంఖ్య. డిజిపిన్ అనేది భారతదేశంలోని ఏదైనా ప్రదేశం ఖచ్చితమైన స్థానాన్ని గుర్తించడంలో సహాయపడే డిజిటల్ స్థాన వ్యవస్థ. పిన్‌కోడ్ 6 అంకెలతో కూడి నట్లే, డిజిపిన్ అనేది 10 అక్షరాల ప్రత్యేక కోడ్. ఈ వ్యవస్థలో మొత్తం దేశం 4/4 మీటర్ల గ్రిడ్‌గా విభజించారు. దీని తరువాత, ప్రతి భాగానికి 10 అక్షరాల ప్రత్యేక కోడ్ అందిస్తారు. మొత్తంమీద డిజిపిన్ మరింత ఖచ్చితమైన స్థానాన్ని ఇస్తుంది.

# ఐపిఒల బాటపడుతున్న కంపెనీలు

**ముంబై, జూన్ 8:** ఇటీవల ఐపీఓలకు వెళ్లే కంపెనీల సంఖ్య కొద్దిగా మందగించింది. ఈ నేపథ్యంలో ఆరు సంస్థలు రూ.20,000 కోట్ల వరకు సమీకరించడానికి అనుమతించిన తర్వాత ఐపీఓ మార్కెట్‌కు మార్కెట్ నియంత్రణ సంస్థ నుంచి బూస్టర్ డోస్ లభించింది. ఇందులో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ (రూ.12,500 కోట్లు), డోర్ఫ్ కేటల్ కెమ్స్ (రూ. 5,000 కోట్లు), విక్రమ్ సోలార్ (రూ.1,500 కోట్లు)తో పాటు మరో మూడు కంపెనీలు ఉన్నాయి. ఈ అనుమతులతో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) నుంచి అనుమతి పొందిన 72 కంపెనీల ఐపీఓల నిధుల సమీకరణ రూ.1.4 లక్షల కోట్లకు చేరుకుందని ఇటీవల వెల్లడైన డేటా ప్రకారం తెలుస్తోంది. అలాగే మరో 68 కంపెనీలు రూ.95,000 కోట్ల వరకు సేకరించడానికి సెబి ఆమోదం కోసం వేచి ఉన్నాయి. మొత్తం మీద 140 సంస్థలు రూ. 2.35 లక్షల కోట్ల వరకు సేకరించవచ్చు. మార్చి, ఏప్రిల్ నెలల్లో కొంత ప్రశాంతత కనిపించిన తర్వాత మే నెలలో ఐపిఒ కార్యకలాపాలు కొంత ఊపందుకున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. దీనివల్ల కంపెనీలు మరిన్ని ఇష్యూలతో ముందుకు రావడానికి విశ్వాసం కలిగిందని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల జాబితాలో కొన్ని ప్రముఖ కంపెనీలు ఉండడం విశేషం.

ఏథర్ ఎనర్జీ, ఏజిస్ వోపాక్ టెర్మినల్స్, స్మాక్స్ బెంగళూరు, స్కోడా ట్యూబ్స్ వంటి కంపెనీలు ఇష్యూ సైజులను 1530 శాతం తగ్గించుకున్నాయి. అయితే ఆయా కంపెనీ లిస్టింగ్ లాభాలు కూడా అద్భుతంగా లేవు. ఉదాహరణకు ఏథర్ ఎనర్జీ లిస్టింగ్‌లో 2.18 శాతం ఎక్కువగా లిస్టింగ్ చేయగా, ఏజిస్ వోపాక్, స్మాక్స్ బెంగళూరు రెండూ 6 శాతం తగ్గింపుతో లిస్టింగ్ చేశాయి. స్కోడా ట్యూబ్స్ ఫ్లాట్‌గా లిస్టింగ్ చేసింది. అలాగే వీటి పనితీరు 2025 ఆర్థిక సంవత్సరంలో లో కనిపించిన 30 శాతం బేసి లిస్టింగ్ లాభాలకు చాలా దూరంగా ఉంది. మార్కెట్‌ను స్థిరీకరించడంతో పాటు దేశీయ, విదేశీ పెట్టుబడిదారుల




నుంచి వచ్చే పెట్టుబడులను గ్రహించడంలో ఐపీఓ సరఫరా ముఖ్యమైన పాత్ర పోషించిందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో పేలవమైన పనితీరును దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌కు ఏదో ఒక రకమైన ఉత్ప్రేరకం అవసరమని వివరిస్తున్నారు. ముఖ్యంగా పెట్టుబడిదారులలో పెట్టుబడులపై ఉత్సాహం కొరవడిందని, చాలా ఐపీఓల్లో పెట్టుబడి కూడా లివరేజ్ ద్వారా జరుగుతుంది కాబట్టి ఖర్చు ప్రయోజనం పెట్టుబడిదారుడిలోనే ఉండాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# ఇండస్ ఇండ్ బ్యాంకులో అన్ని సేవలకు ఒకే యాప్..

**న్యూఢిల్లీ, జూన్ 8:** ఇండస్ఇండ్ బ్యాంక్ తన అధునాతన ఆర్థిక యాప్ ఇండీని మరింతగా విస్తరించుకుంటోంది. 1.5 కోట్ల మందికి పైగా ఉన్న రిటైల్ బ్యాంకింగ్ కస్టమర్లందరికీ ఈ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. సేవింగ్స్ అకౌంట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రుణాలు, క్రెడిట్ కార్డులు, మ్యూచువల్ ఫండ్స్ సహా అనేక సేవలను ఒకే డిజిట్ వేదికగా అందిస్తోంది. ఈ యాప్ ఇప్పటికే గణనీయమైన పురోగతిని సాధించింది.




1.4 మిలియన్లకు పైగా కొత్త ఖాతాలు తెరవబడ్డాయి. 50శాతం నెలవారీ యాక్టివ్ యూజర్ రేటు - పరిశ్రమ బెంచ్‌మార్క్ 40శాతం కంటే చాలా ఎక్కువగా ఉంది. ఈ యాప్ నంబర్‌లెస్ డెబిట్ కార్డ్, వర్చువల్ సింగిల్‌యూజ్ కార్డ్, డైనమిక్ ఏటీఎం పిన్‌లు వంటి వినూత్న ఫీచర్లను అందిస్తుంది. ఈ యాప్ ద్వారా డిజిటల్, బ్రాంచ్‌రహిత ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ ద్వారా రోజువారీ బ్యాంకింగ్ లావాదేవీలు సులభతరం చేసేలా ఉంది. ఈ సందర్భంగా ఇండస్ఇండ్ బ్యాంక్ డిజిటల్ బ్యాంకింగ్, స్ట్రాటజీ హెడ్ చారు సచ్‌దేవా మాథుర్ మాట్లాడుతూ, ప్రస్తుత రిటైల్ వినియోగదారులందరికీ ఈ యాప్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.

# ఈ బ్యాంకుల క్రెడిట్ కార్డుల్లో మార్పులు..

**ముంబై, జూన్ 8:** భారతదేశంలో ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకులుగా ఉన్న హెచ్‌డీ ఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు తమ క్రెడిట్ కార్డు వినియోగదారులకు కీలక విషయాలను తెలిపాయి. ఈ బ్యాంకుల క్రెడిట్ కార్డ్ కలిగి ఉంటే జూలై 1, 2025 నుంచి నియమాలు మారతాయని వివరించాయి. ఆయా మార్పుల గురించి మరిన్ని వివరాలను చూద్దాం.

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు నిబంధనలు:** హెచ్‌డీఎఫ్‌సీబ్యాంక్ ఆన్‌లైన్ గేమింగ్, వాలెట్ లోడ్‌లు, బీమా లావాదేవీలపై రివార్డ్ పాయింట్లకు సంబంధించిన ఛార్జీలను సవరిస్తోంది. ఈ అప్‌డేట్స్ మీరు మీ క్రెడిట్ కార్డ్‌ను ఉపయోగించే విధానాన్ని ప్రభావితం చేయవచ్చు. మీరు ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నెలకు రూ.10,000 కంటే ఎక్కువ ఖర్చు చేస్తే ఆ మొత్తంపై 1 శాతం రుసుము వసూలు చేస్తారు. అయితే మీరు ఎంత ఖర్చు చేసినా ఈ రుసుము నెలకు రూ.4,999కి పరిమితం చేశారు. అలాగే క్రెడిట్ కార్డును వినియోగించి థర్డ్‌పార్టీ వాలెట్‌కి (పేటీఎం, మొబిక్విక్, ఫ్రీచార్జ్, లేదా ఓలా మనీ వంటివి) ఒక నెలలో రూ.10,000 కంటే ఎక్కువ యాడ్ చేస్తే ఆ మొత్తం లావాదేవీ మొత్తానికి 1 శాతం రుసుము కూడా వసూలు చేస్తారు. మీ యుటిలిటీ బిల్లు చెల్లింపులు నెలకు రూ.50,000 దాటితే మొత్తం ఖర్చుపై 1 శాతం ఛార్జ్ చేస్తాయి. అయితే బీమా చెల్లింపులు ఎటువంటి అదనపు రుసుమును వసూలు చేయవు.



అలాగే అద్దె చెల్లింపులపై 1 శాతం రుసుము మునుపటిలాగే కొనసాగుతుంది. రూ.15,000 కంటే ఎక్కువ ఇంధన ఖర్చులకు, 1 శాతం రుసుము వర్తిస్తుంది, కానీ గరిష్ట రుసుము రూ.4,999కి పరిమితం చేస్తారు.

**ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు నిబంధనలు:** ఐసీఐసీఐ బ్యాంక్ తన సేవా ఛార్జీలు, వినియోగ నిబంధనలను కూడా నవీకరించింది. నగదు డిపాజిట్లు, చెక్కులు, డిమాండ్ డ్రాఫ్ట్‌లు, పే ఆర్డర్ లావాదేవీల కోసం కస్టమర్లు ఇప్పుడు డిపాజిట్ చేసిన ప్రతి రూ.1,000కి రూ.2 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. కనీస ఛార్జీ రూ.50, గరిష్టంగా రూ.15,000 ఉంటుంది. గతంలో రూ.10,000 వరకు డిపాజిట్‌లకు రూ.50, పెద్ద మొత్తాలకు రూ.1,000కి రూ.5 చొప్పున వసూలు చేసేవారు. ఏటీఎం ఛార్జీలు కూడా పెరిగాయి. ఇతర బ్యాంకుల ఏటీఎంలలో మూడు ఉచిత లావాదేవీల తర్వాత ఐసీఐసీ ఆర్థిక లావాదేవీలకు రూ.23 మరియు ఆర్థికేతర లావాదేవీలకు రూ.8.50 వసూలు చేస్తుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.